హంద్రీనీవా
తూములపై నిర్లక్ష్యం..!
- నీరు అందక రైతుల ఇబ్బందులు
- 18 తూముల ఏర్పాటుతో 16,908 ఎకరాలకు సాగునీరు
3

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 7 | విజయవాడ, గురువారం 7 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 7 August 2025 | Rs

పోటీ కార్మికులతో షూటింగులు
బంద్ విచ్ఛిన్నమే లక్ష్యంగా నిర్మాతలు
అగ్రిమెంట్ కోసం ఫెడరేషన్ పట్టు
8

స్మార్ట్ మీటర్ల కోసం అప్పులు

- 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం
- పర్యాటక హోటళ్లు ప్రైవేట్‌కు
- మరో గంట అదనంగా బార్లు
- మంత్రివర్గ నిర్ణయాలు

99 పైసలకే ఐటీ కంపెనీలకు భూములు
ఎపిఐఐసి ద్వారా 30వేల ఎకరాల సేకరణ

మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజానీకం నుండి వ్యక్తమవుతున్న తీవ్ర వ్యతిరేకతను రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు. ఒకవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతుండగానే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశలో మరో కీలక నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు, వాటికి అవసరమైన లైన్లు ఏర్పాటుకోసం రుణం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో పాటు, అందుకు అవసరమైన ఇతర పనులను పూర్తి చేసేందుకు రుణాలు తీసుకోవడానికి డిస్కమ్‌లకు అనుమతి ఇవ్వాలంటూ ఇంధనశాఖ చేసిన ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ఎపిఎస్‌పిడిసిఎల్ రూ.3,544.57కోట్లు, ఎపిసిపిడిసిఎల్‌ల రూ.1,029.37కోట్ల రూపాయల రుణం తీసుకునేందుకు కేబినెట్ అనుమతించింది. మంత్రివర్గ నిర్ణయాలను మీడియాకు వివరించిన పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారథి ఈ నిర్ణయంతో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతమవుతుందని చెప్పారు. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డిఎస్‌ఎస్)లో భాగంగా విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను డిస్కమ్‌లు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. రుణం తీసుకోవడానికి ఇంధన శాఖ చేసిన ప్రతిపాదనలను ఆమోదించడం ద్వారా ఆర్‌డిఎస్‌ఎస్ అమలు వేగవంతం అవుతుందని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఐటీ, ఐటిఇఎస్ కంపెనీలకు ఎకరం 99పైసలకే భూములు అప్పగించేందుకు ఎపి ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్(లిఫ్ట్)(2024-29)పాలసీ-4.0కు ఆమోదం తెలిపామన్నారు. రాష్ట్రంలో ఐటీ, సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. బెంగళూరు,హైదరాబాద్ గుర్గావ్ వంటి నగరాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయని, ట్రాఫిక్ రద్దీ, వ్యయాలు పెరుగుతున్నాయని ఐటీ కంపెనీలు భావిస్తున్నాయని తెలిపారు. వీటిని ఇతర చోట్ల ఏర్పాటు చేసుకోవాలని ఆలోచన చేస్తున్నాయని చెప్పారు. ఆ కంపెనీల ఆహ్వానించేందుకు అత్యంత తక్కువ ధరకు భూములను అందుబాటులో ఉంచడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

భూ సేకరణకు 7,500 కోట్ల రుణం

ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సంస్థ(ఎపిఐఐసి)కి ద్వారా 30వేల ఎకరాల భూములను సమీకరించాలని నిర్ణయించామని చెప్పారు. ఈ భూముల సేకరణ కోసం అవసరమైన రూ.7500కోట్ల రుణాన్ని సేకరించాలని ఎపిఐఐసి ప్రతిపాదనను ఆమోదించామని తెలిపారు. రాష్ట్రంలో 22 చోట్ల పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హోటళ్లు, రిసార్ట్స్ నిర్వహణ, కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రాష్ట్రంలోని మహిళలకు మిగతా 7లో

మరికొన్ని నిర్ణయాలు

- పుట్టపర్తి, మొవ్వ, గన్నవరం, గాజువాక, తిరుపతి కోర్టులలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను రెగ్యులర్ ప్రతిపాదికన మంజూరు.
- అల్లూరి సీతరామరాజు జిల్లాలోని వై రామవరం మండలాన్ని ఎగువ వై రామవరం, దిగువ రామవరంగా రెండు మండలాలుగా విభజన.
- చిత్తూరు జిల్లా తమ్మిగానిపల్లె గ్రామంలో 81.2 సెంట్ల ప్రభుత్వ భూమిని ఎపిఐఐసికి ఉచితంగా బదిలీ.
- చేనేత కార్మికులకు సంబంధించిన మగ్గాలకు 200, పవర్ లూమ్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్. జిఎస్టిపై 5శాతం రాయితీ సహకార పరపతి సంఘాలకు త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు.
- తిరుపతిలో ఓబెరాయి గ్రూప్‌కు కేటాయించిన భూమిని రద్దు చేసి తిరుపతి దగ్గరలోనే పెరూరు గ్రామంలో 20 ఎకరాల కేటాయింపు.

'ఆ' తప్పులు సరిదిద్దాలి
- నియోజకవర్గాల విలీనం, జిల్లాల పేర్లు మార్పుపై సిఎం
- నెల రోజుల్లో కొత్త ప్రతిపాదనలు
- అంతర్జాతీయ సంబంధాలకోసం ఉపసంఘం
2

భారత్ ఉత్పత్తులపై అమెరికా సుంకాల పెంపును వ్యతిరేకిస్తూ కొల్‌కతాలో ట్రంప్, మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఆందోళనకారులు (ఫైల్)

ట్రంప్ మరో బాదుడు

- తాజాగా 25శాతం అదనపు వడ్డన
- 50 శాతానికి చేరిన సుంకాలు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెట్రేగిపోతున్నారు. 'ఆత్మీయ మిత్రుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ' మౌన ఫలితమేమో కానీ ట్రంప్ మాత్రం సుంకాల మీద సుంకాలు బాదేస్తున్నారు. భారత్ ఎగుమతులపై మరో 25 శాతం అదనంగా సుంకాలు పెంచుతున్నట్లు ట్రంప్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. జులై 30న ప్రకటించిన 25 శాతం సుంకంతో కలిపితే తాజా పెంపుతో సుంకాలు 50 శాతానికి చేరాయి. దీంతో భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై భారీ టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తున్నందుకు ఈ చర్య తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. మొదటి 25 శాతం సుంకం ఆగస్టు 7 నుంచి, తాజాగా ప్రకటించిన 25 శాతం సుంకం ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానుంది. భారత్ ప్రతీకార సుంకాలు విధిస్తే.. ఈ టారిఫ్‌లను మరింత పెంచి సవరించే అధికారం అధ్యక్షుడికి ఉంటుందని వైట్‌హౌస్ హెచ్చరించింది. చైనాపై 51 శాతం, మలేసియాపై 25 శాతం, శ్రీలంకపై 30 శాతం, వియత్నాంపై 20 శాతం, జపాన్‌పై 15 శాతం చొప్పున యుఎస్ సుంకాలను విధించింది. పాకిస్థాన్‌పై విధించిన 19 శాతం సుంకాలతో పోల్చితే భారత్‌ను ట్రంప్ ఏ విధంగా ట్రీట్ చేస్తున్నారో స్పష్టమవుతోంది.

మోడీ ఇప్పటికైనా స్పందించాలి : ప్రతిపక్షాలు

ట్రంప్ చర్యలను ప్రతిపక్షాల నేతలు తీవ్రంగా ఖండించారు. ట్రంప్ సుంకాల ప్రకటనలపై ఇప్పటికైనా ప్రధాని మోడీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. ట్రంప్ టారిఫ్‌లపై ప్రధాని మోడీ సమాధానం ఇవ్వాలని ఎక్స్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ సుంకాలు భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

యుఎస్ చర్యలు అన్యాయం : భారత విదేశాంగ శాఖ

అమెరికా చర్యలు అన్యాయమైనవని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ సుంకాలు అసమంజసమైనవని విమర్శించింది. దేశానికి అవసరమైన అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "అమెరికా ఇటీవల రష్యా మిగతా 7లో

ఆ 65 లక్షల మంది ఓటర్ల వివరాలివ్వండి

ఇసిని ఆదేశించిన సుప్రీం

న్యూఢిల్లీ : బీహార్ ఓటర్ల ముసాయిదా జాబితా నుండి ఎన్నికల కమిషన్ తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను అందచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు బుధవారం జారీ చేసిన ఆదేశాల్లో వివరాలను అందచేసేందుకు ఈ నెల 9వ తేది వరకు గడువు ఇస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ఆ తేదిలోగా తొలగించిన ఓటర్ల వివరాలతో పాటు, తొలగించడానికి కారణాలను కూడా తెలియచేయాలని ధర్మాసనం ఆదేశించింది త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో చేపట్టిన ప్రక్రియలో భాగంగా ఆగస్టు 1న ముసాయిదా జాబితాను ఇసి ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిని సవాలు చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అనే ఎన్‌జిఒ గతంలో సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. తాజాగా ముసాయిదా ఓటర్ల జాబితాలో తొలగించిన వారి వివరాలను

వెల్లడించాలంటూ మరో పిటిషన్ దాఖలు చేసింది. ఓటర్ల పేర్లు తొలగించడానికి వివిధ రకాల కారణాలు వుండొచ్చునని, చనిపోవడం లేదా రాష్ట్రం నుండి శాశ్వతంగా బయటకు వెళ్ళిపోవడం, రెండు చోట్ల పేర్లు వుండడం, ఎక్కడున్నారో తెలియకపోవడంవంటి పలు కారణాలు వుండొచ్చునని ఆ పిటిషన్ పేర్కొంది. అయితే, ఎన్నికల కమిషన్ తొలగింపునకు గల కారణాలను వెల్లడించలేదని పేర్కొంది. నిర్దిష్ట కారణాలతో తొలగించిన ఓటర్ల వివరాలను అసెంబ్లీ, బూత్‌ల వారీ జాబితా వారీగా అందచేయాలని కోరింది. తొలగింపులకు గల కారణాలు ఇవ్వనందున వాటిని క్రాస్ చెక్ చేసుకోవడానికి కూడా వీల్లేకుండా పోయిందని అన్నారు.

'బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓ) సిఫార్సు చేయలేదు' అని గుర్తించబడిన ఎన్యూమరేషన్ ఫారాల ఓటర్ల వివరాలను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, బూత్‌ల వారీగా ప్రచురించాల్సిందిగా పిటిషనర్లు కోరారు. దర్భంగా, కైమూర్ జిల్లాలకు సంబంధించిన సమాచారం చూసినట్లైతే బిఎల్ఓ సిఫార్సు చేయలేదు అని రాసిన ఎన్యూమరేషన్ ఫారాలను పెద్ద సంఖ్యలో అప్‌లోడ్ చేశారని పిటిషనర్ల తరపున ప్రశాంత్ భూషణ్ తెలిపారు. దర్భంగా, కైమూర్ జిల్లాల్లో వరుసగా 10.6, 12.6శాతం మందికి ఇలా బిఎల్ఓ సిపార్సు చేయలేదనే ముద్ర వేసి వుందని పేర్కొన్నారు.

వడ్డీ రేట్లు యథాతథం

ముంబయి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఈ దఫా సమీక్షలోనూ వడ్డీ రేట్లను తగ్గించనుందని ఆశించిన రుణ గ్రహీతలకు నిరాశ మిగిలింది. కీలక వడ్డీ రేట్లకు సంబంధించిన రెపోరేటును యథాతథంగా 5.5 శాతంగా ఆర్‌బిఐ ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రకటనలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగిన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) ద్రవ్య పరపతి విధాన సమీక్షా జరిగింది. ఇందులోని నిర్ణయాలను బుధవారం మల్హోత్రా మీడియాకు వెల్లడించారు. రెపో రేటును యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచాలని ఎంపిసి సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించగా.. జూన్‌లో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. రుతుపవనాలు సమృద్ధిగా ఉండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 3.1 శాతానికి తగ్గే అవకాశం ఉందని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. భారత స్థూలదేశీయోత్పత్తి 6.5 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేశారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వృద్ధికి ఆటంకంగా మారుతున్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకెళ్తోందన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రిని కోరిన సిపిఎం రాష్ట్ర ప్రతినిధి బృందం
- సానుకూలంగా స్పందించిన మంత్రి
- సమస్యల పరిశీలనకు ప్రత్యేక సెల్ ఏర్పాటుకు అంగీకారం

మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు పరిధిలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని, నిర్వాసిత కాలనీల్లో చాలాచోట్ల కనీస సౌకర్యాలు లేవని, మంచినీళ్ళు, పాఠశాలలు, డ్రెయినేజీ, రహదారి సదుపాయం కూడా లేదని, వాటిని పరిష్కరించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం, సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం నాగమణి, ఎ అశోక్, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గ సిపిఎం ప్రతినిధి బృందం, బాధితులతో కలిసి వెలగపూడి సచివాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడుకు శ్రీనివాసరావు వినతిపత్రం సమర్పించారు. ముంపు ప్రాంతంలో నెలకొన్న ఇబ్బందులన్నీ మంత్రికి వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ముంపు ప్రాంతంలో మునక గ్రామాలను గుర్తించడంలోనూ, కాంటూరు లెక్కల్లోనూ తప్పులున్నాయని తెలిపారు. దీనివల్ల ఒక గ్రామంలో సగం ముంపుగా ఉంటే మరొక సగం ముంపేతర ప్రాంతంలో ఉన్నట్లు రికార్డుల్లో రాశారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చొరవ చూపించడం లేదని తెలిపారు. ప్రాజెక్టును రెండు దశలుగా విభజించి మొదటి దశలో 20 గ్రామాలు మునిగిపోతాయని, 20 వేల మందిని నిర్వాసితులుగా తేల్చారని పేర్కొన్నారు. 2022, 2023లో జరిగిన పాదయాత్ర తదితర ఆందోళనల తర్వాత మొదటిదశ మునక గ్రామాల సంఖ్యను 38కి పెంచారని వివరించారు. నిజానికి గత వరదల్లో 40 మీటర్లకు కూడా చేరకముందే 193 గ్రామాలు మునిగిపోయాయని, ప్రజలు పెద్దయెత్తున ఆందోళన చేస్తే మరో 36 గ్రామాలను చేర్చాలని అంగీకరించినా అమలు కాలేదని పేర్కొన్నారు. దీనికి మరో రూ.5,200 కోట్లు ఖర్చవుతుందని తేల్చారని, కానీ 45.5 మీటర్ల వద్ద మునిగే గ్రామాలు కూడా గత మిగతా 7లో

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథంను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

బల్క్ డ్రగ్ పార్క్ వద్దే.. వద్దు
- ప్రజాభిప్రాయ సేకరణలో ముక్తకంఠంతో వ్యతిరేకించిన ప్రజలు
- కె.లోకనాథం అరెస్టు, పలువురు గృహ నిర్బంధం
7

'లూలూ'కు చౌకగా భూమిపై ప్రభుత్వానికి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం, విజయవాడలో 'లూలూ'కు ప్రభుత్వం భూ కేటాయింపులను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను హైకోర్టు బుధవారం విచారించింది. వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, లూలూ యాజమాన్యానికి నోటీసులిచ్చింది. విచారణను అక్టోబరు 8కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. విశాఖపట్నంలో 13.5 ఎకరాలను, విజయవాడలో 4.15 ఎకరాల భూమిని నామమాత్రపు ధరకు లూలూ మాల్ మేనేజ్‌మెంట్‌కు ఇవ్వడాన్ని విశాఖకు చెందిన పాకా సత్యనారాయణ, విజయవాడకు చెందిన న్యాయవాది సిహెచ్ వెంకటేశ్వరరావు వేర్వేరుగా వేసిన పిల్స్‌ను హైకోర్టు విచారించింది. బిడ్స్ లేకుండానే భూమి ఇచ్చారని, భూ కేటాయింపు జిఓను రద్దు చేయాలని పిటిషనర్ల లాయర్లు కోరారు. నూతన పారిశ్రామిక విధానంలో భాగంగానే లూలూ మాల్‌కు భూ కేటాయింపు జరిగిందని ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పారు.

వైసిపి ఎమ్మెల్సీపై టిడిపి కార్యకర్తల దాడి

- పులివెందుల్లో ఉద్రిక్తత



దాడిలో గాయపడ్డ వైసిపి ఎమ్మెల్సీ రమేష్ కుమార్ యాదవ్, స్థానిక నేత రామలింగారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల జడ్‌పిటిసి ఉపఎన్నికల నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పులివెందుల మండలంలోని నల్గొండువారిపల్లిలో టిడిపి కార్యకర్తలు జరిపిన దాడిలో వైసిపి ఎమ్మెల్సీ రమేష్ కుమార్ యాదవ్, ఆ పార్టీ నాయకుడు వేల్పుల రామలింగారెడ్డి గాయపడ్డారు. ఈ మేరకు వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్.వి.సతీష్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి ఎస్‌పి ఇజి.అశోక్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు నామినేషన్ల ఉప సంహరణ గడువు ఈ నెల 5వ తేదీతో ముగిసింది. దీంతో, పులివెందుల స్థానాన్ని ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో టిడిపి, వైసిపి నాయకులు హోరాహోరీగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి పులివెందుల పట్టణంలోని ఓ వివాహ ఫంక్షన్ హాలుకు వెళ్లి వస్తున్న సైదాపురానికి చెందిన వైసిపి నేతలు రమేష్‌రెడ్డి, అమరేశ్వరరెడ్డి, శ్రీకాంత్, నాగేష్, షన్మోహన్‌రెడ్డిపై దాడి జరిగింది. అదే విధంగా బుధవారం నల్గొండువారిపల్లికి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన వైసిపి ఎమ్మెల్సీ రమేష్ కుమార్ యాదవ్, వైసిపి నాయకుడు వేల్పుల మిగతా 7లో

పంద్రాగస్టు నుంచి సచివాలయంలో ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర సచివాలయంలో ప్లాస్టిక్‌పై నిషేధం అమలుకానుంది. ఈ నెల 15వ తేదీ నుంచి ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించారు. ఇప్పటికే దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్లాస్టిక్ సీసాలతో వచ్చే తాగునీరు, శీతల పానీయాలపైనా ఈ నిషేధం అమలుకానుంది. తాజాగా సచివాలయంలోకి ఇటువంటి బాటిళ్లను తీసుకొచ్చే వాహనాలకు కూడా ముందుగానే నిషేధం విషయాన్ని భద్రతాధికారులు చెబుతున్నారు. 15 తరువాత ఇటువంటి వాహనాలను అనుమతించబోమని వారు స్పష్టం చేస్తున్నారు. అయితే పూర్తి స్థాయి మార్గదర్శకాలు రాతపూర్వకంగా ఇంకా రావాల్సి ఉందని వారు చెబుతున్నారు.

హజ్ యాత్రికులకు రూ.లక్ష చెల్లింపు

- మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎంచుకుని హజ్ యాత్రను పూర్తి చేసుకున్న యాత్రికులు ఒక్కొక్కరికీ రూ.లక్ష సాయాన్ని ప్రభుత్వం చెల్లించిందని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ప్రభుత్వ హామీ మేరకు 72 మందికి రూ.72 లక్షలను మంజూరు చేసిన 24 గంటల్లోనే నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రానికి మొదటి ప్రాధాన్యతను ఇచ్చి, సాంకేతిక కారణాలతో హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి బయలుదేరి హజ్ యాత్ర పూర్తి చేసుకున్న యాత్రికులకు వారి బ్యాంకు ఖాతాలో హజ్ కమిటీ నుంచి నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

నాలా చట్టం రద్దును ఉపసంహరించుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాలా చట్టం రద్దును ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర అవసరాలకు మళ్లించరాదని, అసైన్డ్ భూములకు భూసేకరణ నుంచి మినహాయింపు ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర అవసరాలకు మళ్లించాలంటే నాలా చట్టం అడ్డు వస్తుందనే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రెండు, మూడు పంటలు పండే సాగు భూములను వ్యవసాయేతర అవసరాలకు కార్పొరేట్, పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు నాలా చట్టం రద్దును కేబినెట్ ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఇప్పటికే అభివృద్ధి పేరుతో పేద రైతులు, దళితులు అనుభవిస్తున్న లక్షలాది ఎకరాలు అసైన్మెంట్ భూములను బలవంతంగా లాక్కొని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని తెలిపారు. ఈ కారణంతో గ్రామాల్లో పేదల చేతిలో భూమి లేకుండా పోవడం, ఆర్థికాభివృద్ధి దెబ్బతినడమే కాకుండా, వ్యవసాయ కార్మికులు ఉపాధి దెబ్బతిని పెద్దయెత్తున వలస పోతున్నారని చెప్పారు. ఈ నాలా చట్టం అమలు చేయడం వల్ల వ్యవసాయ భూమి వ్యవసాయేతర అవసరాలకు మారడం వల్ల ఉపాధితోపాటు ఆహార కొరత ఏర్పడుతుందన్నారు.

ఇడి విచారణకు విజయ్ దేవరకొండ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం కేసులో తెలుగు సినీ నటుడు విజయ్ దేవరకొండ బుధవారం ఇడి విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయంలో ఆయనను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇడి అధికారులు విచారించారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌కు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన వ్యవహారంలో అధికారులు ప్రశ్నించారు. బెట్టింగ్ యాప్‌ల నుంచి తీసుకున్న పారితోషికం, కమీషన్లపై ఆరా తీశారు. బెట్టింగ్ యాప్‌ల గురించి తనకు పూర్తిస్థాయిలో అవగహనలేదని, ఇకపై ప్రచారం చేయనని విజయ్ దేవరకొండ విచారణలో వెల్లడించినట్టు తెలిసింది. విచారణ ప్రక్రియను ఇడి అధికారులు వీడియో రికార్డింగ్ చేశారు. ఇప్పటికే ఈ కేసులో నటుడు ప్రకాశ్‌రాజ్‌ను ప్రశ్నించారు. ఇదే కేసులో ఈ నెల 11న నటుడు రానా, 13న మంచు లక్ష్మీ ఇడి విచారణకు హాజరుకానున్నారు.

'ఆ' తప్పులు సరిదిద్దాలి

- నియోజకవర్గాల విలీనం, జిల్లాల పేర్లు మార్పుపై సిఎం
- నెల రోజుల్లో కొత్త ప్రతిపాదనలు
- అంతర్జాతీయ సంబంధాలకోసం ఒక ఉపసంఘం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

'గత ప్రభుత్వ హయంలో జరిగిన జరిగిన జిల్లాల పేర్లు మార్పు, కొన్ని నియోజకవర్గాలను ఇతర జిల్లాల్లో విలీనం చేయడం వంటి అంశాల్లో గందరగోళం నెలకొంది. అనేక లోపాలు చోటుచేసుకున్నాయి. ఆ తప్పులను సరిదిద్దాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు అన్నారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం వివిధ అంశాలపై ఆయన మంత్రులతో విడిగా మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ అంశం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం వేగంగా తుది నివేదికను తయారు చేయాలని ఆయన అన్నారు. నెలరోజల్లో కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, గతంలో జరిగిన తప్పులను సరిదిద్దులా ఆ ప్రతిపాదనలు ఉండాలనిసిఎం చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో చేయూతనందించేందుకు సింగపూర్ ప్రభుత్వం, అక్కడి సంస్థలు ముందుకు వచ్చినా గత ప్రభుత్వం ఆ చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని చంద్రబాబు ఆరోపించారు. జగన్ చర్యల కారణంగా సింగపూర్ ప్రభుత్వం భయపడే పరిస్థితి తలెత్తిందన్నారు. ఆ పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రస్తుతం తాను ఎంతో కష్టపడి ప్రయత్నిస్తున్నానని వివరించారు. నవంబర్‌లో జరిగే పెట్టుబడుల సదస్సుకు కూడా వచ్చేందుకు కూడా సింగపూర్ ప్రభుత్వం అంతతేలిగ్గా అంగీకరించలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కొందరు సింగపూర్ వెళ్లి కేసులు పెడతామంటూ అక్కడి వారిని బెదిరించారని చెప్పారు. సింగపూర్ విధానాలను అధ్యయనం చేసేందుకు మంత్రులు దశలవారీగా ఆ దేశాన్ని సందర్శించాలని సూచించారు. అలాగే ఇతర దేశాలతో సంబంధాల కోసం ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని కూడా ఏర్పాటుచేయనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందని వ్యాఖ్యానించారు.

ఇష్టానుసారంగా ఫోటోలు దిగొద్దు

కొద్ది రోజులుగా నాయకులతో కొంతమంది దిగిన ఫోటోలు వివాదాస్పదం అవుతున్న అంశంపైనా విస్తృత చర్చ జరిగింది. నేరాల్లో ఆరోపణలు ఎదుర్గొంటున్న వారు కూడా నేతలతో ఫోటోలు దిగేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై జాగ్రత్తగా ఉండాలని సహచర మంత్రులకు చంద్రబాబు సూచించారు. తెలియని వారితో ఫోటోలు దిగవద్దని హితవు పలికారు. ఈ అంశంపై మంత్రులు ఫరూఖ్, బిసి జనార్ధన్‌రెడ్డి కూడా స్పందించారు. తెలుగుదేశం పార్టీతో సంబంధం లేనివారిని దగ్గరకు కూడా రానివ్వడం లేదని ఫరూఖ్ వ్యాఖ్యానించగా, మద్యం కేసులో నిందితుడు వెంకటేష్‌నాయుడు నంధ్యాలకు చెందిన వ్యక్తే అయినప్పటికీ వైసిపికి చెందినవాడు కావడంతో దూరం పెట్టానని వివరించారు.మంత్రులంతా హనీమూన్ మూడ్‌ను విడిలి పాలనపై నిశితంగా దృష్టి పెట్టాలని, పనులపై దూకుడు పెంచాలని చంద్రబాబు సూచించారు. మంచిని కూడా తప్పుడుగా చూపించేందుకు వైసిపి నేతలు ప్రయత్నిస్తున్నారని, దీనిని తిప్పికొట్టాలని సూచించారు. పోలీసులు, పార్టీ నేతలు కూడా ఇటువంటి నేరస్తులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తమ పనితీరును మరింతగా పెరుగుపరచుకోవాల్సి ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రభుత్వంపై ప్రస్తుతం సానుకూలత ఉందని, పనితీరు బాగోకపోతే ఆ సానుకూలత తగ్గిపోయే ప్రమాదం ఉంటుందన్నారు.. వచ్చే మంత్రివర్గ సమావేశం నుంచి మంత్రులు కూడా తమ శాఖలో పనితీరుపై మాట్లాడే అవకాశం కల్పిస్తానని చెప్పారు.

త్వరలోనే శాసనసభ భేటీ

శాసనసభ సమావేశాలను త్వరలోనే నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఈ నెలాఖరులేదా, సెప్టెంబర్ తొలి వారంలో ఈ సమావేశాలు ఉంటాయని చెప్పారు. సుమారుగా ఐదు పనిదినాలు ఉంటాయని కూడా చెప్పినట్లు తెలిసింది. ఆగస్టు నెలలో ఎక్కువగా సెలవు రోజులు ఉండడం, పనిదినాలు ఎన్ని ఉన్నాయన్నదానిపై శాసనసభ వ్యవహారాల శాఖ మంతి పయ్యావుల కేశవ్ వివరించినట్లు తెలిసింది. అలాగే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం చేనేత కుటుంబాలకు అదనపు లబ్ధి కల్పించేందుకు ప్రత్యేక ప్రకటన ఉంటుందని చంద్రబాబు చెప్పారు.

గ్రీన్ ఎనర్జీతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కష్టపడుతున్నాం
- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రీన్ ఎనర్జీ రంగంలో మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. 'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్ బుధవారం జరిగింది. విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పునరుత్పాదక విద్యుత్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయని అన్నారు. పవన, సౌర, పంప్డ్ స్టోరేజ్, సిబిజి ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పించే అంశంపై ముఖ్యమంత్రి చాలా పట్టుదలతో ఉన్నారని, దీనిని చాలా ప్రాముఖ్యతగా తీసుకున్నామన్నారు. దీనికోసం ప్రైవేట్ సెక్టార్‌తో కలిసి పనిచేస్తామని చెప్పారు. సెప్టెంబరు ఒకటి నుంచి నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తామన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. పునరుత్పాదక విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు పాలసీని అమలు చేస్తున్నామని చెప్పారు. రాయలసీమ ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఎస్‌డిసి ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, నెడ్‌క్యాప్ వైస్ ఛైర్మన్ కమలాకర్, స్వనీతి ఇనీషియేటివ్ సిఇఒ రీత్వికా భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

కరేడు ప్రజలకు న్యాయం చేస్తాం

- ఉప్పరపాలెం గ్రామస్తులతో కలెక్టర్ భేటీ

ప్రజాశక్తి-ఉలవపాడు

కరేడు ప్రాంత ప్రజలు, రైతులు భయపడాల్సిన అవసరం లేదని, అందరినీ సమన్వయం చేసుకుంటూ న్యాయం జరిగేలా చూస్తామని నెల్లూరు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఉలవపాడు మండలం కరేడు రెవెన్యూ పంచాయతీ పరిధిలోని ఉప్పరపాలెం గ్రామస్తులతో బుధవారం ఆయన భేటీ అయ్యారు. భూసేకరణ విషయంలో గ్రామస్తులు పలు అనుమానాలను వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం తలపెట్టే అభివృద్ధి పనుల్లో కొన్ని గ్రామాలు తరలిపోవడం ఆవశ్యకత ఉందని, దానిని అందరూ ఆహ్వానించాలని పేర్కొన్నారు. మొదటి దఫాగా 80 ఎకరాలకు నష్టపరిహారంగా రూ.మూడు కోట్లు ఇవ్వడం జరిగిందని, భూములు ఇచ్చేందుకు మరికొందరు రైతులు ముందుకు వస్తున్నారని తెలిపారు. కరేడు సచివాలయం-1 పరిధిలోని రైతులతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నామని, వారితో మరోమారు చర్చలు జరుపుతామని చెప్పారు. ఎకరాకు రూ.20 లక్షలు, మామిడి, సపోటా పంటలకు అదనంగా పరిహారం ఇచ్చేందుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం తరుపున రావాల్సిన పరిహారాన్ని వచ్చేలా చూస్తామని, మీకు నచ్చిన చోటే ఇళ్ల స్థలాలు కల్పించి పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పారు. కలెక్టర్ వెంట కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమల శ్రీ పూజిత, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, ఉలవపాడు తహాశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ సురేష్ తదితరులున్నారు.

కృష్ణాపురాన్ని కబళిస్తున్న కిడ్నీ మహమ్మారి

- ప్రబలుతున్న వ్యాధి - 20 మంది మృతి
- ఎన్ఎసిఎల్ కాలుష్యం వల్లేనంటున్న గ్రామస్తులు

కిడ్నీ వ్యాధి బారిన పడిన గార లక్ష్మణరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పొందూరు

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం కృష్ణాపురం గ్రామాన్ని కిడ్నీవ్యాధి పట్టి పీడిస్తోంది. జ్వరం, కడుపునొప్పి, కండరాల నొప్పి, కాళ్ల పొంగులు వంటి లక్షణాలతో సాధారణ వైద్య పరీక్షలకు వెళ్తున్న వారికి కిడ్నీ వ్యాధి సోకిందంటూ వైద్యులు చెబుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 2018 జనవరిలో గ్రామానికి చెందిన కాయల శ్రీను అనే వ్యక్తి తొలుత ఈ వ్యాధి బారిన పడ్డాడు. ఆ తర్వాత 2021లో మూడు, 2022లో రెండు కేసులు వెలుగు చూశాయి. 2023లో నాలుగు, 2024లో ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెండు కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకూ ఈ వ్యాధితో 20 మంది మృతిచెందారు. గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తే మరిన్ని కేసులు వెలుగు చూసే అవకాశముందని గ్రామస్తులు చెబుతున్నారు. తాగునీటి కాలుష్యం వల్లే కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని, తాగునీటి పరీక్షలు చేయాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులను కోరారు. దీనిపై గతేడాది పరీక్షలు చేసిన తర్వాత పంచాయతీ పాలకవర్గానికి నివేదిక సమర్పించారు. ఏమీ లేదంటూ నివేదిక ఇచ్చారు. పరీక్షలు ఎవరు చేశారో, ఎక్కడ చేశారో వివరాలు, అధికారి సంతకంతో కూడిన నివేదిక కావాలని సర్పంచ్ ప్రతినిధి అడిగినా స్పందించడం లేదు.

నీటి కాలుష్యమే కారణమా?

చిలకపాలెంలోని స్థానిక నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ (ఎన్ఎసిఎల్) పరిశ్రమ వదలిపెడుతున్న రసాయనిక వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీటి కాలుష్యం వల్లే ప్రజలకు కిడ్నీ వ్యాధి సోకిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఫ్యాక్టరీకి సమీప గ్రామాలైన కేశవదాసుపురం, భగవాన్‌దాసుపేట, నరసాపురం అగ్రహారం, నందివాడ, బురిడికంచరాం, లోలుగు తదితర గ్రామాల ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడ్డారు. ఈ సమస్యను గమనించి పరిశ్రమ యాజమాన్యం కేశవదాసుపురం, నరసాపురం, భగవాన్‌దాసుపేట తదితర గ్రామాలకు మినరల్ వాటర్ క్యాన్లను పంపిస్తోంది.

రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు

ప్రస్తుతం కిడ్నీ వ్యాధి బారిన పడిన వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలే. వ్యవసాయం, క్వారీ పనులకు వెళ్తేనే కుటుంబ జీవనం సాగుతుంది. అలాంటి వారిపై సుమారు ఏడేళ్లగా కిడ్నీ వ్యాధి రూపంలో మహమ్మారి విరుచుకుపడి కబళిస్తుండడంతో వైద్యం కోసం అప్పుల పాలై ఆర్థికంగా కుంగిపోతున్నారు.

ఎనిమిదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను

కిడ్నీ వ్యాధితో ఎనిమిదేళ్లగా బాధపడుతున్నాను. రెండేళ్లగా శ్రీకాకుళంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాను. వారానికి రెండుసార్లు డయాలసిస్ కోసం వెళ్తుండడంతో నెలకు రూ.15 వేలు ఖర్చవుతోంది. భర్త సంపాదన చాలకపోవడంతో వైద్యం కోసం అప్పులు చేస్తున్నాం.

- గార వెంకటమ్మ కిడ్నీ బాధితురాలు, కృష్ణాపురం

సమస్య మా దృష్టికి వచ్చింది

పొందూరు మండలం కృష్ణాపురంలో కిడ్నీ వ్యాధుల అంశం మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం కిడ్నీ వ్యాధి బారిన పడుతున్న వారితో పాటు గ్రామంలో అందరికీ స్క్రీనింగ్ చేయాలని ఆదేశించాం. పరీక్షల అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం.

- కె.అనిత, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

రాయలసీమలో 2 రోజులపాటు భారీ వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాయలసీమ, పరిసర ప్రాంతాలపై సముద్ర మట్టానికి సగటున 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ ప్రభావంతో రాబోయే రెండు రోజులు రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 7న అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 8న పల్నాడు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు.

నమోదైన వర్షపాతం

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం పలు ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. అల్లూరి జిల్లా గంపరైలో 50 మిల్లీమీటర్లు, తిరుపతి జిల్లా త్రిపురాంతకపురం కోటలో 49.5 మిల్లీమీటర్లు, ప్రకాశం జిల్లా చిలకపాడులో 32.5 మిల్లీమీటర్లు, మొగళ్లూరులో 29 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

టిడిపిపై ఎన్నికల కమిషన్‌కు వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పులివెందులలో టిడిపి కార్యకర్తలు, గూండాలు అరాచకాలు, దాడులు భయోత్పాతం సృష్టిస్తున్నారని వైసిపి విమర్శించింది. పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ తమ పార్టీకి చెందిన నేతలపై భౌతిక దాడులకు దిగిందని నేతలు పేర్కొన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ముందు వైసిపి నేతలు కొద్దిసేపు సేవ్ డెమోక్రసీ, పులివెందులలో దాడులకు దిగుతున్న టిడిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఎన్నికల కమిషనరు నీలంసహానిని కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో వైసిపికి చెందిన మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్, విజయవాడ మేయరు రాయన భాగ్యలక్ష్మి, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులు అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి ఉన్నారు. ఈ సందర్భంగా పులివెందుల సంఘటనను ఎన్నికల కమిషనరుకు నేతలు వివరించారు. పులివెందుల జడ్‌పిటిసి స్థానానికి జరగనున్న ఉప ఎన్నిక నేపథ్యంలో వైసిపికి చెందిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, నాయకులు వేల్పులరాముతోపాటు పలువురిపై అధికార పార్టీ కార్యకర్తలు భౌతిక దాడులకు దిగారంటూ ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాపూరితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వైసిపి నేతలు కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. దాడులకు పాల్పడుతున్న అరాచకశక్తులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

15వ ఆర్థిక సంఘం నిధులు

రూ.1,121 కోట్లు పంచాయతీలకు విడుదల చేయాలి

- ఉప ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను పంచాయతీలకు విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచుల వేతనాలు పెంచాలని, గ్రామ సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంత్రికి బుధవారం లేఖ రాశారు. రాజ్యాంగం ప్రతిపాదించిన మూడు దొంతరల అధికార వ్యవస్థలో దిగువనున్న స్థానిక సంస్థలకు, నిధులు, విధులు బదలాయించడంలో ఇప్పటికీ లోపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రోజురోజుకూ కేంద్రీకరణ బలపడుతోందని, అభివృద్ధిలో స్థానిక సంస్థలైన పంచాయతీలు కీలకపాత్ర పోషిస్తున్నాయని వివరించారు. కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వ కేంద్రీకృత విధానాల వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పడకేసిందని, రాష్ట్రంలో సర్పంచులు పార్టీయేతర ప్రాతిపదికన ఎన్నికై నాలుగేళ్లు దాటుతోందని వివరించారు. ఎన్నో ఆశలతో గ్రామాలను అభివృద్ధి చేద్దామని, ఉత్సాహంగా ఎన్నికైన సర్పంచులు నిధుల్లేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక అభివృద్ధి కార్యక్రమాలు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన సర్పంచులు 50 శాతం పైగా ఉన్నారని వివరించారు. వారందరూ అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తే వాటికి చెందిన బిల్లులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదని తెలిపారు.

పంచాయతీలకు ఇవ్వాల్సిన ఆర్థిక సంఘం నిధులూ ఇవ్వలేదని, అలాగే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు విద్యుత్ బకాయిల పేరుతో దారి మళ్లించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి విడత నిధులు విడుదల చేసినా గత ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.1,121 కోట్లు విడుదల చేయకపోవడంతో వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వాటి కోసం చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారని, అయినా ఇప్పటికీ పరిష్కారం కాలేదని వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 5వ ఆర్థిక సంఘం ఏర్పాటు చేసి రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు గత నాలుగేళ్లుగా రావాల్సిన నిధులు బదిలీ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచుల గౌరవ వేతనం రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని కోరారు. పంచాయతీల బిల్లులు ఎప్పటికప్పుడు విడుదలయ్యేలా కార్యదర్శులకు ఆదేశాలివ్వాలని కోరారు. 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీలకు సంక్రమించిన 29 అంశాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా బదిలీ చేయాలని కోరారు. సర్పంచులు విధి నిర్వహణలో మరణిస్తే రూ.20 లక్షల వరకూ ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 5వ షెడ్యూల్డ్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామాల అభివృద్ధికి గిరిజన తండాల గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో గ్రామ పంచాయతీల పర్యవేక్షణ ఉండాలని, రిజిస్ట్రేషన్ సర్ ఛార్జీలను క్రమం తప్పకుండా పంచాయతీల్లో జమచేయాలని కోరారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వేసే లేఅవుట్లకు ఇచ్చే పర్మిషన్లకు ఆయా గ్రామ పంచాయతీల తీర్మానం కావాలనే విధంగా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

డిఎంఎఫ్ మార్గదర్శకాలు సవరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా ఖనిజ ఫౌండేషన్ (డిఎంఎఫ్) మార్గదర్శకాలను ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు గనులు, భూగర్భవనరులశాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కళ్యాణ్ యోజన (పిఎంకెకెకెవై) మార్గదర్శకాలను అనుసరించి, 2016లో డిఎంఎఫ్ మార్గదర్శకాలను సవరిస్తూ గనులు, భూగర్భవనరుల శాఖ డైరెక్టర్ రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన రూల్ 2, 5, 9, 10, 15లకు సవరణలు చేయడంతోపాటు, రూల్ నెంబరు 30ను అదనంగా చేర్చినట్లు వెల్లడించారు. దీనిలో ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్, ఫిర్యాదుల పరిష్కారం, నిబంధనలు అతిక్రమిస్తే తీసుకునే చర్యలు, రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ తదితర అంశాలను గతంలో ఉన్న నియమాలకు అదనంగా చేర్చారు.

రాయచోటి- మదనపల్లి మధ్య ట్రాఫిక్ ఐల్యాండ్

- మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాయచోటి- మదనపల్లి మధ్య ప్రయాణం చేసే వాహనదారుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రణాళికలోని అండర్‌పాస్ స్థానంలో ట్రాఫిక్ ఐ ల్యాండ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంత్రితో (ఎన్‌హెచ్ఎ1)ఛైర్మన్ ఆర్‌కె సింగ్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రమాదాలను తగ్గించడంలో ట్రాఫిక్ ఐలాండ్‌లు కీలకంగా ఉంటాయని అవసరమైన మార్పులు వెంటనే చేపట్టాలన్నారు. ఈ మేరకు తగిన ప్రణాళికలు రూపొందించి త్వరితగతిన అమలు చేయాలని, ప్రజల ప్రయాణ భద్రతలు ఎలాంటి తడబాటు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు.

25 మందితో ఎపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీని ఎఐసిసి ప్రకటించింది. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 25 మందితో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా బి మాణిక్యం ఠాకూర్, సభ్యులుగా వైఎస్ షర్మిల, ఎన్ రఘువీరారెడ్డి, కె రాజు, ఎంఎం పల్లంరాజు, గిడుగు రుద్రరాజు, జెడి శీలం, మస్తాన్ వలీ, కెవిపి రామచంద్రరావు, చింతా మోహన్, కె బాపిరాజు, జివి హర్షకుమార్, ఎన్ తులసిరెడ్డి, కిల్లి కృపారాణి, ఆమంచి కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జెడి శీలం, మస్తాన్ వలీను నియమిస్తూ ఎఐసిసి ఆదేశాలు జారీ చేసింది.

స్టడీ సర్కిళ్లకు నిర్వహణ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల నిర్వహణ కమిటీని ప్రభుత్వం పునర్నిర్మిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో ఐఎఎస్‌లు కాంతిలాల్ దండే, కోన శశిధర్, డి రోనాల్డ్ రోస్, జి వీరపాండియన్, గంధం చంద్రుడు, నాగలక్ష్మి, పి సంపత్ కుమార్, పి అరుణ్‌బాబు, ఎం విజయ సునీత, ఐపిఎస్‌లు సిహెచ్ శ్రీకాంత్, ఎం పార్థసారధి ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి, డైరెక్టర్, ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐ సొసైటీ కార్యదర్శులు కొనసాగనున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మంత్రుల హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి.. ఎపియుడబ్ల్యుజె నాయకులకు హామీ ఇచ్చారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఉన్న మంత్రిని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ, నాయకులు ఏడుకొండలు తదితరులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులకు, రిటైర్డు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ప్రమాదబీమా పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని, సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అలాగే మంత్రి సత్యకుమార్ యాదవ్‌కూ వినతిపత్రం ఇచ్చారు.

నిరవధిక సమ్మెను చర్చల ద్వారా పరిష్కరించాలి

- కర్ణాటక ముఖ్యమంత్రికి ఎస్‌డబ్ల్యుఎఫ్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్ణాటక ఆర్‌టిసిలో ఈ నెల 5 నుంచి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెను చర్చల ద్వారా పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, సెక్రటరీ టిపిఆర్ దొర బుధవారం కర్ణాటక సిఎం సిద్ధరామయ్యకు లేఖ రాశారు. మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తూ మహాలక్ష్మి పథకం అమలులో కార్మికుల కృషి, త్యాగం ఎంతో ఉందన్నారు. ఏళ్ల తరబడి ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం, యాజమాన్యం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో సిఎం సిద్ధరామయ్య జోక్యం చేసుకుని కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మదనపల్లెలో బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

రెడ్డి శ్రావణి (ఫైల్)

నాన్న, అక్క క్షమించండి.. మీరనుకున్నంత స్థాయిలో చదవలేకపోతున్నా, అమ్మ దగ్గరికి వెళ్లిపోతున్నా అంటూ సూసైడ్ నోట్ రాసి బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన సుధాకర్‌రెడ్డి, సుగుణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు అశ్విని, ప్రసన్న, రెడ్డి శ్రావణి ఉన్నారు. సుగుణ మూడేళ్ల క్రితం చనిపోవడంతో సుధాకర్‌రెడ్డి అన్నీ తానై చేనేత పని చేసుకుంటూ ముగ్గురు కుమార్తెలను పోషిస్తున్నారు. మూడో కుమార్తె రెడ్డిశ్రావణి (19) పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. మూడు రోజుల క్రితం కళాశాల నుంచి శ్రావణిని తన తండ్రి ఇంటికి తీసుకువచ్చారు. చదువు విషయంలో తనపై నాన్న, అక్క పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేస్తానేమోనని, తనలో తానే కుంగిపోయేది. దీంతో సూసైడ్ నోట్ రాసి మంగళవారం అర్ధరాత్రి తన గదిలో ఫ్యానుకు ఉరేసుకుని శ్రావణి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హంద్రీనీవా తూములపై నిర్లక్ష్యం..!

- నీరు అందక రైతుల ఇబ్బందులు
- 18 తూముల ఏర్పాటుతో 16,908 ఎకరాలకు సాగునీరు

హంద్రీనీవా ప్రధాన కాలువ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

హంద్రీనీవా సుజల స్రవంతికి తూములు ఏర్పాటు చేయకపోవడంతో సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీశైలం డ్యాం ఎగువన మల్యాల వద్ద 40 టిఎంసిలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలన్నది హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం లక్ష్యం. ఫేజ్-1 నందికొట్కూరు మండలం మాల్యాల ప్రధాన మాల్యాల లిఫ్ట్ నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కిలోమీటర్ల మేర కాలువ తవ్వారు. ఎనిమిది లిఫ్టులు ఏర్పాటు చేశారు. 12 పంపుల ద్వారా 3,850 క్యూసెక్కుల నీరు నింపి ఖరీఫ్ సీజన్‌లో 40 టిఎంసిలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం కాలువ ప్రవాహ సామర్థ్యం రెండు వేల క్యూసెక్కులు కూడా లేదు. ఈ లెక్కన 20-25 టిఎంసిలకు మించి తీసుకోలేని పరిస్థితి ఉంది. ఏటా 15-20 టిఎంసిలు నష్టపోవాల్సి వస్తోంది. కర్నూలు జిల్లాలో ప్రస్తుతం నాలుగు తూములు మాత్రమే ఉన్నాయి. 22.02 కిలోమీటర్ల నుంచి 141.375 కిలోమీటర్ల వరకూ కాలువ వెంబడి 18 తూములు తవ్వితే దాదాపు 56 గ్రామాల్లో 16,908 ఎకరాలకు అదనంగా సాగునీరు ఇవ్వవచ్చని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు భూగర్భ జలాలు పెరగడం ద్వారా బోరుబావుల కింద సాగు విస్తీర్ణం పెరుగుతుంది. గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

జియో మైసూర్‌పై ప్రేమ

రైతుల పంట కాలువలకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టని ప్రభుత్వం జియో మైసూర్ కంపెనీపై మాత్రం ప్రేమ ఉలుకపోస్తోంది. హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా జొన్నగిరిలోని జియో మైసూర్ కంపెనీకి మద్దికెర మండలం ఎడవల్లి గ్రామం దగ్గర తూము ఏర్పాటు చేసి నీటిని తీసుకెళ్తున్నారు.

స్లూయిస్ సామర్థ్యం పెంచకపోతే ప్రమాదమే..

పత్తికొండ (పందికోన) జలాశయానికి నీటిని మళ్లించేందుకు హంద్రీనీవా కాలువకు ఇన్‌లెట్ స్లూయిస్ ఏర్పాటు చేశారు. అలాగే కుడి, ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు రెండు అవుట్ లెట్ స్లూయిస్‌లు ఏర్పాటు చేశారు. అవుట్ లెట్ స్లూయిస్ కంటే ఇన్‌లెట్ స్లూయిస్ సామర్థ్యం ఎక్కువగా ఉండాలని లేదా సమానంగానైనా ఉండాలని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఇంజనీరింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఇన్లెట్ తూమును 428.72 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. జలాశయం నుంచి ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు కుడి కాలువ అవుట్‌లెట్ తూము 670.98 క్యూసెక్కులు, ఎడమ కాలువ అవుట్ లెట్ తూము 141.26 క్యూసెక్కులు కలిపి రెండు అవుట్‌లెట్ తూములు 811.24 క్యూసెక్కులు సామర్థ్యం ఏర్పాటు చేశారు. అంటే అవుట్‌లెట్ స్లూయిస్ కంటే ఇన్‌లెట్ స్లూయిస్ 382.52 క్యూసెక్కులు తక్కువ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని ఇంజనీర్లు అంటున్నారు. ఇన్‌లెట్ స్లూయిస్ సామర్థ్యాన్ని పెంచకపోతే భవిష్యత్తులో పత్తికొండ జలాశయం తాగునీరు అందించే ఎస్ఎస్ ట్యాంక్‌గా మారే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముఖ్యమంత్రి స్పందించాలి

హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ రాయలసీమకు వరప్రసాదం లాంటిది. కాలువ పొడవునా తూములు ఏర్పాటు చేస్తే అదనంగా ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంటుంది. బోరుబావుల్లోనూ నీరు పెరిగే అవకాశం కూడా ఉంది. ఇప్పటికైనా మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి తూములు నిర్మించి అదనపు ఆయకట్టుకు నీళ్లివ్వాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి

హంద్రీనీవా ప్రధాన కాలువకు తూము ఏర్పాటు చేయడంతో బీడు భూములకు సాగునీరు అందుతుంది. మద్దికేర మండల బురుజుల గ్రామం దగ్గర చిన్న వాగు వంకకు తూము ఏర్పాటు చేయడం వల్ల కొన్ని వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. సాగునీరు ప్రవహించడంతో రెండు పంటలు పండించుకోవచ్చు. ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ తూము ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- సుభాన్, హోసూరు, పత్తికొండ మండలం.

బుగ్గన కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన జగన్

ప్రజాశక్తి - డోన్

ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. రాజేంద్రనాథ్ రెడ్డి కుమారుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్, అన్యన రెడ్డి వివాహం ఈ నెల మూడున హైదరాబాద్‌లో జరగ్గా రిసెప్షన్‌ను బుధవారం డోన్‌లోని దత్తాత్రేయ ఆలయం సమీపంలో నిర్వహించారు. ఆ వేడుకలో జగన్ పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. అనంతరం ఆయనకు బెంగళూరుకు వెళ్లిపోయారు. ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరూపాక్షి, మాజీ ఎంపిలు బ్రహ్మానందరెడ్డి, గోరంట్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

క్రీడాసక్తిని పెంపొందించేందుకు మద్దతు

- మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువతలో క్రీడాసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు అందిస్తుందని క్రీడల శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని 20వ ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించిన స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సిరాజ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో విస్తరించడంలో జెస్సిరాజ్ విశేష కృషి చేశారన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

'మైక్రోఫైనాన్స్' ఆగడాల పై చర్యలు తీసుకోవాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అధిక వడ్డీలతో పేదల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్న మైక్రోఫైనాన్స్ సంస్థలపై అధికారులు, ప్రభుత్వం దృష్టి సారించి వాటిని నియంత్రించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. స్వయం సహాయక సంఘాల అవగాహన, మైక్రోఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల వేధింపులను ఆపాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో అధికారులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా కోశాధికారి చంద్రిక అధ్యక్షతన ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సదస్సులో రమాదేవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుపేదల అవసరాలను ఆసరాగా చేసుకుని కొన్ని మైక్రోఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీలకు రుణాలు ఇస్తూ వడ్డీల రూపంలో పేదల శ్రమను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైక్రో ఫైనాన్స్ ఆగడాలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎల్‌డిఎం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నాయని, పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెప్మా పీడీ విశ్వజ్యోతి మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల సభ్యులు ఎవరికీ ఎలాంటి కమీషన్‌లు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ... మైక్రో ఫైనాన్స్ సంస్థల నిర్వహణపై అధికారులు నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారి భ్రమరాంబ, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామల, నగర అధ్యక్ష, కార్యదర్శులు శంషాద్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలు వ్యక్తపరిచే వేదిక యూత్ సమ్మిట్

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువత తమ ఆలోచనలను వ్యక్తపరిచేందుకు యూత్ సమ్మిట్ సరైన వేదిక అని మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ నెల 12న బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించనున్న యూత్ సమ్మిట్ పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను రాష్ట్ర భవిష్యత్తు అవసరాల కోసం వినియోగించుకునేందుకు యూత్ సమ్మిట్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

అభివృద్ధి ఎజెండాగా భవిష్యత్ ప్రణాళికలపై చర్చించడంతోపాటు, యువతలోని నాయకత్వ లక్షణాలు, పరిస్థితులకు తగినట్లు వేగంగా నిర్ణయాలు తీసుకునే ఆలోచన విధానాలను యువత అలవర్చుకోవాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో మంత్రులు వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారధి, సవిత, సంధ్యారాణి, సత్యప్రసాద్, రామ్‌ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, జనార్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'మా కోసం బస్సు నడపండి'

- ఉరవకొండ ఆర్‌టిసి బస్టాండ్ వద్ద విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - ఉరవకొండ (అనంతపురం)

ఆర్‌టిసి డిపో ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. 'మా కోసం బస్సు నడపండి' అంటూ ఉరవకొండ ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా విద్యార్థులు బైఠాయించారు. సుమారు గంటపాటు రహదారిపై నిరసనను కొనసాగించారు. పోలీసులు వచ్చి ఎంత నచ్చజెప్పినా విద్యార్థులు ఆందోళనను విరమించలేదు. తాము ప్రతిరోజు ఒకే బస్సులో ప్రయాణించలేకపోతున్నామని, మరో బస్సు సర్వీసును నడపాలని కోరారు. చివరకు ఆర్‌టిసి అధికారులు వచ్చి మరో బస్సు నడిపేందుకు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

అనంతపురం జిల్లా ఉరవకొండ మండల పరిధిలోని చిన్న ముష్టూరు గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు దాదాపు 150 మంది విద్యార్థులు సమీప గ్రామాల నుంచి ప్రతిరోజూ వస్తున్నారు. ఉరవకొండ టు చిన్న ముష్టూరు మధ్య ఒక సర్వీస్ బస్సు మాత్రమే నడుస్తోంది. 150 మంది విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులకు ఒక బస్సు సరిపోకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. బస్సుల ఏర్పాటుపై ఆర్‌టిసి అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరుతూ సుమారు గంటపాటు రహదారిపై బైఠాయించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఆర్‌టిసి అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

భారత వృద్ధిపై అంతర్జాతీయ అనిశ్చితి

- జిడిపి అంచనాలు 6.5 శాతానికి కోత
- ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి

న్యూఢిల్లీ : భారత స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)పై అంతర్జాతీయ అనిశ్చితి అంశాలు ప్రభావం చూపనున్నాయని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాల ప్రభావాన్ని ఇప్పటికిప్పుడు అంచనా వేయడం కొంచెం కష్టమేనని తెలిపారు. అయితే అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితులు మాత్రం వృద్ధిపై ప్రభావం చూపొచ్చన్నారు. ఈ నేపథ్యంలో జిడిపి అంచనాలను చాలా వరకు తగ్గించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను జిడిపి అంచనాలను 6.7శాతం నుంచి 6.5శాతానికి సవరించామని చెప్పారు. అయినప్పటికీ అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న క్రమంలో సుంకాల ప్రభావం ఏ విధంగా ఉండొచ్చనేది అంచనా వేయడం కష్టమేనన్నారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతానికి జిడిపి అంచనాలను సవరించడానికి తమ వద్ద తగినంత సమాచారం లేదన్నారు.

ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) భేటీ జరిగింది. ఇందులోని నిర్ణయాలను బుధవారం సంజయ్ మల్హోత్రా మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు.. రెపోరేటును యథాతథంగా 5.5 శాతంగా నిర్ణయించామన్నారు. భారత్ మృత ఆర్థిక వ్యవస్థ (డెడ్ ఎకానమీ) అంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మల్హోత్రా స్పందిస్తూ.. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్నారు. ప్రపంచ వృద్ధికి అమెరికా కన్నా భారత్ ఎక్కువ మద్దతును అందిస్తుందన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రకారం ప్రపంచ వృద్ధి 3శాతంగా ఉంటే.. భారత్ వృద్ధి అంచనాలు మాత్రం 6.5శాతంగా ఉన్నాయన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్నారు. మరింత పురోగతిని సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం చర్చలు సామరస్యంగా పరిష్కారం అవుతాయని మల్హోత్రా ఆశాభావం వ్యక్తం చేశారు.

యుపిఐ చెల్లింపులపైనా ఛార్జీలు..!

బ్యాంక్ ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను ఆర్‌బిఐ సరళతరం చేయనుందని మల్హోత్రా తెలిపారు. మరణించిన వారి బ్యాంకు ఖతాల్లోని నగదు, లాకర్లలోని ముఖ్యమైన వస్తువులను తమ వారికి సులువుగా చేరవేయడమే లక్ష్యంగా ఈ విధానాన్ని మార్చనున్నామన్నారు. నామినీ లేని ఖాతాల విషయంలో ఒక్కో బ్యాంక్ ఒక్కో పద్ధతిని అవలంబిస్తున్నాయని.. ఇకపై అన్ని బ్యాంకుల్లోనూ ఒకే డాక్యుమెంటేషన్ ప్రక్రియ ఉండడంతో పాటు, ఇది సులువుగా ఉండేలా ముసాయిదా సర్క్యులర్‌ను త్వరలో జారీ చేయనున్నట్లు తెలిపారు. యుపిఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను నడిపేందుకు అయ్యే ఖర్చును కాలక్రమేణా ఎవరైనా భరించాల్సి ఉంటుందని మల్హోత్రా తెలిపారు. యుపిఐ సర్వీస్‌లు ఎప్పుడూ ఉచితంగానే అందుబాటులో ఉంటాయన్న విషయం తాను చెప్పలేనన్నారు. నిర్వహణకు సంబంధించిన ఖర్చులు ఉన్నాయని.. ఆ ఖర్చును ఎవరైనా భరించాల్సి ఉంటుందన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారిని పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. బుధవారం ఉదయం విఐపి విరామ దర్శన సమయంలో సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమంగ్, కర్ణాటక హోం శాఖ మంత్రి పరమేశ్వర వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి అధికారులు వారికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అలాగే స్వామివారిని సినీనటి రమ్యకృష్ణ దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. టిటిడి అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితుల స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుందాం

- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి- విశాఖపట్నం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పిడిఎస్) బియ్యం అక్రమ రవాణాను ప్రణాళిక బద్ధమైన చర్యలతో అడ్డుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో విశాఖపట్నం పోర్టు, కస్టమ్స్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు, కస్టమ్స్ అధికారులు, సివిల్ సప్లై శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందించే సబ్సిడీ బియ్యం మళ్లింపునకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సరిహద్దులు, పోర్టులు, రవాణా మార్గాల వద్ద పటిష్ట తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కమిషనర్, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్, పోర్టు, కస్టమ్స్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

- మత్తు ఇంజక్షన్లు వినియోగిస్తున్న యువకులు..

ప్రజాశక్తి- తిరుపతి సిటీ


మత్తు ఇంజక్షన్లు తీసుకుంటున్న యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వేర్వేరు చోట్ల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను, రహస్యంగా చెట్ల పొదల మధ్య మత్తు ఇంజక్షన్లు వినియోగిస్తున్న ఆరుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన తిరుపతిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి తిరుచానూరు పంచాయతీ పరిధిలోని నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారి సమీపంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు తనిఖీలు చేపట్టి తమిళనాడుకు చెందిన మణి, భరత్ వద్ద 1.5 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నిందితులను అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలడంతో వారిపై కేసు నమోదు చేశారు.

తిరుపతి నగరంలోని ఎంఆర్ పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చెట్ల పొదల మధ్య మత్తు ఇంజక్షన్లు వినియోగిస్తున్న ఆరుగురు యువకులను పోలీసులు అదుపులోని తీసుకున్నారు. నగరంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు డ్రోన్ కెమెరాతో బీట్ నిర్వహించారు. ఎంఆర్.పల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని బైరాగిపెట్టడ, వాణినగర్ తదితర ప్రాంతాల్లో నిర్మానుష్యంగా ఉన్న చెట్లు, పొదల మధ్య ఆరుగురు యువకులు కూర్చున్న దృశ్యాన్ని డ్రోన్ కెమెరాతో పసిగట్టారు. డ్రోన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు, స్థానిక పోలీసులు ఆ ప్రదేశానికి వెళ్లి మత్తు ఇంజక్షన్లు వినియోగిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. మత్తు ఇంజక్షన్లు ఎక్కడ నుంచి వస్తున్నాయి.. ఎవరు ఇచ్చారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

మార్కెట్లకు ట్రంప్ బెంబేలు

- సెన్సెక్స్‌కు 166 పాయింట్ల నష్టం

ముంబయి : ట్రంప్ సుంకాలు దలాల్ స్ట్రీట్‌ను బెంబేలెత్తిస్తున్నాయి. వరుసగా రెండో రోజూ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ట్రంప్ సుంకాలకు తోడు ఆర్‌బిఐ కూడా వడ్డీ రేట్లను తగ్గించకపోవడం ఇన్వెస్టర్లను నిరాశకు గురి చేసింది. ఈ నేపథ్యంలోనే బుధవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ తుదకు 166 పాయింట్ల నష్టంతో 80,544కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 75.35 పాయింట్లు పతనమై 24,574 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు ఏషియన్ పెయింట్స్, బిఇఎల్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, ఎస్‌బిఐ షేర్లు లాభాల్లో ముగిశాయి.

ఉద్యోగం రాలేదని ఆత్మహత్య

- తెలంగాణలో రైలు కింద పడిన పల్నాడు జిల్లా యువకుడు

పజాశక్తి-పిడుగురాళ (పల్నాడు జిల్లా)

ఇంజనీరింగ్ పూర్తి చేసినా ఉద్యోగం రాలేదని మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తెలంగాణ రాష్ట్రంలోని లింగపల్లి రైల్వేస్టేషన్‌లో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడుకు చెందిన బ్రహ్మారెడ్డి (28) మూడేళ్ల క్రితం ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టారు. కొద్దికాలంగా హైదరాబాద్‌లోని కెపిహెచ్‌బిలోని ఒక హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో బ్రహ్మారెడ్డి బుధవారం ఉదయం లింగపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. అక్కడి రైల్వే పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న మృతుని కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఐపిఒ యోచనలో ఇండోసోల్

ప్రజాశక్తి - హైదరాబాద్

షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సబ్సీడరీ సంస్థ ఇండోసోల్ సోలార్ ప్రయివేటు లిమిటెడ్ వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వచ్చే యోచనలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న 1 గిగావాట్‌ఉత్పత్తి లైన్ ప్రారంభమైన తర్వాత పబ్లిక్ ఇష్యూకు వెళ్లనున్నట్లు ప్రకటించింది.

టయోటా ఇన్నోవాకు 20 ఏళ్లు

బెంగళూరు : టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం)కు చెందిన ఇన్నోవా భారత్‌లో ఆవిష్కరించి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఆ కంపెనీ ప్రాంతీయ సేల్స్ హెడ్ వరిందర్ వాద్వా తెలిపారు.

ఈ కాలంలో ఇన్నోవా, ఇన్నోవా క్రిస్టా, ఇన్నోవా హైక్రాస్ మోడల్‌లతో కలిపి 12 లక్షలకు పైగా యూనిట్లను విక్రయించామన్నారు. ఇది వినియోగదారుల నమ్మకానికి నిదర్శనంగా నిలిచిందన్నారు.

గల్లంతైన ముగ్గురు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు తీరంలో మంగళవారం గల్లంతైన ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వజ్రపుకొత్తూరు మండలం మడేవానిపేటకు చెందిన దున్న దుర్యోధన (18), పూడి జగన్నాథపురానికి చెందిన తిమ్మల జస్వంత్ (18), పలాస మండలం టెక్కలి పట్నాణాకి చెందిన రాయల రాజేష్ (18) ముగ్గురు స్నేహితులు. వీరందరూ విజయనగరం జిల్లాలో డిప్లొమో మూడో సంవత్సరం చదువుతున్నారు. సెలవులపై ఇంటికి వచ్చి సరదగా గడిపేందుకు భావనపాడు సముద్ర తీరానికి వెళ్లారు. సముద్రంలో స్నానం చేస్తుండగా ఒకరు కొట్టుకుపోయారు. అతన్ని కాపాడేందుకు వెళ్లిన ఇద్దరు స్నేహితులు గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం స్థానిక మత్స్యకారులు, మెరైన్ పోలీసులు, నౌపడ పోలీసు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తిమ్మల జస్వంత్ మృతదేహం, రాత్రి 1.45 సమయంలో రాయల రాజేష్ మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. దుర్యోధన మృతదేహం బుధవారం మధ్యాహ్నం 2.30 సమయంలో జెట్టి సమీపానికి చేరుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను టెక్కలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు.

సంపాదకీయం

వరద బీభత్సం

ఉత్తరాఖండ్‌లో ఖీర్‌గంగా నది మెరుపు వరదతో ధరాలీ పట్టణంపై విరుచుకుపడిన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో జరిగిన క్లౌడ్ బరస్ట్ కారణంగా అనూహ్య స్థాయిలో భారీ వరద చోటుచేసుకున్నట్లు చెబుతున్నారు. వరద ధాటికి ధరాలీ పట్టణంలోని దాదాపు సగభాగం కొట్టుకుపోయింది. కొన్ని అడుగుల మేర పేరుకుపోయిన బురద తప్ప అక్కడ ఉన్నట్టి ఇళ్లు, హోటళ్లు, దుకాణాలు వంటివి ఏవీ ప్రస్తుతం కనిపించడం లేదు. వరద ధాటికి మూడు నాలుగు అంతస్తుల భవనాలు పేకమేడల్లా కూలిపోయాయని, యాత్రికుల కోసం నిర్మించిన 20-25 హోటళ్లు, పలు హోం స్టేలు ప్రస్తుతం కనపడటం లేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అధికారిక సమాచారం ప్రకారం 40 నుండి 50 ఇళ్లు కొట్టుకుపోయాయి. ఐదుగురు మరణించారు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఈ ఉత్పాతం చోటుచేసుకోగా, 24 గంటల తరువాత బుధవారం మధ్యాహ్నానికి కూడా నష్ట తీవ్రతపై అధికార యంత్రాంగం ఒక అంచనాకు రాలేకపోతోంది. ఉత్పాతం చోటుచేసుకున్న సమయంలో పర్యాటకులు ఎవరైనా ధరాలీలో ఉన్నారా ఉంటే వారి పరిస్థితి ఏమిటి? అన్న దానితో పాటు, స్థానికులందరూ క్షేమంగా ఉన్నారా అన్న అంశంపై కూడా స్పష్టత రావడం లేదు. దుర్ఘటన జరిగిన వెంటనే సమీపంలోని హర్సిల్‌లో ఉన్న సైనిక బృందాలు అక్కడికి చేరుకున్నాయి. ఆ సైనిక క్యాంపునకు చెందిన వారే 10 మంది వరద ధాటికి గల్లంతు కావడం గమనార్హం. మిగిలిన సైన్యం తమ శక్తి మేరకు సహాయ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ బయట ప్రాంతాల నుండి సహాయ బృందాలు పూర్తిస్థాయిలో అక్కడకు చేరుకోవడం ఇంకా కష్టంగానే ఉంది. రహదారులు ధ్వంసం కావడం, నిరవధికంగా కురుస్తున్న వర్షంతో హెలికాప్టర్ ప్రయాణానికి వాతావరణం అనుకూలించకపోవడం ఈ పరిస్థితికి కారణం.

గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొండపై ఉన్న అన్ని జలపాతాలు పొంగి ప్రవహిస్తున్నాయని, ఖీర్ గంగా మాత్రమే కాకుండా హర్సిల్ ఆర్మీ క్యాంప్ సమీపంలో ఉన్న తెల్‌గంగా కూడా పొంగి ప్రవహిస్తోందని, సమీపంలోని అవానా నది కూడా పొంగి ప్రవహిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఆ మేరకు స్థానిక పత్రికల్లో కూడా వార్తా కథనాలు ప్రచురితమైనాయి. అయితే, ప్రమాదాన్ని సూచించే హెచ్చరికలేవీ అధికార యంత్రాంగం నుండి రాలేదని చెబుతుండటం గమనార్హం. దుర్ఘటన జరిగిన తరువాత కూడా ఆ ప్రాంతంలో అధిక వర్షపాతం కురవడం కానీ, క్లౌడ్ బరస్ట్ వంటి ఉత్పాతాలు చోటుచేసుకోవడంగానీ జరగలేదని డెహ్రాడూన్ వాతావరణ కేంద్రం అధికారులు కొన్ని మీడియా సంస్థలకు చెప్పడం విచిత్రం! తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు మాత్రమే ఆ ప్రాంతంలో కురిశాయని వారు చెబుతున్నారు. క్షేత్ర స్థాయి పరిస్థితితో పొంతన లేని ఈ నిర్ధారణలకు కారణమేమిటో తేలాల్సి ఉంది.

ఖీర్‌గంగ ఇలా ఉప్పొంగడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల కాలంలో 2018లో, 2021లో కూడా ఈ నదికి భారీగా వరదలు వచ్చి, తీవ్ర నష్టం వాటిల్లింది. 1835లో అతి పెద్ద వరద ఈ నదికి వచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పటి మాదిరే బురద వరద అప్పుడు కూడా ధరాలీని ముంచెత్తిందని, దాంతో అప్పటి పట్టణం పూర్తిగా ధ్వంసం అయిందని భూ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్‌పి సతి చెబుతున్నారు. ఆ శిధిలాలపైన ప్రస్తుత పట్టణం నిర్మాణమైంది. ధరాలీకి ఎగువన ఖీర్ గంగా ప్రవాహాన్ని ఆనుకుని పెద్ద గడ్డిమైదానాలు, కొండలు, పాతకాలపు హిమాని నది శిధిలాలు ఉండటంతో వరదలు వచ్చిన ప్రతిసారీ బురద వెల్లువెత్తుతోందని జిల్లా అధికార యంత్రాంగం 2018లో నిర్ధారించింది. మరోవైపు అభివృద్ధి పేరుతో పెద్దఎత్తున సాగుతున్న అడవుల విధ్వంసం కూడా ఉత్తరాఖండ్‌లో కొనసాగుతోంది. ఒక్క గత సంవత్సరంలోనే 998 హెక్టార్లలోని అటవీ ప్రాంతం నష్టపోయినట్లు అధికారిక నివేదిక! 2021-24 మధ్య అటవీ ప్రాంతాల్లో 41 శాతం చెట్లను కోల్పోయినట్లు (ట్రీ కవర్ లాస్)తాజాగా విడుదలైన ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. విచ్చలవిడిగా సాగుతున్న ఈ తరహా విధ్వంసం కూడా ప్రకృతి ప్రళయాలకు కారణమౌతోంది. అదే విధంగా ఖీర్‌గంగా పొడవునా రక్షిత గోడ నిర్మించాలని స్థానిక ప్రజలు కొన్ని సంవత్సరాలుగా కోరుతున్నారు. అధికార యంత్రాంగం ఈ విషయాలపై దృష్టి సారిస్తే స్థానిక ప్రజలకు కొంత మేర ఊరట లభిస్తుంది.

మహనీయుల మాట



జీవితంలో ప్రతి రోజూ..
క్రితం రోజు కన్నా..
కాస్తో కూస్తో
ఎక్కువ విషయాలు
నేర్చుకోవాలి.
- రవీంద్రనాథ్ ఠాగూర్,
విశ్వకవి.
జననం: 7.5.1861
మరణం:7.8.1941

సందర్భం

హరిత విప్లవ ఆద్యుడు స్వామినాథన్

నేడు శత జయంతి

ప్రొ.ఎన్. వేణుగోపాలరావు

దేశ ఆహార భద్రతకు కీలకమైన గోధుమ పంట సాగును మలుపు తిప్పేందుకు (ప్రముఖ మెక్సికన్ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్ సహాయంతో) కృషి చేసి ఎందరో శాస్త్రవేత్తల్ని, విద్యావేత్తల్ని తయారుచేశారు. సమాంతరంగా ఆసియా దేశాల మూల వరి వంగడాల ప్రభావాలతో మార్చబడిన వారి వ్యవసాయాన్ని మలుపు తిప్పారు. ఆ నేపథ్యానికి, సాధనకు లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధి, సుబ్రమణ్యం వంటి వారు తగిన నిధులనిచ్చే ప్రణాళికల్ని రూపొందించారు. ఫలితంగా 1980-85 నాటికి దేశంలో తిండిగింజల ఉత్పత్తి ఐదు రెట్లు పెరిగింది. సమాంతరంగా వివిధ ఆహార పంటలు, వ్యవసాయ ఉప వృత్తుల ఉన్నతికి తగిన మానవ వనరును రూపొందించగలిగిన సంస్థలెన్నో ఏర్పడ్డాయి. విలియం గాడ్, నార్మన్ బోర్లాగ్ వంటి ప్రముఖులు ఆయనను "భారత హరిత విప్లవ" ప్రేరకుడన్నారు.

ఆధునిక భారతదేశ చరిత్రలో అనేక మంది ప్రముఖులు దేశ రాజకీయార్థిక స్వావలంబన కోసం కృషి చేశారు. దేశ ఆహార భద్రతకు కీలకమైన, వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రొఫెసర్ స్వామినాథన్ ఒకరు. స్వామినాథన్‌ను "హరిత విప్లవ" పితామహుడిగా పేర్కొనటం చూస్తున్నాం. కాని ఆయన తరచుగా దేశ వ్యవసాయానికి పితామహుడు రైతని, ఆహార భద్రతకు కుటుంబ వ్యవసాయం కీలకమని అంటుండేవారు. జాతీయ రైతు కమిషన్ చైర్మన్‌గా స్వామినాథన్ ప్రభుత్వాల ముందుంచిన నివేదికలు చాలా విలువైనవి. దేశ రైతు-వ్యవసాయ ఉద్యమాలలో ముఖ్య పాత్ర పోషించిన కిసాన్ సంయుక్త మోర్చా...ప్రభుత్వ మెడలు వంచటానికి ఆయుధంగా పని చేసిన సిఫార్సులనిచ్చారు. స్వామినాథన్ తన 98 ఏళ్ల జీవితంలో అనేక వైవిధ్యమైన విజయాలను అందుకున్నారు. అదే సమయంలో అసంబద్ధ విమర్శలనూ ఎదుర్కొన్నారు. ఆయన 2005-2006 సంవత్సరాల్లో ప్రభుత్వం ముందుంచిన సమగ్ర జాతీయ రైతు కమిషన్ నివేదికలు పాలకుల పక్షపాత వైఖరిని బహిర్గతం చేశాయి.

బి.పి.పాల్, వెంకటాచలం, రామయ్య వంటి ప్రముఖ శాస్త్రవేత్తల వారసుడిగా స్వామినాథన్ దేశ ముఖ్య ఆహార పంటలైన గోధుమ, వరి వంటి వ్యవసాయాల్ని మలుపు తిప్పారనేది అందరూ అంగీకరించే విషయం!

స్వామినాథన్ తన కుటుంబ నేపథ్యమైన వైద్య వృత్తిని చేపట్టకుండా, దానికి భిన్నంగా దేశ అవసరాలకు కీలకమైన వ్యవసాయ రంగాన్ని ఎన్నుకోవటమే ప్రత్యేకమైన విషయం. అలానే సమాజంలో గుర్తింపు తెచ్చి, అధికారాన్ని అధికంగా అందించగల ఐ.పి.ఎస్ ఎన్నికను త్యజించి, వ్యవసాయ-జన్యు శాస్త్రవేత్తగా నైపుణ్యత పొందటమే విశేషం. ప్రఖ్యాత విదేశీ సంస్థల్లో, గుర్తింపు పొందిన శాస్త్రవేత్తల నేతృత్వంలో ఐరోపాలో పని చేసి, ధనిక దేశాల సౌకర్యాల కోసం ఎగబడకుండా, భారతదేశం రావటమే స్వామినాథన్ ప్రత్యేకత. ప్రముఖ వరి పరిశోధనా కేంద్రం, కటక్ (ఒడిస్సా) పరిశోధకుడిగా మొదలెట్టి పరిశోధన, విద్య రంగాల్లో ప్రసిద్ధ అఖిల భారత సంస్థలో ఉన్నత స్థాయికి ఎదగటం (డైరెక్టర్ ఐ.ఎ.ఆర్.ఐ) ఆయన మేధస్సు, స్వయంకృషికి నిదర్శనం. ఆ క్రమంలోనే ఆయన దేశ ఉన్నత వ్యవసాయ పరిశోధనా మండలి నిర్దేశకుడిగా ఎదగటం విలువైన విషయం. కేంద్ర ప్రభుత్వ ముఖ్య వ్యవసాయ సలహాదారుగా ప్రముఖ పాత్ర వహించారాయన. దేశ ఆహార భద్రతకు కీలకమైన గోధుమ పంట సాగును మలుపు తిప్పేందుకు (ప్రముఖ మెక్సికన్ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్ సహాయంతో) కృషి చేసి ఎందరో శాస్త్రవేత్తల్ని, విద్యావేత్తల్ని తయారుచేశారు. సమాంతరంగా ఆసియా దేశాల మూల వరి వంగడాల ప్రభావాలతో మార్చబడిన వారి వ్యవసాయాన్ని మలుపు తిప్పారు. ఆ నేపథ్యానికి, సాధనకు లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధి, సుబ్రమణ్యం వంటి వారు తగిన నిధులనిచ్చే ప్రణాళికల్ని రూపొందించారు. ఫలితంగా 1980-85 నాటికి దేశంలో తిండిగింజల ఉత్పత్తి ఐదు రెట్లు పెరిగింది. సమాంతరంగా వివిధ ఆహార పంటలు, వ్యవసాయ ఉప వృత్తుల ఉన్నతికి తగిన మానవ వనరును రూపొందించగలిగిన సంస్థలెన్నో ఏర్పడ్డాయి. విలియం గాడ్, నార్మన్ బోర్లాగ్ వంటి ప్రముఖులు ఆయనను "భారత హరిత విప్లవ" ప్రేరకుడన్నారు.

ఎం.ఎస్.స్వామినాథన్‌తో వ్యాస రచయిత

ప్రతిభగల స్వామినాథన్‌ను ప్రపంచ స్థాయి వ్యవసాయ పరిశోధనా సంస్థ (సి.జి.ఐ.ఎ.ఆర్) తన ముఖ్య పరిశోధనా సలహాదారుగా గుర్తించింది. మనీలా (ఫిలిప్పైన్స్) అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ నిర్దేశకుడిగా నియమించుకున్నారు. ఆ క్రమంలో ఆయన తనదైన ముద్రతో అనేక ఆసియా, ఆఫ్రికా దేశాల వ్యవసాయ పరిశోధనా రంగ ప్రగతికి తోడ్పడ్డారు. చైనా, వియత్నాం, ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్ వంటి దేశాల పరిశోధనా రంగ ప్రగతికి తోడ్పాటునిచ్చారు. చైనా నెలకొల్పిన వ్యవసాయ వ్యవస్థ ప్రత్యేకతను గుర్తించారు.

స్వామినాథన్‌ను అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అలానే, అనేక సంస్థలు, వ్యక్తులు పురస్కాలిచ్చారు. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి ద్వారా ఆయన మొదటి 'ప్రపంచ ఆహార పురస్కారం' (వరల్డ్ ఫుడ్ ప్రైజ్) పొందటం విశేషం. అంతేగాక ఆయనకు 'పద్మ' అవార్డులన్నీ లభించాయి. మరణానంతరం "భారత రత్న" కూడా ఇచ్చారు.

స్వామినాథన్ రాజ్యసభ సభ్యుడిగా "మహిళా రైతుల" హక్కుల గురించి, పటిష్ట వ్యవసాయ రంగ అభివృద్ధి గురించి, సమగ్ర భూ, రైతు రక్షణ అంశాలతో ముడిపడిన సంస్కరణల విషయాల్ని ప్రస్తావించారు. మహిళా రైతులకు భూ వనరు, ప్రభుత్వ పథకాల విస్తరణకు తగిన చట్టాల్ని ప్రవేశ పెట్టిన ఘనత స్వామినాథన్‌ది. వ్యవసాయ సాంకేతికాల విస్తరణ, ఉత్పత్తి పరంగా ప్రభుత్వ పాత్ర పెరగాలని, ప్రభుత్వేతర సంస్థల ద్వారా రైతులకివ్వబడే సాంకేతికాల పరంగా, నియంత్రణ జరగాలని చట్ట సభలో వ్యక్తపరిచారు. ముఖ్యంగా కృత్రిమ జన్యు మార్పిడి ద్వారా జరిగిన సాంకేతికాల్ని విశ్లేషించి, పరిశోధించకుండా విస్తరింప చేయకూడదని చెప్పారు. విచ్చలవిడి రసాయనాల వాడకం, యంత్రాల వినియోగం వలన జరుగుతున్న నష్టాల్ని 1968 సైన్స్ కాంగ్రెస్ స్థాయిలోనే వివరించారు.

ప్రపంచ శాంతికి దోహదపడే లక్ష్యంతో ఏర్పడ్డ "పుగ్వాష్ సమూహం" (బెట్రాండ్ రస్సెల్, ఐన్‌స్టీన్ వంటి ప్రముఖులు, ఇతర నోబెల్ పురస్కారాలు పొందిన శాస్త్రవేత్తలు కలిసి ఏర్పాటు చేసిన సంస్థ)కు 2002-2007 కాలంలో నిర్దేశకుడిగా ఎన్నికయ్యారు. తనకొచ్చిన పురస్కారాలను దేశ ప్రముఖ సంస్థల ఆర్థిక సహకారాల్ని, ప్రజా సైన్ ఉద్యమం కోసం స్వామినాథన్ పరిశోధనా సంస్థను నడపటం మరో ప్రత్యేకత (అనేక మంది ఉన్నత స్థాయి శాస్త్రవేత్తలు, ఉపకులపతులు కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీల సలహాదారులుగా 'సేవ' చేయటాన్ని చూస్తున్నాం). భారతదేశం హరిత విప్లవ వరవడిలో నష్టపోయిన, స్థానిక చిరుధాన్య పంటల అభివృద్ధికి తన సంస్థ ద్వారా కృషి సల్పారు. అలానే వ్యవసాయ అనుబంధ వృత్తిగా ఉన్న మత్స్యకారులు అభివృద్ధికి తగిన పథకాలను రూపొందించి దక్షిణ భారతదేశ తీర ప్రాంతంలో పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు నిర్వహించారు. మడ అడవుల్ని రక్షించి జలజీవాల మనుగడను కాపాడే పథకాలను అమలు చేశారు. ఆహార భద్రత పథకాల అమలు విషయంలో ప్రభుత్వాల ఆచరణ అంశాలను విశ్లేషించగల శాఖల్ని నిర్వహించారు.

తాను హరిత విప్లవ పితామహుడిని అనిపించు కోవటం కంటే ముగ్గురు మహిళా శాస్త్రవేత్తలకు తండ్రిని అనిపించుకోవటానికే గర్వపడతానన్న వ్యక్తి స్వామినాథన్. అలాగే విద్యారంగ విస్తరణ ఉద్యమంలో పని చేసి అనేక సంస్కరణలకు ప్రేరకురాలిగా జీవించిన మీనా (భూతలింగం) భర్తగా తాను చెప్పుకోదగిన స్థాయికి చేరానని భావించారాయన. జీవిత చివరి దశలో జాతీయ రైతు కమిషన్ బాధ్యుడిగా, భారతదేశ రైతులకు తగిన సంస్కరణలను ముఖ్యంగా ఆదివాసీలకు, చిన్న సన్నకారు వృత్తిదారుల అభివృద్ధికి తగిన విధంగా సూచనలివ్వటం గర్వించదగిన విషయమని చెప్పుకొన్నారు. అఖిల భారత కిసాన్ సభ నాయకులతో కలిసి, తను ఆశించిన ప్రభుత్వాల వైఖరిలో రావాల్సిన మార్పుల్ని వ్యక్తపరిచారు. వామపక్షాలు కోరే వ్యవసాయ వనరుల విషయంలో జరిగిన సంస్కరణల్ని తన నివేదికల్లో పొందుపరిచారు. పరోక్షంగా భూసారం, పర్యావరణం కాపాడబడాలంటే, దున్నే వారికే (వ్యవసాయం చెయ్యగలిగిన రైతుకే) భూమి, సాగునీటి వనరు ఉండాలని వివరించారు. అలాగే ప్రపంచ వాణిజ్య సంస్థ అసమంజస విధానాల్ని సరిచెయ్యాలంటే "భారత వాణిజ్య సంస్థ" ద్వారా రైతు రక్షించబడాలని స్పష్టంగా పేర్కొన్నారు. పంట భూములు వ్యవసాయేతర రంగాలకు, సంస్థలకు మరల్చకూడదని సూచించారు. వ్యవసాయ రక్షణకు ప్రత్యేక వ్యవసాయ మండళ్లను రూపొందించాలని సూచించారు. "ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్" నిర్దేశకుడిగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన సంస్కరణలు అమలుజరగాలని వివిధ దేశాల ప్రభుత్వాలకు ఐక్యరాజ్య సమితి ద్వారా సూచించారు.

ప్రొ.స్వామినాథన్ శతజయంతి (ఆగస్టు 7, 2025) సందర్భంగా ఆయన స్మృత్యర్థం స్వామినాథన్ పరిశోధనా సంస్థ (చెన్నై), భారత దేశ వ్యవసాయ శాఖ వారు సంయుక్తంగా న్యూ ఢిల్లీలో అంతర్జాతీయ సెమినార్ నిర్వహించబోతున్నారు. అందుకు వారిని అభినందిస్తూ ఆయనిచ్చిన విలువైన జాతీయ రైతు కమిషన్ సిఫార్సుల్ని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరపాలని కోరుకుందాం! అప్పుడే ఆయనకిచ్చిన "భారత రత్న"కు సార్థకత లభిస్తుందని, ప్రభుత్వాలు "హిపోక్రసీ" ప్రవాహం నుంచి బయట పడగలవని ఆశిద్దాం!!

/ వ్యాసకర్త విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త,
సెల్ : 9490098905 /

స్పందన

సమస్యల పరిష్కారం అడిగితే సంఘాల నిషేధమా?

"పాఠశాల నుండి రాజకీయాలను దూరం చేయడం కోసం ఈ ఉత్తర్వులని చెప్తున్న ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు మాత్రం అనుమతి ఇచ్చింది. ఎస్.ఎం.సి కమిటీలలో 90 శాతం కూటమి పార్టీలకు చెందిన రాజకీయ నాయకులే వున్నారు కదా. ఈ ఉత్తర్వుల ద్వారా కూటమి ప్రభుత్వం ఏం చేయాలని అనుకుంటున్నదంటే పాఠశాల నిధులను ఎస్.ఎం.సి సభ్యులకు (తన పార్టీ క్యాడర్‌కు) అప్పనంగా అప్పజెప్పి, దీనిని ప్రశ్నించకుండా విద్యార్థి సంఘాలను నిషేధించింది. ఎంత అద్భుతమైన పన్నాగం వేశారో కదా మన విద్యాశాఖ మంత్రి గారు...!"

విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు తీసుకున్నారు కాబట్టి విద్యా వ్యవస్థ ఎంతో కొంత గాడిన పడుతుందనుకున్నారు రాష్ట్ర ప్రజలు. కానీ అధికారం చేపట్టి సంవత్సరం గడిచేలోపు విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారు మన మంత్రిగారు. ఆగస్టు ఒకటిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌సి నెం 30/67/2025 తీసుకు వచ్చింది. ఈ సర్క్యులర్ సారాంశం పాఠశాలల్లోకి తల్లిదండ్రులు, ఎస్.ఎం.సి సభ్యులు మినహా ఇతరులు ఎవరూ రాకూడదు. రాజకీయపరమైన గుర్తులు ఉండకూడదట. ఎటువంటి ఫిర్యాదులైనా పరిపాలనా విభాగంలోనే ఇవ్వాలి. ఈ సర్క్యులర్ చూసిన మేధావులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ రాజ్యాంగ విరుద్ధ విధానాలను తీవ్రంగానే విమర్శిస్తున్నారు. ఆర్టికల్ 19(1)(సి) ప్రకారం దేశంలో పౌరులైన ప్రతి ఒక్కరికి సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును రాజ్యాంగం కల్పించింది. మరి ఆ హక్కు విద్యార్థులకు వర్తించదా? పాఠశాలల్లో విద్యార్థి సంఘాలను నిషేధించడమంటే...వారికి సంఘంలో చేరే హక్కును దూరం చేసినట్టే కదా. 1975లో తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీలో ఎన్.ఎస్.యు.ఐ విద్యార్థి సంఘంలో తన రాజకీయ జీవితాన్ని మొదలుబెట్టారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. పాఠశాల నుండి రాజకీయాలను దూరం చేయడం కోసం ఈ ఉత్తర్వులని చెప్తున్న ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు మాత్రం అనుమతి ఇచ్చింది. ఎస్.ఎం.సి కమిటీలలో వున్నది 90 శాతం కూటమి పార్టీలకు చెందిన రాజకీయ నాయకులే కదా. ఈ ఉత్తర్వుల ద్వారా కూటమి ప్రభుత్వం ఏం చేయాలని అనుకుంటున్నదంటే పాఠశాల నిధులను ఎస్.ఎం.సి సభ్యులకు (తన పార్టీ క్యాడర్‌కు) అప్పనంగా అప్పజెప్పి, దీనిని ప్రశ్నించకుండా విద్యార్థి సంఘాలను నిషేధించింది. ఎంత అద్భుతమైన పన్నాగం వేశారో కదా మన విద్యాశాఖ మంత్రి గారు.

ప్రధానంగా ఈ సర్క్యులర్ మూడు అంశాలను చెబుతోంది. మొదటిది ప్రవేశం నిషేధించడం. అంటే పేరెంట్స్, ఎస్ఎంసి సభ్యులకు తప్ప మరెవరికీ పాఠశాలల్లోకి అనుమతి లేదు. ముఖ్యంగా పిల్లలతో ఎటువంటి ఫోటోలు తీసుకోకూడదు. ఈ నిబంధనకు వారు చెప్పున్న ప్రధాన కారణం ఏమిటంటే విద్యా కార్యకలాపాలకు అంతరాయం కలగకూడదనట. నాణేనికి ఒకవైపు ఉండే అంశం అందరికీ సబబుగానే అనిపిస్తుంది. కానీ నాణేనికి రెండో వైపు కూడా చూడాలి కదా. ఎస్ఎంసి సభ్యుల అవినీతి బాగోతం మనం చూస్తూనే వున్నాం. ఇప్పుడు దాన్ని ప్రశ్నించే విద్యార్థి సంఘాలను నిషేధిస్తే ఇంక వారి దోపిడీకి అడ్డు ఉంటుందా? పార్టీలోని సెకండరీ కేడర్‌కు ప్రభుత్వ నిధులు దోచిపెట్టే పన్నాగం ఇదని ప్రతి ఒక్కరికీ అర్థం అవుతుంది. దీనితోపాటు విద్యా కార్యకలాపాలకు అంతరాయం కలగకూడదని చెబుతున్న ప్రభుత్వం, ఆ విద్య నేర్పాల్సిన ఉపాధ్యాయులను అనేక యాప్‌ల పేరుతో వేధిస్తున్నది. మరి ఆ ఉపాధ్యాయులు యాప్ లలో సమాచార నిక్షిప్తం చేస్తూ కూర్చుంటారా? లేక విద్యార్థులకు చదువు చెప్తారా? మరి ఇది విద్యా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే కదా! ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదా? లేక ఆలోచించినట్టు నటిస్తోందా?

ఇక రెండో అంశానికి వస్తే విద్యార్థుల దగ్గర ఎటువంటి సర్వేలు చేయకూడదట. వారి సమస్యలు తెలుసుకోకూడదు. ఒకవేళ బయట వ్యక్తులు ఏమైనా సమస్యలు గుర్తిస్తే వాటికి సంబంధించిన ఫిర్యాదులు పరిపాలనా విభాగంలో మాత్రమే ఇవ్వాలి. ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థులతో ఆ సమస్యలపై ఫిర్యాదు చేయించకూడదట.

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి తెలిసిందే. మెజారిటీ స్కూళ్లల్లో కనీస సౌకర్యాలు కూడా ప్రభుత్వం అందించడం లేదు. మరి ఆ సమస్యలపై విద్యార్థులు స్పందించకుండా ఎలా ఉంటారు? ప్రభుత్వం ఈ సంవత్సరం ఇచ్చిన విద్యా కానుక కిట్లు ఇప్పటికే చినిగిపోతున్నాయి. మధ్యాహ్న భోజన పథకం ఎంత దారుణమైన స్థితిలో ఉందో చెప్పక్కర్లేదు. పాఠశాలకు రావాల్సిన ఉపాధ్యాయులను ట్రైనింగులు, యాప్‌ల పేరుతో వేధింపులకు గురిచేస్తూ...నిర్ణీత సమయంలోపు సిలబస్ పూర్తి కావడానికి ప్రభుత్వమే అడ్డంకిగా నిలుస్తోంది. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ గోడలు లేక విద్యార్థులపై ఆకతాయిల వేధింపులు జరుగుతున్నాయి. మరికొన్ని చోట్ల మరుగుదొడ్ల సౌకర్యాలు కరవయ్యాయి. ఇన్ని సమస్యల సుడిగుండంలో విద్యార్థులు చదువు నేరుస్తుంటే...వారి సమస్యలపై ప్రశ్నించకూడదు అంటూ నిషేధాన్ని విధించడం నిజంగా మతిమాలిన చర్య. సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలి గానీ సమస్యలు పరిష్కరించమని అడిగిన సంఘాలపైనే నిషేధం విధించడం ప్రభుత్వపు చేతకానితనాన్ని నిరూపిస్తోంది.

మూడో అంశం ఏమిటంటే రాజకీయ చిహ్నాల నిషేధం. అనగా పాఠశాల ఆవరణలో రాజకీయ లేదా రాజకీయ సంబంధిత జెండాలు, శాలువాలు, బ్యానర్లు, పోస్టర్లు పాఠశాల ఆవరణలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రదర్శించరాదట. అంటే దాని అర్థం రాజకీయ పార్టీలతో పాటు రాజకీయాలకు అనుబంధంగా ఉండే విద్యార్థి సంఘాల చిహ్నాలు పాఠశాలలో ఉండరాదని ప్రభుత్వం చెబుతోంది. మొన్నటికి మొన్న విజయనగరం జిల్లాలో గుర్ల మండల ఉన్నత పాఠశాలలో సాక్షాత్తు ఆ ప్రాంత ఎమ్మెల్యే కళా వెంకట్రావు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మరిచారా? ఆయన టిడిపి జెండా మెడలో వేసుకొని పాఠశాలలో ప్రతి తరగతి గదికి తిరుగుతూ టిడిపి అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించిన విషయం మన విద్యాశాఖ మంత్రి గారికి గుర్తులేదా! విద్య నేర్చుకోవడం అంటే పాఠ్యాంశాలను మాత్రమే చదవడం కాదు, ఈ సమాజాన్ని కూడా చదవడమని విజ్ఞులు చెప్తున్నారు. ఇటువంటి సందర్భంలో విద్యార్థులు బయట జరిగే రాజకీయాలను, అదేవిధంగా విద్యార్థి సంఘాల సమాచారాన్ని తెలుసు కోవడానికి పూర్తి స్థాయిలో రాజ్యాంగబద్ధ హక్కును కలిగి ఉన్నారు. ఈ హక్కును కాలరాసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. కాబట్టి ఈ సర్క్యులర్‌ను రాజ్యాంగ విరుద్ధ సర్క్యులర్‌గా భావించి తక్షణమే రద్దు చేయాలి. తన తండ్రి కూడా ఇటువంటి విద్యార్థి సంఘాల ద్వారానే రాజకీయ జీవితం ప్రారంభించారనే విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జ్ఞప్తికి తెచ్చుకోవాలి. రాష్ట్ర పాఠశాలల్లో ఉన్న విద్యారంగ సమస్యలపై విద్యాశాఖ దృష్టి సారించాలి. గత ప్రభుత్వం ఐదేళ్లలో విద్యారంగాన్ని నాశనం చేసిందని చెప్పిన ఈ ప్రభుత్వం విద్యా రంగాన్ని గాడిన పెట్టే పని చేయాలి తప్ప మరింత నాశనం చేసే పనికి పూనుకోకూడదు.

- జె. రవికుమార్,
ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షుడు,
విజయనగరం,
సెల్ : 7288849236 /

స్మృతి

తల్లిదండ్రులు గర్వించదగిన తనయ డా॥ ముత్తులక్ష్మీ రెడ్డి

ముత్తులక్ష్మీ రెడ్డి ఒక ప్రముఖ వైద్యురాలు, సంఘ సంస్కర్త. అంతేకాదు. ఆమె ఎన్నో విధాలుగా తొలి యోధ. బ్రిటీష్ ఇండియాలో మొట్టమొదటి శాసన సభ్యురాలు. పురుషుల కాలేజీలో చేరి, వైద్య విద్యనభ్యసించిన ప్రప్రథమ మహిళ. మద్రాసు కార్పొరేషన్‌లో ప్రథమ మహిళా కౌన్సిలర్. మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్‌కి మొదటి ఉపాధ్యక్షురాలు. మద్రాసులో మొట్టమొదటి పిల్లల ఆసుపత్రినీ, దక్షిణాదిన తొలి క్యాన్సర్ ఆసుపత్రినీ ప్రారంభించారు. ఆమె సేవలకుగాను 1956లో భారత ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. అయితే ఇవన్నీ అంత సులభంగా సాధ్యం కాలేదు. సమాజం దూరంగా పెట్టిన దేవదాసీ కుటుంబంలో పుట్టిన ముత్తులక్ష్మి చిన్నతనం నుండి ఆ వివక్షకు గురవుతూనే పోరాటశీలిగా మారింది.



ముత్తులక్ష్మి 1886 జులై 30వ తేదీన తమిళ ప్రాంతమైన పుదుక్కోటలో జన్మించింది. తండ్రి నారాయణ స్వామి, తల్లి చంద్రమ్మాళ్. తండ్రి స్థానిక మహారాజ కళాశాలలో ప్రధానోపాధ్యాయుడు. తల్లి దేవదాసీ నేపథ్యం గల మహిళ. ఆ రోజుల్లో బాలికలకు కేవలం తమిళ మాధ్యమం గల పాఠశాలల్లోనే ప్రవేశం. అది కూడా పరిమితంగా వుండేది. ఆనాడే ఆంగ్లంలో బోధన జరిగే బాలుర పాఠశాలలో పోరాడి మరీ ప్రవేశించింది ముత్తులక్ష్మి.

1902లో 100 మందిలో ఒకర్తిగా మెట్రిక్యులేషన్ పరీక్షకు హాజరైనా, ఉత్తీర్ణులైన 10 మందిలోనూ ఒక్కర్తిగా నిలిచింది. పురుషులకు మాత్రమే ప్రవేశమున్న మహారాజ మెడికల్ కళాశాలలో ఆమె చేరిక కూడా సులభంగా జరగలేదు. ముత్తులక్ష్మి విద్యాభిలాష ఎరిగిన ఆమె తండ్రి పుదుక్కోట రాజు భైరవ తొండమాన్ సహాయంతో ఆమెకు కళాశాలలో ప్రవేశం సాధించగలిగారు. చుట్టూ పరదాలు కట్టిన కారులో ఆమె కళాశాలకు వెళ్లేది. మగ పిల్లల కంటబడకుండా కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే కనబడేలా ప్రత్యేక ఏర్పాటు చేసి ఆమెను తరగతి గదిలో కూర్చోబెట్టేవారు.

ఆ రకంగా ఎన్నో వివక్షలు చవిచూసిన ముత్తులక్ష్మి 1912లో వైద్య విద్యలో పట్టా పొంది ఎగ్మూరు పిల్లల ఆసుపత్రిలో హౌస్ సర్జన్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తను దేవదాసీ కుటుంబం నుంచి రావడం వల్ల తల్లి చంద్రమ్మాళ్ చిన్న వయసులోనే తన కూతురి వివాహం చెయ్యాలనుకున్నది. తండ్రి మాత్రం ముత్తులక్ష్మి కోరుకున్నట్లుగా ఆమెను వైద్య కళాశాలలో చేర్పించడానికి అష్టకష్టాలు పడి, సాధించగలిగాడు. ఏమైనా తల్లి దండ్రులను సంతృప్తి పరిచి వారికి తగిన తనయగా ముత్తులక్ష్మి నిలిచారు.

పురుషాధిక్య సమాజపు ఎత్తు పల్లాల్ని చవిచూసిన ముత్తులక్ష్మి వైవాహిక బంధానికి దూరంగా వుండాలనుకున్నారు. అయితే ఆమె జీవిత గమ్యాన్ని నిశితంగా పరిశీలించిన డా॥ టి. సుందర్ రెడ్డి ఆమె నిరాడంబరతకు, కర్తవ్య దక్షతలకు ముగ్ధుడై తన ఆశయాలకు అడ్డు తగలనని, ముత్తులక్ష్మికి నమ్మకం కలిగించి మరీ 1914లో ఆమె 28వ ఏట తన జీవిత భాగస్వామిని చేసుకున్నారు.

1926-30 మధ్య కాలంలో ఆమె విధాన సభకు ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ఆమె బాలికల వివాహ వయసును 16 సంవత్సరాలకు పెంచాలని శాసనసభలో చర్చకు పెట్టడమేగాక, 1928లో గాంధీజీకి 3 పేజీల లేఖ రాశారు. ప్రైవేట్ ప్రాక్టీసుతో పాటు అవసరమైనపుడు ఇతర ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేసేవారు. బాలికల ఆరోగ్య పరిరక్షణ, ఉన్నత విద్య, సురక్షిత ప్రసవం, మంచి ఆరోగ్యం, ఆహారం, సంఘ సంస్కరణ ఆమెకు ఇష్టమైన అంశాలు. బాల్య వివాహాల నిషేధం, వితంతు వివాహాల ప్రోత్సాహం పట్ల ఆమె ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు. అయితే దేవదాసీల నిర్మూలనా చట్టం ప్రవేశ పెట్టడంలో ఆమె విఫలమయ్యారనే చెప్పాలి.

డా॥ ముత్తులక్ష్మి 1968 జులై 22న మరణించారు. వైద్య రంగం ఆ తరువాత అనేక విధాలుగా పురోగమించింది. అయితే వైద్యుల మన: స్థితిలో మాత్రం కొంత దిగజారుడు తనం ప్రవేశించి, అందరూ కాదు గానీ కొంతమంది వైద్యం ముసుగులో చేస్తున్న అరాచకాలు సభ్య సమాజాన్ని కలవర పెడుతున్నాయి. మరింత మంది ముత్తులక్ష్మీ రెడ్డిల రాకతోనే ఈ అవకతవకలు అంతమై వైద్య రంగం ప్రక్షాళన అవుతుందని ఆశిద్దాం.

- వి. సుమతి

కొండెక్కిన పూల ధర

ప్రజాశక్తి - కడియం (తూర్పుగోదావరి జిల్లా)

పెళ్లిల్లు, శుభముహూర్తాలు, శ్రావణ శుక్రవారం వ్రతాలు ఒకేసారి రావడంతో పూల ధరలకు రెక్కలు వచ్చాయి. కడియపులంక అంతర్రాష్ట్ర పూల మార్కెట్ అమ్మకం, కొనుగోలుదారులతో బుధవారం కిక్కిరిసపోయింది. ప్రస్తుత సీజన్‌లో ఉభయగోదావరి జిల్లాల్లో పూల దిగుబడులు అంతగా లేకపోవడంతో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు చిత్తూరు జిల్లా నుంచి బంతి, చామంతి, గులాబీ వంటి రకాలను టన్నులు కొలది మార్కెట్‌కు దిగుమతి చేసుకుంటు న్నారు. అలాగే వివాహాది శుభకార్యాలకు కావలసిన డెకరేషన్ పువ్వులను బెంగళూరు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే శ్రావణ శుక్రవారంకు కావలసిన పూల కొనుగోలు నిమిత్తం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వ్యాపారులు వచ్చి పూలను కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. ఆర్డర్లపై స్థానిక పూల వ్యాపారులు ఆర్‌టిసి బస్సులు ద్వారా ఎగుమతులు చేపట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల కడియం, ఆలమూరు, ఆత్రేయపురం మండలాల లో సాగయ్యే కనకాంబరం, లిల్లీ, మల్లి, జాజులు, గులాబీ వంటి పూల పంటలు దారుణంగా దిగుబడి తగ్గింది. అందువల్ల ప్రస్తుత సీజన్లో వాటి ధరలు మరింత అధికమయ్యాయి. బుధవారం కడియపులంక పూల మార్కెట్లో పూల ధరలు ఈ విధంగా ఉన్నాయి. చామంతి కేజీ రూ.400-450, వైట్ చామంతి రూ.460, ఎరుపు చామంతి రూ.400, నీలం చామంతి రూ.300, బంతి రూ.100 నుంచి 120, కనకాంబరాల బారు రూ.150 నుంచి 170, గులాబీ రూ.250, జాజులు రూ.600, లిల్లీ రూ.450, మల్లి రూ.1000, హైబ్రిడ్ గులాబీ కట్ట రూ.250 ధర పలుకుతోంది.

తీర ప్రాంత భద్రతపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి-మధురవాడ (విశాఖ)

తీర ప్రాంత భద్రతతో పాటు తీవ్రవాదుల చొరబడినప్పుడు అత్యవసర పరిస్థితులలో ఎలా స్పందించాలి, సమర్ధవంతమైన రక్షణ చర్యలు ఎలా చేపట్టాలి అనే అవగాహనకు ఆక్టోపస్ చార్లీ టీమ్ ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ డ్రిల్‌లో ఆక్టోపస్ కమాండోలు అత్యాధునిక ఆయుధాలతో గీతంలోని పలు భవంతులలో తీవ్రవాదులను గుర్తించి, వర్సిటీ సిబ్బందిని రక్షించే ఆపరేషన్‌ను ప్రయోగాత్మకంగా నిర్వహించారు. చార్లీటీమ్ ఉన్నతాధికారులు డిఎస్‌పిలు తిరుపతయ్య, డి.రాంబాబు నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్‌లు ఎస్.శివాజి, పిఎస్ఎం.రెడ్డి, వి.శ్రీనివాసరావు పాల్గొని అత్యవసర పరిస్థితులలో విద్యార్థులు, సిబ్బంది, గీతం భద్రత విభాగం ఎలా స్పందించలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గీతం సేఫ్టీ విభాగం ఆధికారి కె.పి.చక్రధర్, గీతం విజలెన్స్ అండ్ సెక్యూరిటీ గోపి కుమార్, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, పాల్గొన్నారు. మాక్ డ్రిల్ అనంతరం ఆక్టోపస్ బృందానికి గీతం అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

సిపిఎం సీనియర్ కార్యకర్త లక్ష్మీనారాయణ కన్నుమూత

ప్రజాశక్తి - తిరువూరు (ఎన్‌టిఆర్ జిల్లా)

సిపిఎం సీనియర్ కార్యకర్త, ఆదర్శ కమ్యూనిస్టు మాచిబోయిన లక్ష్మీ నారాయణ (92) బుధవారం కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులోని తన నివాసంలో తుదిశ్వాస విడిశారు. ఆయనకు ఐదుగురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. గుంటూరు ప్రాంతం నుండి వచ్చిన ఓ సామాన్య కుటుంబానికి చెందిన లక్ష్మీనారాయణ తిరువూరు చీరాల సెంటర్లో సోడాలు అమ్ముకుంటూ క్యమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారు.

నేటి తరానికి ఆదర్శం

మాచిబోయిన లక్ష్మీ నారాయణ నేటి తరానికి ఆదర్శప్రాయుడు. ఈఏడాది జనవరిలో జరిగిన సిపిఎం ఎన్టీఆర్ జిల్లా మహాసభలో ఆయనను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు బి.ఆర్.తులసీరావు, సిహెచ్.బాబురావు, జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ సన్మానించారు. 92 సంవత్సరాల వయసులో కూడా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయం. 1955లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్న లక్ష్మీనారాయణ 1964లో పార్టీ చీలిక అనంతరం సిపిఎంలో చేరి చివరి వరకూ సభ్యుడిగా కొనసాగారు. అయితే పార్టీ సభ్యుడుగా ఉండాలంటే నిర్దేశించిన కర్తవ్యాలను అమలు చేయాల్సి ఉంటుందని, వయో భారం కారణంగా తాను ఆ కర్తవ్యాలను అమలు చేయలేనని, అందువల్ల పార్టీ సభ్యుడుగా ఉండలేనని, సానుభూతి పరుడుగా ఉంటానని చెప్పిన లక్ష్మీనారాయణ...పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతకు అద్దం పడుతుంది. ఆయన భౌతికకాయాన్ని పలువురు నేతలు సందర్శించి నివాళులర్పించారు. లక్ష్మీనారాయణ అంత్యక్రియలు గురువారం ఉదయం 11 గంటలకు తిరువూరులో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

డాక్టర్ నమ్రత చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సృష్టి ఫర్టిలిటీ సెంటర్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో ప్రధాన నిందితురాలు, ఆ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆమెను ఐదు రోజులపాటు కస్టడీకి తీసుకుని విచారించిన గోపాలపురం పోలీసులు సృష్టిలో మోసాలపై పలు కీలక విషయాలు రాబట్టినట్టు తెలిసింది. మంగళవారం పోలీసు కస్టడీ ముగియడంతో ఆమెను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. అయితే, కేసుకు సంబంధించిన పూర్తి స్థాయిలో వివరాలను పోలీసులు సేకరించలేకపోవడంతో తిరిగి మరోసారి నమ్రతను కస్టడీకి తీసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా బుధవారం నమ్రతను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు.

'పట్టు' కోల్పోతున్న చేనేత

ప్రజాశక్తి-అనంతపురం, ధర్మవరం రూరల్

రాష్ట్రంలోనే అత్యధికంగా చేనేత కార్మికులుండే ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, రాప్తాడు, ఉరవకొండ, పుట్టపర్తి, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. పవర్‌లూమ్స్ రాక, పాలకుల నిర్లక్ష్యం, ముడిసరుకుల ధరలు పెరగుదల, చీరలకు గిట్టుబాటు ధరల లేకపోవడం తదితర కారణాలతో చేనేత రంగం కుదేలైంది.

అమలుకాని చేనేత రిజర్వేషన్ చట్టం

చేనేత రంగ పరిరక్షణ కోసం 1985లో చేనేత రిజర్వేషన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీని ప్రకారం 11 రకాల చేనేత వస్త్రాలను హ్యాండ్‌లూమ్ మినహా మిగతా దేనిద్వారా తయారు చేయకూడదనే నిబంధన చేసింది. ఇందు కోసం ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను ఏర్పాటు చేసింది. 1990 వరకు ఆ చట్టం సరిగా అమలైంది. తరువాత ఇందులో మార్పులు చోటు చేసుకున్నాయి. 2000 సంవత్సరం వచ్చే సరికి రిజర్వేషన్ చట్టం పూర్తికి అతిక్రమణకు గురైంది. చేనేత రకాలను ఇబ్బడి ముబ్బడిగా పవర్‌లూమ్స్‌లో తయారు చేయడం మొదలైంది. రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చుట్టపుచూపుగా తనిఖీలు నిర్వహిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. దీంతో పవర్‌లూమ్స్ విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

జిఎస్‌టితో మరో పిడుగు

ఉన్న కష్టాలకు తోడు చేనేత రంగంపై కేంద్ర తీసుకొచ్చిన జీఎస్టీ దెబ్బ మరింత తీవ్ర నష్టాన్ని చేకూరుస్తోంది. యంత్రాలతో తయారయ్యే వస్త్రంపై 5 శాతం జీఎస్టీ అమలు చేసిన కేంద్రం చేతి వృత్తులపై తయారయ్యే దానికి కూడా దానిని వర్తింపజేసింది. ముడిపట్టుపై 5 శాతం, జరీపై 12, అద్దకం, రంగులపై 18, పట్టు వస్త్రంపై 5 శాతం జిఎస్‌టిని విధిస్తోంది.

జగన్ క్షమాపణ చెప్పాలి : ఆనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చైర్మన్, టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాసిరకం మద్యం తాగి ప్రజలు చనిపోతున్నారని చెప్పినా వైసిపి ప్రభుత్వం వినలేదన్నారు. మద్యం కుంభకోణంతో వైసిపిలో ఉన్న ప్రతి నాయకుడికి సంబంధం ఉందని ఆరోపించారు.

కుంభకోణం చేసేందుకు ప్రభుత్వం మద్యం దుకాణాలు పెట్టారనే అనుమానం కలుగుతోందన్నారు. వైసిపి నాయకులు గత ఐదేళ్లుచేసిన తప్పులను ఒప్పుకొని జైలుకు వెళ్లాలని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన తప్పులను తమ ప్రభుత్వంలో జరగకుండా చూస్తున్నామన్నారు.

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
Chola Enter a better life

కార్పొరేట్ కార్యాలయం : "చోలా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు.వి.క. ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
శాఖ చిరునామా : 1వ మరియు 4వ అంతస్తు, శాంతి ప్లాజా, డో.నం.59-14-2ఎ, గాయత్రి నగర్, బెంజి సర్కిల్, విజయవాడ-520008.
శాఖ చిరునామా : 1వ మరియు 2వ అంతస్తు, డో.నం.44-65/1 ఎ, టౌన్ వార్డు నం.18, బ్లాక్ నం.2, టి.ఎస్.నం.1847, ఎస్ఎల్‌వి ఆర్కేడ్, కోళ్ల ఫారం సెంటర్, చంద్రమౌళి నగర్ ఎక్స్‌టెన్షన్, గుంటూరు (ఏపి)-522007.

రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు

ఏదైతే, దిగువసంతకందారు అయిన **మెసర్స్.చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ఇకపై చట్టంగా పిలువబడుతుంది క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని డిమాండ్ నోటీసు జారీచేసి కాలం (సి)లో సూచించిన తేదిన దిగువ కాలం (బి) లో పేర్కొన్న పేర్లుగల రుణగ్రహీతలకు సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా కాలం (డి)లో గుర్తించిన బకాయి మొత్తాలును దానిపై వడ్డీతో పాటు తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీతలు మొత్తాలును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా దిగువసంతకందారు ఇక్కడ రూపొందించబడిన రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమంచిన అధికారాలను వినియోగించుకొని కాలం (ఇ)లో పేర్కొన్న సదరు తేదీలపై తాకట్టుపెట్టబడిన ఆస్తులను **లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకోవడమైనది**. ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, పేర్కొన్న ఆస్తులతో లావాదేవీలు జరుపరాదని మరియు అట్టి లావాదేవీలును కాలం (డి)లో పేర్కొన్న మొత్తాలును వడ్డీ మరియు ఇతర చార్జీలతోపాటు **మెసర్స్. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** కు చెల్లించుటకులోబడి లావాదేవీలు జరుపుకొనుట ఉంటుంది. రుణగ్రహీతలు జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది. మొత్తం బకాయితో పాటు అన్నీ ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో అమ్మకం నోటీసుకు ముందు చెల్లించవలెను.

క్ర సం.	రుణగ్రహీత పేరు మరియు చిరునామా మరియు రుణ ఖాతా నం.	డిమాండ్ నోటీసు తేది	బకాయి మొత్తం	ఆస్తి వివరాలు	స్వాధీనతా తేది
[A]	[B]	[C]	[D]	[E]	[F]
1)	లోన్ అకౌంట్ నం.లు.: X0HEVIJ00002162273, X0HEVIJ00002195014, X0HEVIJ00004929806 1. అఫ్సరున్నిసా మహమ్మద్ (దరఖాస్తుదారు), డో.నం.19-7-97/2, రెడ్డి వీధి, 1వ లైన్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. 2. అఫ్సరున్నిసా మహమ్మద్ (దరఖాస్తుదారు), 3. అబ్దుల్ అలీమ్ (సహ దరఖాస్తుదారు), 4. అబ్దుల్ [illegible]	13-12-2024	13.12.2024 నాటికి రూ. 99,66,588/- మరియు దానిపై వడ్డీ.	అంశం-1 : శ్రీ.మహమ్మద్ అబ్దుల్ కలాం కు చెందిన ఆస్తి గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, గుంటూరు సిటీ లోని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, సంగడిగుంట 1వ లైన్, పాత వార్డు నం.14 లో ప్రాంతం, బ్లాక్ నం.10, టి.ఎస్.నం.637 లో ఆర్‌సిసి భవనం బేరింగ్ డో.నం.19-7-612, 19-7-611 విస్తీర్ణం 125 చ.గ.లు., మూల్యాంకనం నం.27502, కొత్త మూల్యాంకనం నం.90486. హద్దులు : తూర్పు : మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు 15.0 అ.లు., దక్షిణం: ఈ ఆస్తి కాంపౌండ్ గోడ 75.0 అ.లు., పడమర : వార్డెన్ ప్రెస్ ఆస్తి 15.0 అ.లు., ఉత్తరం : బేబి సరోజిని ఆస్తి 75.0 అ.లు. ఈ సరిహద్దుల ఆర్.సి.సి. భవనం పరిధి 125 చ.గ.లు. లేదా 104.52 చ.మీ.లు. మరియు ఎ.సి.సి. షీట్ సైట్ తో అన్నీ తలుపులు, తలుపు మార్గాలు, మున్సిపల్ పంపు, మోటారు మరియు ఇతర అన్నీ ఫిక్చర్లు మాత్రమే. అంశం-2 : [illegible]	05.08.2025
2)	లోన్ అకౌంట్ నం.: ML01GUN00000031490 1. నాగ రమేష్ బాబు ద్రౌ (దరఖాస్తుదారు), 2. ద్రౌ వెంకట సుబ్బమ్మ (సహ దరఖాస్తుదారు), ఇరువురి నివాసం : 36-20, పి పట్నం చిలకలూరిపేట, గుంటూరు-522616. 3. సాయి గణేష్ బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ (సహ దరఖాస్తుదారు), 33-600, కోటప్పకొండ మెయిన్ రోడ్డు, అడ్డరోడ్డు, పురుషోత్తపట్నం-522616.	12-03-2025	12.03.2025 నాటికి రూ. 22,72,144/- మరియు దానిపై వడ్డీ.	శ్రీ.నాగ రమేష్ బాబు (దరఖాస్తుదారు) కు చెందిన ఆస్తి : [illegible] భాగం మరియు పార్శిల్ సర్వే డో.నం.93/1 మరియు 93/2 ఖాళీ సైట్ విస్తీర్ణం 145-42 చ.గ.లు. హద్దులు : సరిహద్దులు : ఉత్తరం : కొలసాని సాంబశివరావు ఇంటి గోడ 66 అ.లు., తూర్పు : బజారు 19-10 అ.లు., దక్షిణం : తోట నాగేశ్వరరావు సైట్ 66 అ.లు., పడమర : తోట నాగేశ్వరరావు సైట్ 19-10 అ.లు.	05.08.2025

తేది : 07.08.2025
ప్రదేశం : గుంటూరు
సం/- అధీకృత అధికారి
మెసెర్స్.చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

IKF Finance Limited
Regd. Off.: #40-1-144, Corporate Centre, M.G. Road, VIJAYAWADA – 520 010
Phone: 91-866-2474644 Fax: 91-866-2485755
Website: ikffinance.com CIN: U65992AP1991PLC012736

30 జూన్, 2025న ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌కాని స్టాండాలోన్ ఆర్థిక ఫలితాల సంగ్రహం
(లిస్టింగ్ రెగ్యులేషన్స్ యొక్క రెగ్యులేషన్ 52(4) తో చదువుతూ రెగ్యులేషన్ 52(8))

(రూ. లక్షలలో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 30 జూన్, 2025 (ఆడిట్ కానివి)	ముగిసిన త్రైమాసికం 31 మార్చి, 2025 (ఆడిట్ అయినవి)	ముగిసిన త్రైమాసికం 30 జూన్, 2024 (ఆడిట్ కానివి)	ముగిసిన వార్షికం 31 మార్చి, 2025 (ఆడిట్ అయినవి)
1	కార్యకలపాల నుండి మొత్తం ఆదాయం	17,932.93	18,907.64	13,200.96	65,024.92
2	కాలానికి నికర లాభం/(నష్టం) (పన్ను ముందు, మినహాయించిన మరియు/లేదా అసాధారణ అంశములు)	2,632.66	3,567.83	2,520.07	14,476.05
3	పన్ను ముందు కాలానికి నికర లాభం/(నష్టం) (మినహాయించిన మరియు/లేదా అసాధారణ అంశముల తరువాత)	2,632.66	3,567.83	2,520.07	14,476.05
4	పన్ను తరువాత కాలానికి నికర లాభం/(నష్టం) (మినహాయించిన మరియు/లేదా అసాధారణ అంశముల తరువాత)	1,954.49	2,648.24	1,888.51	10,794.73
5	ఈ కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం [కాలానికి ఇమిడియున్న లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం(పన్ను తరువాత)]	1,939.18	2,643.68	1,895.99	10,788.71
6	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం	8,954.42	7,015.64	7,015.64	7,015.64
7	రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వులు మినహాయించినవి)	1,61,798.76	91,835.78	82,946.40	91,835.78
8	సెక్యూరిటీస్ ప్రీమియం అకౌంట్	1,13,385.08	45,436.27	45,454.27	45,436.27
9	నికర విలువ	1,70,753.18	98,851.42	89,962.05	98,851.42
10	చెల్లించిన రుణ మూలధనం/బాకీ ఉన్న అప్పు	3,85,395.01	3,92,730.83	2,85,863.71	3,92,730.83
11	అత్యుత్తమ రాడీమబుల్ ప్రిఫరెన్స్ స్టార్స్	లేదు	లేదు	లేదు	లేదు
12	రుణ ఈక్విటీ నిష్పత్తి	2.26	3.97	3.18	3.97
13	వాటా ప్రకారం ఆదాయం (ప్రతిది రూ.10/-) (కొనసాగుతున్న మరియు నిలిపివేయబడిన కార్యకలపాల కొరకు)				
	1. బేసిక్ :	2.69	3.77	2.69	15.39
	2. డైల్యూటెడ్ :	2.68	3.76	2.69	15.34
14	మూలధన విముక్తి రిజర్వ్	వర్తించబడదు	వర్తించబడదు	వర్తించబడదు	వర్తించబడదు
15	డిబెంచర్ రిడెంప్షన్ రిజర్వ్	వర్తించబడదు	వర్తించబడదు	వర్తించబడదు	వర్తించబడదు
16	రుణ సేవా కవరేజ్ రట్టో	వర్తించబడదు	వర్తించబడదు	వర్తించబడదు	వర్తించబడదు
17	ఇంటర్‌సెట్ సర్వీస్ కవరేజ్ రాల్లె	వర్తించబడదు	వర్తించబడదు	వర్తించబడదు	వర్తించబడదు

గమనిక :
ఎ) లిస్టింగ్ రెగ్యులేషన్స్‌లోని నిబంధన 52 ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజ్(లు)కి దాఖలు చేయబడిన త్రైమాసిక/వార్షిక ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం పైన పేర్కొనబడింది. త్రైమాసిక/వార్షిక ఆర్థిక ఫలితాల పూర్తి ఫార్మాట్ స్టాక్ ఎక్స్ఛేంజ్(లు) మరియు లిస్టెడ్ ఎన్‌టిటి www.bsenindia.com మరియు వెబ్‌సైట్ www.ikffinance.com వద్ద అందుబాటులో ఉంది.
బి) లిస్టింగ్ రెగ్యులేషన్స్ యొక్క రెగ్యులేషన్ 52(4) లో సూచించబడిన ఇతర లైన్ అంశాల కోసం, సంబంధిత బహిర్గత స్టాక్ ఎక్స్ఛేంజ్(లు) (బిఎస్ఇ లిమిటెడ్) కు చేయబడింది మరియు యుఆర్ఎల్ www.bsenindia.com లో యాక్సెస్ చేయవచ్చు.
సి) అకౌంటింగ్ విధానాలలో మార్పు(లు) కారణంగా నికర లాభం/నష్టం, మొత్తం సమగ్ర ఆదాయం లేదా ఏదైనా ఇతర సంబంధిత ఆర్థిక అంశం(లు)పై ప్రభావాన్ని ఫుట్‌నోట్ ద్వారా వెల్లడించాలి.

బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తరపున మరియు కొరకు
వసుమతి దేవి కోగంటి
సం/-
మేనేజింగ్ డైరెక్టర్
ప్రదేశం : హైదరాబాద్
తేది : 06 అగస్టు, 2025

बैंक ऑफ़ महाराष्ट्र Bank of Maharashtra ONE FAMILY ONE BANK (A Government of India Undertaking)
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర | జోనల్ ఆఫీస్ విజయవాడ
1వ అంతస్థు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం.59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆం.ప్ర.-520007.
ఫోన్ : 0866-2431225. ఈ-మెయిల్ : zmvijayawada@mahabank.co.in

AX76/Vijayawada/SARFAESI/2025-26 31/07/2025

(రూల్ 8 (1)) స్వాధీనత ప్రకటన

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, చీఫ్ మేనేజర్, విజయవాడ జోన్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి రూలు 8 తో చదివే సదరు యాక్ట్‌లోని సబ్ సెక్షన్ (12) సెక్షన్ 13 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు & హామీదారులు:
ఋణగ్రహీత : 1. మెస్సర్స్ శ్రీ వెంకట రామాంజనేయ రైస్ ట్రేడర్స్ దాని భాగస్వాములు ప్రాతినిధ్యం వహిస్తున్నారు
ఎ. గారపాటి మోహన్ ప్రసాద్ (పార్ట్‌నర్ మెస్సర్స్ శ్రీ వెంకట రామాంజనేయ రైస్ ట్రేడర్స్)
బి. గారపాటి ఆమని (భాగస్వామి మెస్సర్స్ శ్రీ వెంకట రామాంజనేయ రైస్ ట్రేడర్స్)
సి. దామినేని పుల్లారావు (పార్టనర్ మెస్సర్స్ శ్రీ వెంకట రామాంజనేయ రైస్ ట్రేడర్స్)
డి. దామినేని శివరామ ప్రసాద్ (పార్టనర్ మెస్సర్స్ శ్రీ వెంకట రామాంజనేయ రైస్ ట్రేడర్స్)
అధికారిక చిరునామా: తిప్పనగుంట, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా
హామీదారు/తనఖాదారు : 2. శ్రీమతి గారపాటి ధనలక్ష్మి, భర్త : మోహన్ ప్రసాద్, తిప్పనగుంట, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా.
హామీదారు/తనఖాదారు : 3. గారపాటి మోహన్ ప్రసాద్ తండ్రి : తాతా రావు, తిప్పనగుంట, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా.
[illegible]

తేది : 31-07-2025
ప్రదేశం : విజయవాడ
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తరఫున
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, విజయవాడ జోన్.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda **బ్యాంక్ ఆఫ్ బరోడా**
జె.కె.సి కాలేజ్ రోడ్డు గుంటూరు బ్రాంచి
డోర్ నెం.1-2-55, గ్రౌండ్ ఫ్లోర్, భవానీస్ అపార్ట్‌మెంట్, కెఎల్‌పి పబ్లిక్ స్కూల్ ఎదురుగా, జెకెసి కాలేజ్ రోడ్, గుంటూరు, ఏపి-522006.

స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం నోటీసు అనుబంధం-IV-ఎ (రూల్ 6(2) & 8(6) చూడవలెను)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 6 (2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు), తనఖాదారు(లు) మరియు హామీదారు(లు) కు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా / ఛార్జ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తిరిగి వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను **"ఎక్కడ ఏది ఉన్నదో", "అది ఎలా ఉన్నదో అలా", "అక్కడ ఏది ఉంటే అది"** మరియు **"సహాయం లేకుండా"** ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/ తనఖాదారు(లు)/హామీదారు(లు)/ సెక్యూర్డ్ అస్సెట్స్/లు/బకాయిలు/రిజర్వ్ ధర /ఈ-వేలం తేదీ & సమయం, ధరావత్తు మరియు బిడ్ పెంపుదల మొత్తం వివరాలు ఈ దిగువ పేర్కొనబడినవి.

ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తుల వివరములు	బకాయి మొత్తం	రిజర్వు ధర, ధరావత్తు & బిడ్ పెంపుదల	స్వాధీనం యొక్క స్వభావము నిర్మాణాత్మకం / భౌతికం
1) మిస్ తుమ్మల నాగ తనూజ, తండ్రి: శ్రీ తుమ్మల శివ గంగాధర రావు, నివాసం: డోర్ నెం. 8-335, అప్పారావు వీధి, పేరేచర్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-522005. 2) శ్రీ తుమ్మల శివ గంగాధర రావు, తండ్రి: అప్పారావు, నివాసం: డోర్ నెం. 8-335, అప్పారావు వీధి, పేరేచర్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ - 522005. 3) మిస్ తుమ్మల సృజన, తండ్రి: శ్రీ తుమ్మల శివ గంగాధర రావు, నివాసం: డోర్ నెం. 8-335, అప్పారావు వీధి, పేరేచర్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-522005.	(శ్రీ తుమ్మల శివ గంగాధర రావు గారి ద్వారా తనఖా పెట్టబడినది) గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ జిల్లా, పేరేచర్ల గ్రామ పంచాయతీ మరియు గ్రామం సర్వే నెంబరు 431/ఏ/ఈ లో మొత్తం 297.2/9 చదరపు గజాల విస్తీర్ణంలోని మొత్తం స్థలం మరియు అందు నిర్మించిన 525 చదరపు అడుగుల ఆర్.సి.సి భవనంకు హద్దులు: **తూర్పు:** 18 అడుగుల వెడల్పు గల రోడ్డు - 35'-00", **దక్షిణం:** బి.నాగేశ్వరరావు మరియు ఎన్.ఎస్.పి కాలనీ మొదలైన వారి ఆస్తి - 90'-00", **పడమర:** ఎన్.ఎస్.పి కాలనీ - 25'-00", **ఉత్తరం:** శ్రీ తుమ్మల శ్రీనివాసరావు గారి సి-షెడ్యూల్ ఆస్తి - 88'-4"	ది.02.07.2024 నాటికి రూ.25,62,881.59 (అక్షరాలా ఇరవై ఐదు లక్షల అరవై రెండు వేల ఎనిమిది వందల ఎనభై ఒక్క రూపాయల యాభై తొమ్మిది పైసలు మాత్రమే) ప్లస్ తేదీ: 03.07.2024 నుండి వర్తించని వడ్డీ, ఇతర ఛార్జీలు, ఏవైనా ఉంటే వాటి అమలు వరకు అయ్యే ఖర్చులు.	రిజర్వు ధర : రూ. 36,09,000/- ధరావత్తు : రూ.3,60,900/- బిడ్ పెంపుదల మొత్తం రూ.37,000/- ఈ వేలం తేదీ & సమయం: ది. 09-09-2025 మ. 2.00 గం. నుండి సా.6.00 గం. వరకు	భౌతికంగా ఆస్తి తనిఖీ యొక్క తేదీ & సమయం తేదీ: 06-09-2025 సమయం: ఉ.11:00 గం. నుండి సా. 4.00 గం. వరకు (ముందస్తు అపాయింట్‌మెంట్‌తో మాత్రమే)

అమ్మకం యొక్క పూర్తి నియమములు మరియు నిబంధనల కొరకు మా వెబ్‌సైట్ https://www.bankofbaroda.in/e-auction నందలి మాచే ఇవ్వబడిన లింకును చూడండి. మరియు ఆక్షన్ పోర్టల్ baanknet.com నందు కూడా చూడవచ్చును. అర్హత గల బిడ్డర్లు అధీకృత అధికారి యొక్క ఫోన్: 0863-2214182, మొబైల్ నెం. 8977513933 నందు సంప్రదించవచ్చును.

ప్రదేశం: గుంటూరు, తేది: 06-08-2025
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

homefirst We'll take you home
Home First Finance Company India Limited
CIN: L65990MH2010PLC240703
Website: homefirstindia.com Phone No.: 18003008425
Email ID: loanfirst@homefirstindia.com

సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలైన మీరు షెడ్యూలులో పేర్కొన్న ఆస్తి తాకట్టు ద్వారా రుణం పొందియున్నారు మరియు రుణ ఒప్పందం కొరకు రుణగ్రహీత/సహ-రుణగ్రహీతగా దిగువ పేర్కొన్న మీరు ఉన్నారు. మీరు చెల్లించుటలో డిఫాల్టి చెందియున్నారు, దీ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (సంక్షిప్తంగా సర్ఫేసి చట్టం)లోని నియమాల క్రింద, మీ రుణ ఖాతా **03-08-2025**న నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. మేము హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ వారికి మీరు చూపిన చిరునామాలకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(13) తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేశాము. సదరు నోటీసు **03-08-2025**న జారీచేయబడినది మరియు అట్టి నోటీసులలో పేర్కొన్నది ఏమనగా మీకు మంజూరైన వివిధ రుణాలను తిరిగి చెల్లించుటలో మీరు డిఫాల్టి చెందారని వుంది. కావున ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3(1)కు నియమాలలో మరియు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) యొక్క నియమాల ప్రకారం ప్రస్తుత ప్రకటన ద్వారా మీకు నోటీసు ఇవ్వబడుచున్నది.

క్ర. సం.	ఖాతా, రుణగ్రహీత(ల) & హామీదారు(ల) పేరు & చిరునామా	స్వాధీనం చేసుకొను సెక్యూరిటీ వివరాలు	డిమాండ్ నోటీసు తేది నాటికి పూర్తి బకాయి ప్లస్ తదుపరి వడ్డీ & ఇతర వ్యయాలు (రూ.లలో)
1	గుండ కాళీ వరప్రసాద్, గుండ కవిత	ఇంటి-డోర్ నెం.378-ఏ, డోర్ నెం.3-62/ఏ, (పన్ను ప్రకారం డోర్ నెం.6-156, అసిస్ట్ నెం.1268) ధూళిపాళ జిపి & గ్రామం, సత్తెనపల్లి మండలం, పిడుగురాళ్ల ఎస్ఆర్ఓ, గుంటూరు జిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522412. **సరిహద్దులు:** తూర్పు: మాదేకోయ రవి ఆస్తి, దక్షిణం: చిలక మోసయ్య ఆస్తి, పడమర: బజార్, ఉత్తరం: చిలక వెంకటేశ్వర్లు ఆస్తి.	Rs.10,48,878
2	షేక్ లక్ష్మి, షేక్ నవీన్	ఇంటి-డోర్ నెం.77, ఎర్రగుంట్లపాడు గ్రామ పంచాయతీ & గ్రామం, ఫిరంగిపురం మండలం, సత్తెనపల్లి ఎస్ఆర్ఓ, గుంటూరు జిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522549. **సరిహద్దులు:** తూర్పు: చల్లా రత్నారెడ్డి ఆస్తి, దక్షిణం: సనగల కోటిరెడ్డి ఆస్తి, పడమర: ధూళిమూడి రత్నకుమారి స్థలం, ఉత్తరం: బజార్.	Rs.5,76,092
3	లేట్ అర్తిమల్ల పద్మ (మరణించిన), అర్తిమల్ల శ్రీనివాసరావు, లేట్ అర్తిమల్ల పద్మ (మరణించిన) యొక్క ఇతర న్యాయ ప్రతినిధులు	ఫ్లాట్-ఆర్.ఎస్.నెం.38/2, ఫ్లాట్ నెం.21, మధు మాణికాయలరావు నగర్, 6వ లైన్, ఇంద్రకీలాద్రి నగర్ 1వ లైన్, గ్లోబల్ క్రికెట్ అకాడమీ దగ్గర, వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ, పెనమలూరు మండలం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007. **సరిహద్దులు:** ఉత్తరం: ఫ్లాట్ నెం.21 (మిగిలిన ఆస్తి), దక్షిణం: ఫ్లాట్ నెం.22, తూర్పు: 21.0 అ.ల వెడల్పు రోడ్డు, పడమర: 21.0 అ.ల వెడల్పు రోడ్డు.	Rs.19,01,366
4	కొటారి ధన లక్ష్మి, కొటారి మాదేష్	ఫ్లాట్-ఆర్.ఎస్.నెం.411/3, డోర్ నెం.4/201, గూడూరు, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521149. **సరిహద్దులు:** ఉత్తరం: కర్రి కనకదుర్గ ఆస్తి, దక్షిణం: ఉమ్మడి మార్గం, తూర్పు: ఉమ్మడి మార్గం, పడమర: మార్గం.	Rs.7,07,310

పై పేర్కొన్న మొత్తాలను వడ్డీ& ఖర్చులతో ఈనోటీసు ప్రచురణ తేది నుండి 5196 (పాతది), న్యూ మున్సిపల్ నెం.17-2-180, విస్తీర్ణం 300చ.గ.లు, చవాని నది అలీ బేగ్, హైదరాబాద్, తెలంగాణ-500023 నుండి 60 రోజుల కాలవ్యవధిలోగా **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు చెల్లించవలసిందిగా ఇందుమూలంగా మిమ్ములను కోరబడుచున్నది, లేనిచో, ఏదైతే, రుణగ్రహీతలు, తాకట్టుదారులు మరియు హామీదారుల సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసు కొనుటతోసహా సెక్యూర్డ్ అసెట్స్ అన్ని లేదా ఏదేని ఒకటి లేదా మరిన్ని పై సదరు చట్టం యొక్క నియమాల క్రింద అవసరమైన చర్యను **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** తీసుకొంటుంది. దిగువ వాటితోపాటు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు అందుబాటులోగల అధికారాలు: (1) సెక్యూర్డ్ అసెట్స్‌రియలైజింగ్ కొరకు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపేనా బదిలీచేయు అధికారలతో సహా రుణగ్రహీతలు/హామీదారుల సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసుకొంటుంది (2) సెక్యూర్డ్ అసెట్స్ రియలైజింగ్ మరియు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపేనా బదిలీచేయు అధికారాలతోసహా సెక్యూర్డ్ అసెట్స్ నిర్వహణ మరియు మీచే బదిలీచేయబడినట్లైతే బదిలీచేయబడిన సెక్యూర్డ్ అసెట్స్ రియలైజేషన్ మరియు అన్ని హక్కుల్లో రద్దుఅవుతాయి. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) యొక్క నియమాలలో, మీరు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** యొక్క ముందస్తు అనుమతి లేకుండా హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్‌కు హైపోతికేటెడ్/ తాకట్టుచేసిన మరియు పై పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్ ఏదేనినైనా అమ్మకం, లీజు లేదా ఇతర రూపాలు (మీ వ్యాపారంకు ఇతరత్రా)గా కాని బదిలీచేయుట నుండి మీరు నిషేధించబడినారు.

ప్రదేశం: విజయవాడ
తేది: 07-08-2025
సం/- అధీకృత అధికారి,
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

విద్యుత్ కొనుగోలు పిల్‌పై వివరణ ఇవ్వండి

- సెకీకి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను యూనిట్ రూ.2.49 చొప్పును కొనుగోలుకు అగ్రిమెంట్ చేసుకునే నాటికి వేరే రాష్ట్రాల్లో ఏ ధర ఉందో చెప్పాలని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను హైకోర్టు ఆదేశించింది. ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఇచ్చిన ఉత్తర్వుల ప్రతిని అందజేయాలంది. విచారణను సెప్టెంబరు 3కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. సెకీ నుంచి రూ.2.49 పైసలకే 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు అనుమతినిస్తూ కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సిఇఆర్‌సి) ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ టిడిపి నేత, ప్రస్తుత రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ గతంలో వేర్వేరుగా వేసిన పిల్స్‌పై విచారణను వచ్చే నెల 3కు వాయిదా వేసింది.

ప్రజా ఉద్యమాలతోనే ఆర్‌టిసి స్థలాల పరిరక్షణ

- విజయవాడ పాత బస్టాండ్ వద్ద ధర్నాలో పరిరక్షణా కమిటీ నేతలు

ప్రజాశక్తి - విజయవాడ

ఐక్య ఉద్యమాల ద్వారానే ఆర్‌టిసి స్థలాలను పరిరక్షించుకోగలమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. విజయవాడ పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్‌టిసి స్థలాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన బుధవారం పాత బస్టాండ్ వద్ద మహాధర్నా నిర్వహించారు. జిఒ నెంబర్ 137ను రద్దు చేయాలని, ఆర్‌టిసి స్థలాలను పరిరక్షించాలని, లూలూ కంపెనీకి ప్రభుత్వ స్థలాలను ప్రతిఘటించాలని, టిడిపి కూటమి ప్రభుత్వ భూ దాహాన్ని నిలువరించాలని, పర్యావరణాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, రైతు సంఘాల సమాఖ్య సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. లూలూ కంపెనీకి ఆర్‌టిసి స్థలాలను కట్టబెట్టడం ప్రజాభిప్రాయానికి, చట్టాలకు భిన్నంగా ఉందన్నారు. లూలూ కంపెనీకి ఆర్‌టిసి స్థలాన్ని చదరపు అడుగు రూపాయిన్నరకు టిడిపి కూటమి ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. లూలూకు కేరళలో రెండు, దేశ వ్యాప్తంగా 13 మాల్స్ ఉంటే ఎక్కడా ఆయా ప్రభుత్వాలు ఎకరం స్థలం కూడా ఇవ్వలేదన్నారు. విశాఖ బీచ్ రోడ్డులో 13 ఎకరాలు, విజయవాడలో 4.17 ఎకరాలు ఇవ్వడానికి సిఎం చంద్రబాబుకు చేతులెలా వచ్చాయని ప్రశ్నించారు. ధర్నాకు అధ్యక్షత వహించిన ఆర్‌టిసి స్థలాల పరిరక్షణా కమిటీ కన్వీనర్, ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సామాజిక సంపదను ఎవరు దోపిడీ చేసినా, కొల్లగొట్టినా సహించబోమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ..టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఒక్క గజం స్థలం ఇవ్వలేదని, కార్పొరేట్లకు మాత్రం వేలాది ఎకరాలను కట్టబెడుతోందని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల ద్వారానే ఆర్‌టిసి స్థలాలను, లక్షలాది ఎకరాల భూములను కాపాడుకోగలమని తెలిపారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ లూలూ కంపెనీ వస్తే చిన్న, మధ్య తరగతి వ్యాపారుల జీవనోపాధి మరింత ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె.జిలానీబాషా మాట్లాడుతూ 137 జిఒను రద్దు చేసే వరకూ ఆర్‌టిసి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) విజయవాడ జోన్ కార్యదర్శి వై.ఎస్.రావు, జెవివి నాయకులు వి.లక్ష్మణరెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, ఐఎఫ్‌టియు నాయకులు కె.పోలారి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వరరావు, ఆర్‌టిసి పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మురహరి తదితరులు మాట్లాడారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, ఎఐటియుసి, ఎస్‌డబ్ల్యుఎఫ్, ఇయు నాయకులు, ఆర్‌టిసి కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వామపక్షాల నేతలు పాల్గొని మద్దతు తెలిపారు.

విజయవాడ పాత బస్టాండ్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్న పరిరక్షణా కమిటీ నాయకులు

జగన్ పాలనలో ఖజానాకు నష్టం..

- పిల్ దాఖలుపై హైకోర్టు సందేహాలు

ప్రజాశక్తి-అమరావతి

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అక్రమాలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగిందంటూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రం ఆధారంగా సిబిఐ, ఇడి విచారణకు ఆదేశించాలన్న పిల్‌లో ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. అసెంబ్లీలో జరిగిన అంశాలపై ఏ చట్ట నిబంధనల ప్రకారం ఉత్తర్వులివ్వాలని పిటిషనర్‌ను నిలదీసింది. ఏ విధమైన ఆదేశాలూ ఇవ్వబోమని వెల్లడించింది. ప్రచారం, స్వప్రయోజనాల కోసం పిటిషన్ వేశారా? అని అనుమానాన్ని వ్యక్తం చేసింది. రాష్ట్రం సిట్ ఏర్పాటు చేసిందని, అది సరిగ్గా పనిచేయడం లేదని ఎలా చెబుతున్నారని ప్రశ్నించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసుల జారీకి నిరాకరించింది. ఢిల్లీకి చెందిన అడ్వకేట్ మెహక్ మహేశ్వరి వేసిన పిల్‌పై విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 11కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జర్మనీలో శిక్షణతో కూడిన అప్రెంటీస్‌షిప్ ఉద్యోగాల కల్పన కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జివిడి.మురళీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐలో లాజిస్టిక్స్, మెకాట్రానిక్స్, ప్లంబింగ్, హెచ్‌విఎసి, బేకర్స్, ఫుడ్ ప్రోసెసింగ్, డెంటల్ అసిస్టెంట్ చేసిన వారికి అవకాశం ఉందన్నారు. skillinternational@ apssdc.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు కమాండ్ కంట్రోల్ నంబర్లు 9988853335, 8712655686, 8790118349, 8790117279 సంప్ర దించాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ వరకూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

అరెస్టు, రిమాండ్ చట్ట నిబంధనల మేరకు లేవు

- వైసిపి నేత కిషోర్ అరెస్టుపై హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి నాయకులు తురక కిషోర్ అరెస్టు, రిమాండ్ ఉత్తర్వులు చట్ట నిబంధనలకు అనుగుణంగా లేవని హైకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి కేసుల్లో అరెస్టయిన వాళ్ల జైల్లో ఉండటానికి వీల్లేదని, విడుదలకు ఆదేశాలిస్తామని చెప్పింది. ఒక కేసులో విడుదలైతే మరో కేసు పేరుతో పోలీసులు అరెస్టు చేస్తున్నారంటూ కిషోర్ భార్య తురక సురేఖ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ కొనసాగించింది. కిషోర్‌పై పలు హత్యాయత్నం కేసులు ఉన్నాయని ప్రభుత్వ ప్లీడర్ చెప్పడంపై స్పందిస్తూ, ఆరేళ్ల నాటి కేసులో ఇప్పుడు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించింది. అదే మాదిరిగా రెండేళ్లు, మూడేళ్ల నాటి వాటిపై ఇప్పుడు కేసులు పెట్టారని గుర్తించింది. కేసులు పెట్టడం సులభమేనని, చట్ట ప్రకారం కేసులు ఉండి తీరాలని తేల్చి చెప్పింది. కిషోర్‌పై ఉన్న కేసుకు సంబంధించిన రికార్డులు తమకు అందజేయాలని రెంటచింతల పోలీసులను ఆదేశించిన నేపథ్యంలో వాటిని ధర్మాసనం పరిశీలించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది.

కమిషనర్ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న నాయకులు

పొగాకు కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

పొగాకు కొనుగోళ్లపై ఆంక్షలు ఉపసంహరించుకొని, రైతుల వద్ద ఉన్న మొత్తం పంటను కొనుగోలు చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. పొగాకు రైతులను బలిచేయొద్దని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చివర కాడ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణమూర్తి, ఎం.హరిబాబు, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి, ఏరువాక రైతు కూలీ సంఘం నాయకులు పాడిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆగస్టు 20తో పొగాకు కొనుగోలు నిలిపివేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన విరమించుకోవాలని, చివరి కాడ వరకు కొనుగోలు చేస్తామని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 20 శాతం మాత్రమేనని తెలిపారు. మిగిలింది పూర్తిగా కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో పొగాకు రైతులు ఆందోళనకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినా రైతులకు రూ.12 వేల ధర రాలేదన్నారు. రైతులు విక్రయించిన పంట తాలూకా నగదు ఇంత వరకూ ఒక్క రూపాయి కూడా జమ కాలేదని తెలిపారు. వెంటనే పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తొలుత నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెటింగ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో నంద్యాల జిల్లా నాయకులు వెంకటేశ్వర గౌడ్, బాపట్ల జిల్లా రైతు నాయకులు బండి శంకరయ్య, బిక్కి శ్రీనివాసరావు, కొండయ్య, శ్రీకాంత్, బి.రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన కౌలురైతు నాలి శివ (28) తనకున్న మూడు ఎకరాల సొంత పొలంతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి, మిరప సాగు చేశారు. వాతావరణ అనుకూల పరిస్థితుల నేపథ్యంలో గత కొంతకాలంగా పంటలు చేతికందలేదు. సాగు కోసం సుమారు రూ.25 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులకు వడ్డీలకు భారం అధికమైంది. అప్పులు తీరే దారిలేక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - బొబ్బిలి

ఆన్‌లైన్ బెట్టింగ్ పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్యకు దారి తీసింది. విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణానికి చెందిన గుత్తి నరేష్ (38) భార్య కీర్తి, కుమార్తెతో కలిసి హైదరాబాద్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్ ప్రాంతంలో పోస్టల్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల రూ.9 లక్షల వరకు అప్పులపాలయ్యారు. అప్పులు తీర్చలేక భయాందోళన చెందిన నరేష్ మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. బెట్టింగ్ యాప్‌లను రద్దు చేయాలని సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు చెప్పారు.

బ్యాంకు చిరుద్యోగి ఆత్మహత్య

- అప్పులతో చనిపోతున్నట్టు సూసైడ్ నోట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న సెంట్రల్ బ్యాంకులో ఎస్.రవికుమార్(35) ఎప్పటిలాగానే బుధవారం ఉదయం 9.30 గంటలకు బ్యాంకుకు వచ్చాడు. 9.40 గంటల సమయంలో బ్యాంకులోని బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి బ్యాంకు సిబ్బంది తలుపులను పగులగొట్టి చూశారు. బాత్‌రూమ్‌లో వెంటిలేషన్‌కున్న ఇనుప చువ్వలకు తాడుతో ఉరివేసుకున్నట్టు గుర్తించి వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందించారు. త్రీటౌన్ సిఐ శాంతిలాల్ సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే రవికుమార్ చనిపోయినుట్ట గుర్తించారు.

అప్పుల బాధతోనే ఆత్మహత్య

రవికుమార్ సెంట్రల్ బ్యాంక్‌లో సబ్ స్టాఫ్ (అంటెడరు)గా 2013 నుంచి పనిచేస్తున్నాడు. ఈయన కుటుంబ అవసరాల కోసమని గుజ్జల రాముడు అనే వ్యక్తి వద్ద నుంచి రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. రూ.15 వేలు ముందు వడ్డీ కింద పట్టుకుని రూ.35 వేలు ఇచ్చారు. నెలకు రూ.15 వేలు వడ్డీ చొప్పున ఇప్పటికే రూ.1.25 లక్షలు కట్టినట్టు రవికుమార్ తన సూసైడ్ నోట్‌లో రాశాడు. ఇక తాను కట్టలేనని, తన వల్ల కావడం లేదని ఆ నోట్‌లో పేర్కొన్నాడు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు, భార్య హరితకు లేఖ రాశాడు. పిల్లలను బాగా చూసుకోవాలంటూ ఆ తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

As per the Gazette Notification Order S.O.2900 (E) dated 24th October 2015 issued by the Ministry of Agriculture and Farmer Welfare, Department of Agriculture, Cooperation and Farmers Welfare, New Delhi, this is to intimate / notify that M/s FERTIS INDIA PRIVATE LIMITED is intend to manufacture and Market the following grades of 100% Water Soluble Mixture of Fertilizers under the Brand Names as mentioned.

Sl.No	Brand Name	Nutrient Content % by Weight (Minimum)		
		Nitrogen as N	Phosphorous as P_2O_5	Potash as K_2O_5
1	Zetol Sure	0	35	35

General Specifications of 100% Water Soluble Mixture of Fertilizers % by weight, Maximum		
(i)	Moisture percent by weight, Maximum 0.5	0.5
(ii)	Total Chlorides, per cent by weight, Maximum 1.5	1.5
(iii)	Matter insoluble in water per cent by weight, Maximum 0.5	0.5
(iv)	Sodium as NaCl, per cent by weight, Maximum 0.5	0.5
(v)	Lead (as Pb) per cent by weight, Maximum 0.003	0.003
(vi)	Cadmium (as Cd) per cent by weight, maximum 0.0025	0.0025
(vii)	Arsenic (as As) per cent by weight, Maximum 0.01	0.01

Marketed by : **FERTIS INDIA PRIVATE LIMITED,** Regd Off : 6-3-668/10/56, Plot No. 56, First Floor, Durga Nagar Colony, Punjagutta, Hyderabad, Telangana, India 500082.
Email ID : marketing@fertis.in Phone No : 040-23412299
Manufactured by: FERTIS INDIA PRIVATE LIMITED, Sy No : 472,644,647,648A, 649B,650,651 &652, Gollagudem (V), Nandi Kandi, Sadasivapet (M), Sangareddy (D), Telangana - 502291

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK)
40-5-19/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజ్ బస్టాప్ దగ్గర, మొగల్‌రాజపురం, విజయవాడ, ఏపి-520010. ఫోన్: 0866-2474781. సెల్: 7625079119.
Email: vijaywada@canfinhomes.com. CIN:L85110KA1987LC008699

స్థిరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన
[Under Proviso to Rule 9(1) of Security Interest (Enforcement) Rules]
[illegible]
www.bankeauctionwizard.com
తేది: 06-08-2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశము: విజయవాడ కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

ఒరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్
ORIX
Tel.: + 91 22 2859 5093 / 6707 0100 | Fax: +91 22 2852 8549
Email: info@orixindia.com | www.orixindia.com | CIN: U74900MH2006PLC163937
స్వాధీనత ప్రకటన
[illegible]
తేది: 05.08.2025
ప్రదేశం: విజయవాడ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
చల్లపల్లి బ్రాంచి (00741)
పోలీస్ స్టేషన్ రోడ్డు, చల్లపల్లి, కృష్ణా జిల్లా, ఏపి - 521126
NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST
డిమాండ్ నోటీసు

లోన్ స్కీమ్	అవుట్ (రూ. లక్షల్లో)	బకాయి మొత్తం రూ.
Housing Loan A/c No: 007430100025662	Rs. 6.00	Rs. 2,20,880.07

[illegible]
తేది : 23-07-2025 అధీకృత ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com
రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE
[illegible]
తేది: 04.08.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
MANAPPURAM HOME FINANCE LTD.
డిమాండ్ నోటీసు

క్ర సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు/ఎల్ఎఎన్/శాఖ			
1	నాటకరాణి సరస్వతి, నాటకరాణి కొండయ్య/ MHL00310028721/ విజయవాడ	[illegible]	15-07-2025	17-07-2025 & Rs.376450/-
2	కోట నాగ లక్ష్మి, కోట రవి/ MHL00310034677/ విజయవాడ	[illegible]	15-07-2025	17-07-2025 & Rs.419943/-
3	బత్తుల కుమారి, బత్తుల ప్రసాద్/ MLAP0031034377/ విజయవాడ	[illegible]	15-07-2025	17-07-2025 & Rs.473444/-

[illegible]
తేది: 07.08.2025, ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
Chola Enter a better life
స్వాధీనతా ప్రకటన
((అనుబంధం-4)(రూల్ 8(1) క్రింద))
[illegible]
ప్రదేశం: కృష్ణా
తేది: 02.08.2025

31న చైనాకు ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో మోడీ పాల్గొననున్నారు. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో ప్రధాని ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోడీ భేటీ అయిన విషయం తెలిసిందే. తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన ప్రధాని మోడీ ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్–చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరగ్గా ఇటీవలే పురోగతి కనిపిస్తోంది.చైనాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన 'షాంఘై సహకార సంస్థ' సభ్యదేశాల రక్షణ మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కర దాడులను ప్రస్తావించక పోవడంపై తీవ్రంగా పరిగణించిన భారత్.. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించింది. దీంతో ఎలాంటి ఉమ్మడి ప్రకటన లేకుండానే నాటి చర్చలు ముగిశాయి. అనంతరం జులైలో జరిగిన విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొన్న సంగతి తెలిసిందే.

అటవీ భూమిని అదానీ నుండి కాపాడండి

కేంద్ర అటవీ శాఖ మంత్రికి బృందా కరత్ లేఖ

న్యూఢిల్లీ : చత్తీస్‌గఢ్ అటవీ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖమంత్రి భూపేందర్ యాదవ్‌కు మాజీ ఎంపి, సిపిఎం కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితురాలు బృందా కరత్ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఫలితంగా 1742 హెక్టార్ల దట్టమైన అటవీ భూమి విధ్వంసానికి గురవుతుందని ఆమె ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ విషయంలో జోక్యం చేసుకుని కెంటె బొగ్గు ప్రాజెక్టు విస్తరణ పనుల అమలును నిలిపివేయాలని ఆమె ఆ లేఖలో కోరారు. ఈ ఏడాది జూన్‌లో సుర్గుజా జిల్లా అటవీ శాఖాధికారి ఆ సైట్‌లో తనిఖీ జరిపిన తర్వాత చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుకు పచ్చజెండా వూపింది. హస్డియో–అరంద్ ప్రాంత బొగ్గు ప్రాజెక్టులో భాగమైన ఈ ప్రాజెక్టు నిర్వహణా భారాన్ని రాజస్థాన్ ప్రభుత్వ విద్యుత్ సంస్థకు అప్పగించారు. రాజస్థాన్ పూర్వపు ప్రభుత్వం అదానీ ఎంటర్‌ప్రైజెస్ అయిన పర్సా కెంటె కాలరీస్ లిమిటెడ్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ఇందులో అదానీకి 74శాతం వాటా వుంది. హస్డియో–పర్సా బొగ్గు ప్రాజెక్టుకు ఈ కంపెనీని ఆపరేటర్‌గా నియమించారు. రికార్డులను పరిశీలిస్తే ఈ వెంచర్ కింద గణనీయమైన మొత్తంలో బొగ్గు ప్రైవేటు కంపెనీకి చెందిన విద్యుత్ ప్రాజెక్టులకు మళ్లించబడుతోందని వెల్లడైంది. పైగా తిరస్కరించబడిన బొగ్గు అనే పేరుతో ఇదంతా సాగుతోంది. ప్రజా ప్రయోజనాల పేరుతో ఈ బొగ్గు ప్రాజెక్టును

చేపట్టి,అనుమతులు పొందినా నిజానికి అందులో ప్రజల ప్రయోజనాలకు సంబంధించి ఏమీ లేవని, అంతా ప్రైవేటు ప్రయోజనాలే అమలవుతున్నాయని, ఖనిజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని బృందాకరత్ లేఖ పేర్కొంది. ఈ ప్రాజెక్టును అమలు చేస్తే, ఇప్పటికే మైనింగ్ పేరుతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలు మరింత వినాశనానికి గురవుతాయని అన్నారు. అధికారిక తనిఖీల నివేదిక ప్రకారం, నాలుగున్నర లక్షల చెట్లను కొట్టేస్తున్నారు. ఇవన్నీ కూడా దట్టమైన అటవీ భాగంలోనే వున్నాయి. ఓపెన్‌కాస్ట్ మైనింగ్ వల్ల ఇప్పటికే ఈ ప్రాంతంలోని వేలాది చెట్లు ధ్వంసమయ్యాయి. జలాలు కలుషితమయ్యాయి. భూసారం దెబ్బతింది. పైగా గ్రామ సభల అభిప్రాయాలను పూర్తిగా విస్మరించి మరీ ఈ ప్రాజెక్టులను చేపడుతున్నారు. ఇలాంటి ప్రాజెక్టులకు గ్రామసభల ఆమోదం తప్పనిసరని రాజ్యాంగ, చట్ట నిబంధనలు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఓపెన్ కాస్ట్ మైనింగ్ వల్ల వాస్తవ ప్రాజెక్టును మించి చాలా పెద్ద మొత్తంలో భూభాగం ప్రభావితమవుతుంది. నిర్దిష్టమైన ఈ ప్రాంతంలో ప్రజల నివాసం లేనప్పటికీ ఈ ఏరియాకు వెలుపల అనేక గ్రామాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం వుంది. ఇప్పటికే స్థానిక కమ్యూనిటీలకు చెందిన 1500కి పైగా రాతపూర్వక అభ్యంతరాలు ప్రభుత్వానికి అందినా, వాటిని పట్టించుకోలేదని బృందా కరత్ తన లేఖలో పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో ఇలాంటి ప్రైవేట్ మైనింగ్ ప్రాజెక్టులు సాగిస్తున్న వినాశనం నుండి మన అడవులను రక్షించుకోవడానికి కఠినమైన రక్షణ చర్యలు అవసరమని బృందాకరత్ ఆ లేఖలో మంత్రికి స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలోని ఆదివాసీలు ఈ ప్రాజెక్టును తీవ్రంగా ప్రతిఘటించడం ద్వారా, చెట్లను కాపాడుకోవడానికి, తద్వారా ప్రకృతి నాశనం కాకుండా చూసేందుకు ప్రయత్నించేది వారేనని స్పష్టమైందని ఆ లేఖ పేర్కొంది. వారే దేశంలోని అడువులను నిజంగా కాపాడుకునేదని రుజువైందన్నారు.

కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా అడవులను కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మీపై వుందని ప్రైవేటు కంపెనీ ప్రయోజనాల కన్నా సుసంపన్నమైన జీవ వైవిధ్యమున్న ప్రాంతాన్ని నాశనం కాకుండా కాపాడుకోవడమనేది అత్యంత ముఖ్యమని గ్రహించాలని బృందా కరత్ ఆ లేఖలో పేర్కొన్నారు.

విశాఖలో వికలాంగుల క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

- కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌ను కోరిన టిడిపి ఎంపిలు

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నంలో ప్రతిపాదిత వికలాంగుల క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని టిడిపి ఎంపిలు కోరారు. బుధవారం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్‌ను టిడిపి ఎంపిలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్, ఎం. శ్రీ భరత్, టి. కృష్ణ ప్రసాద్ కలిసి వినతి అందించారు. ఈ కేంద్రం దక్షిణాదిలోని దివ్యాంగ క్రీడాకారుల సమ్మిళిత అభివృద్ధి, క్రీడా సాధికారతకు గొప్ప ప్రోత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. ఇప్పటికే విశాఖపట్నం గ్రామీణ మండలం, బక్కన్నపాలెం గ్రామంలో గుర్తించిన 22.64 ఎకరాల స్థలాన్ని ఆమోదించాలని విన్నవించారు. దక్షిణాదిలోని దివ్యాంగులైన అథ్లెట్లకు సాధికారత కల్పించడానికి, కేంద్రాన్ని స్థాపించడానికి అవసరమైన మిగిలిన చర్యలను త్వరగా ముందుకు తీసుకెళ్లడానికి క్రీడా ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి మద్దతును కోరారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ .. మావోయిస్ట్ మృతి

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో రక్తపాతం కొనసాగుతోంది. బీజాపూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మరణించినట్లు అధికారులు తెలిపారు. బీజాపూర్ జిల్లాలోని పశ్చిమ అటవీ ప్రాంతంలో భద్రతా దళాల ఉమ్మడి బృందం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ చేపడుతుండగా కాల్పులు జరిగినట్లు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బస్తర్ రేంజ్) పి.సుందరాజ్ తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుండి మరణించిన మావోయిస్టు మృతదేహాన్ని, ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. కాగా, తాజా ఎన్‌కౌంటర్‌తో, ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటి వరకు 227మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో ఎక్కువ మంది బస్తర్ డివిజన్‌కు చెందినవారు.

కేరళపై కేంద్రం చిన్నచూపు

- పన్నుల్లో పడిపోయిన రాష్ట్రం వాటా
- 2.5 శాతం నుంచి 1.925 శాతానికి తగ్గుదల

న్యూఢిల్లీ : మానవాభివృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలుస్తున్న కేరళ రాష్ట్రంపై కేంద్రం చిన్నచూపు చూస్తోంది. కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటా గణనీయంగా పడిపోతోంది. రాజ్యసభలో సిపిఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు అందుతున్న వాటాపై బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానం లభించలేదు. కేంద్ర ప్రభుత్వం డొంకతి రుగుడు వివరణలతో సరిపెట్టే ప్రయత్నం చేసింది.

సమ్మిళిత అభివృద్ధిలో మోడల్‌గా నిలుస్తున్నా...

1971లో దేశ జనాభాలో కేరళ వాటా 3.89 శాతం. పదవ ఆర్థిక సంఘం కాలంలో రాష్ట్రానికి 3.87 శాతం పన్ను వాటా వచ్చింది. అంటే జనాభాకు అనుగుణంగానే కేంద్ర పన్నుల్లో వాటా లభించిందన్న మాట. అయితే 14వ ఆర్థిక సంఘం కాలానికి వచ్చే సరికి ఈ వాటా 2.5 శాతానికి పడిపోయింది. 15వ ఆర్థిక సంఘం కాలంలో అది మరింత తగ్గి 1.925 శాతానికి చేరింది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో రాష్ట్ర వాటా 2.75 శాతంగా ఉన్నప్పటికీ పన్నుల్లో ఆ మేరకు రాబడి కన్పించడం లేదు. జనసంఖ్యను అలా ఉంచినా ఆరోగ్యం, విద్య, సామాజిక సంక్షేమం, జనాభా నియంత్రణ వంటి రంగాల్లో సమ్మిళిత అభివృద్ధికి కేరళ ఓ మోడల్‌గా నిలుస్తోంది. అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తున్న కేరళను గుర్తించడం, అందుకు తగిన ప్రతిఫలాన్ని అందించడం మాట అటుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నచూపు చూస్తున్నారు. మద్దతు ఇవ్వాల్సింది పోయి శిక్షిస్తున్నారు.

రాజకీయ కోణంతోనే చిన్నచూపు

ఇందులో రాజకీయ కోణం కూడా ఉంది. వామపక్ష కూటమి పాలనలో ఉన్న కేరళను నిధులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో పాటు కేంద్రంతో రాజకీయంగా సత్సంబంధాలు నెరపుతున్న బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు నిధులు పెంచుతున్నారు. ఈ రాష్ట్రాలన్నింటికీ 15వ ఆర్థిక సంఘం కింద కేంద్ర పన్నుల్లో ఎక్కువ వాటా లభించింది. ఈ వివక్షను ఆర్థిక మంత్రిత్వ శాఖ సమర్ధించుకోలేకపోతోంది. ఇది కేవలం సాంకేతిక సర్దుబాటు కాదు. కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యానికి ఉదాహరణ. తన విధానాలకు అంగీకరించని, అమలు చేయని కేరళను నిధులలో సరైన వాటా ఇవ్వకుండా కేంద్రం శిక్షిస్తోంది. జనాభా నియంత్రణలో విజయం సాధించిన కేరళ వంటి రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనిస్తుంటే ఓర్వలేని కేంద్రం వాటిని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇది విధానపరమైన వైఫల్యం కాదు. ఆర్థిక వివక్ష. అభివృద్ధితో విజయాలు సాధిస్తున్న రాష్ట్రాల కంటే తనకు రాజకీయంగా ఉపయోగపడుతున్న రాష్ట్రాలకే కేంద్రం ప్రాధాన్యత ఇస్తోంది. కోవిడ్, నిఫా వంటి సంక్షోభాలను సమర్ధవంతంగా ఎదుర్కొని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న కేరళ రాష్ట్రం ఇప్పుడు తీవ్ర ఒత్తిడిని చవిచూస్తోంది. దానికి ప్రకృతి వైపరీత్యాలు కారణం కావు. కేంద్రం ఉద్దేశపూర్వకంగా చిన్నచూపు చూడడమే దీనికి కారణం. పరిపాలన విషయంలో ప్రపంచ వేదికలపై కేరళను ప్రశంసలతో ముంచెత్తుతున్న కేంద్ర ప్రభుత్వం దేశీయంగా దానికి మద్దతు ఇవ్వడంలో విఫలమవుతోంది. ఫలితాలు అందిస్తున్న రాష్ట్రాల పట్ల అలసత్వం ప్రదర్శిస్తూ, మానవాభివృద్ధిలో బలహీనంగా ఉన్న రాష్ట్రాలకు ఎందుకు ప్రాధాన్యత ఇస్తున్నారో వివరించేందుకు కేంద్రం నిరాకరిస్తోంది.

ఎస్ఐఆర్‌పై చర్చించాలి

- పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఆందోళన

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై చర్చించాలనే డిమాండ్‌తో ప్రతిపక్షాల ఆందోళనతో బుధవారం కూడా పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పర్వం పట్టాయి. బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్లకార్డు పట్టుకుని నినాదాల హోరెత్తించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. ఈ గందరగోళ పరిస్థితుల్లోనే ఎటువంటి చర్చ లేకుండా మర్చంట్ షిప్పింగ్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. ఇటు రాజ్యసభలోనే ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ తొలిత మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడగా, తిరిగి ప్రారంభమైన సభలోనూ ఆందోళన కొనసాగడంతో ఏకంగా గురువారానికి వాయిదా పడింది.

పార్లమెంట్ ఆవరణంలో ప్రతిపక్షాలు ఆందోళన

బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కి వ్యతిరేకంగా పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాలు బుధవారం ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని మోడీ ప్రభుత్వానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాధీ, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, డిఎంకె ఎంపి కనిమొళి ఇతర ప్రతిపక్ష ఎంపిలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మళ్లీ సభ వాయిదా పడిన తరువాత కూడా ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి.

పార్లమెంట్‌లో బీహార్ ఎస్ఐఆర్‌పై చర్చించలేం: మంత్రి రిజిజు

పార్లమెంట్‌లో బీహార్ ఎస్ఐఆర్‌పై చర్చించలేమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. లోక్‌సభలో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ అంశంపై పార్లమెంట్‌లో చర్చించడం అంటే, అన్ని నియమాలను ఉల్లంఘించినట్లు అవుతుందని ఆయన అన్నారు. సభ సజావుగా సాగేందుకు ప్రతిపక్ష ఎంపిలు సహకరించాలని ఆయన కోరారు. మనం చర్చించడం కోసం చాలా ముఖ్యమైన విషయాలు ఉన్నాయని, జాతీయ క్రీడా విధాన్ని తామేమీ ప్రవేశపెట్టడంలేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అనేది వ్యక్తిగత వ్యవస్థ అని, సుప్రీంకోర్టులో ఆ కేసు ఉందని, ఆ అంశాలను పార్లమెంట్‌లో చర్చించలేమని మంత్రి రిజిజు అన్నారు.

ప్రభుత్వం అంత బలహీనంగా మారిందా? : ప్రియాంక గాంధీ

బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై మాట్లాడిన కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ ప్రభుత్వం జవాబుదారీతనం నుండి తప్పించుకుంటుందని ఆరోపించారు. చర్చను నిర్వహించడానికి అధికార పార్టీ విముఖత వ్యక్తం చేయడం దారుణమన్నారు. ప్రతిపక్షం చర్చ కోసం మాత్రమే

అడుగుతోందని, ప్రభుత్వం కోరుకుంటే ఈ సమస్యను పరిష్కరించవచ్చని అన్నారు. "వారు అంత బలహీనంగా మారారా? వారు పార్లమెంటును నడపలేకపోతున్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించలేకపోతున్నారు" అని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం కోసం ఎన్నికల సంస్కరణలపై చర్చించే ప్రాముఖ్యతను డిఎంకె ఎంపి కనిమొళి స్పష్టం చేశారు. ప్రభుత్వం దానిని అనుమతించకపోవడాన్ని విచారకరమని అన్నారు.

మేము చర్చ జరపాలని కోరుతున్నా : ఖర్గే

రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై చర్చ జరగాలని మేము కోరుతున్నాం. ప్రతి ఒక్కరూ స్పీకర్, చైర్మన్, ప్రభుత్వాన్ని చాలా ప్రశాంతంగా అడుగుతూనే ఉన్నారు. మా ఓట్లు దొంగిలించబడకూడదు. ఓటర్ల జాబితాలోని అవకతవకలు, ఓట్ల దొంగతనం గురించి చర్చించడానికి మాకు సమయం కావాలని కోరుతున్నాం. పూర్తి చర్చ జరిగితే వారు ఎక్కడ తప్పులు చేసినా, రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో ఏమి చేసినా సమాధానం, సూచనలు ఇవ్వగలం. ముఖ్యంగా తమ హక్కులను కోల్పోతున్న ఓటర్లను మనం రక్షించగలం' అని అన్నారు.

వేతనం పెంచాలి, గ్రాట్యూటీ, పెన్షన్ ఇవ్వాలి

- కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవికి ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ ప్రతినిధి బృందం వినతి

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ, పెన్షన్ ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ ఉపసంహరించుకోవాలని ఆలిండియా అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ (ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్) డిమాండ్ చేసింది. బుధవారం నాడిక్కడ కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవిని ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ ప్రతినిధి బృంద కలిసి వినతి అందజేసింది. బృందం ఇచ్చిన వినతిపై స్పందించిన కేంద్ర మంత్రి ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. గ్రాట్యూటీపై సుప్రీం కోర్టు ఉత్తర్వును ప్రభుత్వం చేస్తుందని, వేతనాల పెంపును పరిశీలిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. అయితే ఎఫ్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఆగస్టు 21న బ్లాక్ డేను నిర్వహిస్తామని ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ స్పష్టం చేసింది. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ ప్రధాన కార్యదర్శి ఎఆర్.సింధూ, కోశాధికారి అంజు మైనీ, కార్యదర్శి ఊర్మిళ రావత్, సభ్యులు అమృత్‌పాల్ కౌర్, రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ ఉన్నారు. కేంద్ర శిశు అభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి జ్ఞానేష్ భారతి కూడా ఈ సమావేశంలో హాజరయ్యారు.అనంతరం ఎఆర్ సింధూ మాట్లాడుతూ పార్లమెంటరీ కమిటీ సిఫార్సు ప్రకారం 2025 అక్టోబర్ 2 నాటికి వేతనాన్ని రెట్టింపు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. వేతనాలకు వార్షిక ఇంక్రిమెంట్, సర్వీస్ వెయిటేజీ గురించి కూడా కోరామన్నారు. చాలా రాష్ట్రాల్లో అంగన్‌వాడీ సహాయకులు కార్మికుల వేతనంలో సగం మాత్రమే పొందుతున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

రష్యా నుండి దిగుమతుల గురించి తెలియదు : ట్రంప్

వాషింగ్టన్ : రష్యా నుండి అమెరికా ఎరువులు, రసాయనాలు దిగుమతి చేసుకుంటున్న విషయం తనకు తెలియదని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో రష్యా నుండి ఎరువులు, రసాయనాల దిగుమతిపై విలేకరుల అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. "నాకు దాని గురించి ఏమీ తెలియదు. నేను విచారణ చేస్తాను" అని అన్నారు. అమెరికా తన అణుపరిశ్రమ కోసం యురేనియం హెక్సాఫ్లోరైడ్‌ను, ఎరువులు, ఇతర రసాయనాలను రష్యా నుంచి దిగుమతి చేసుకుంటుందని భారత్ వెల్లడించిన సంగతి తెలిసిందే. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై సుంకాలను గణనీయంగా పెంచుతామని ట్రంప్ ప్రకటించిన తరువాత భారత్ ఈ విషయాన్ని తెలిపింది. 'భారత్ రష్యన్ చమురును భారీ మొత్తంలో కొనుగోలు చేయడమే కాకుండా, కొనుగోలు చేసిన చమురులో అధిక భాగాన్ని బహిరంగ మార్కెట్‌లో అధిక లాభాలకు విక్రయిస్తోంది. రష్యాన్ యుద్ధం వలన ఉక్రెయిన్‌లో ఎంతమంది చనిపోతున్నారనే విషయాన్ని వారు పట్టించుకోవడం లేదు. ఈ కారణంగా భారత్ అమెరికాకు చెల్లించే సుంకాన్ని నేను గణనీయంగా పెంచుతున్నాను. ఈ విషయం మీ శ్రద్ధకు ధన్యవాదాలు' అని ట్రంప్ సోషల్‌మీడియా ట్రూత్‌లో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కు వద్దే.. వద్దు

- ప్రజాభిప్రాయ సేకరణలో ముక్తకంఠంతో వ్యతిరేకించిన ప్రజలు
- కె.లోకనాథం అరెస్టు, పలువురు గృహ నిర్బంధం

ప్రజాశక్తి – నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

తమ ప్రాంతంలో ప్రమాదభరిత బల్క్ డ్రగ్ పార్క్ వద్దే వద్దని అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలానికి చెందిన ప్రజలు ముక్తకంఠంతో తేల్చిచెప్పారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు కోసం అనకాపల్లి జిల్లా నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం పర్యావరణ ప్రభావంపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది.. ఈ కార్యక్రమానికి ముందే బల్క్‌డ్రగ్ పార్కును వ్యతిరేకించే వారిపై పెద్ద ఎత్తున నిర్బంధం అమలు చేశారు. వారిని ముందుగానే గుర్తించి కార్యక్రమానికి రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావును, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును, నక్కపల్లి మండల కార్యదర్శి రాజేష్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. నిర్బంధాలను అధిగమించి తహసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్న సిపిఎం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథంను వేదిక వద్దకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఆయన్ని ఈడ్చుకుంటూ వెళ్లి వ్యాన్ ఎక్కించారు. అక్కడి నుంచి ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా మత్స్యకారులు, నిర్వాసితులు ఆ వ్యాన్‌ను అడ్డగించారు. తమ గళం వినిపించే నేతను ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులు వారిని నెట్టేసి లోకనాథంను అరెస్టు చేసి ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. సాయంత్రం విడిచిపెట్టారు. అంతకుముందు ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన పెదతీనార్ల, ఉపమాక, సిహెచ్‌ఎల్.పురం, ఎన్.నరసాపురం, రాజయ్యపేట, ఎస్.రాయవరం మండలంలోని గుడివాడ గ్రామాలకు చెందిన ప్రజలు మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్కును పూర్తిగా వ్యతిరేకించారు. కంపెనీలు ఏర్పాటు చేసిన తరువాత స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించరని చెబుతూ హెటిరో డ్రగ్స్, డెక్కన్ కెమికల్ పరిశ్రమలను అందుకు ఉదాహరణగా తెలిపారు. తమ అభిప్రాయాన్ని కాదని ముందుకెళ్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో హెటిరో కంపెనీ కాలుష్యం వల్ల నూటికి 40 శాతం మంది కేన్సర్ వ్యాధితో బాధపడి మృతి చెందుతున్నారని ఆ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ వ్యర్థాలను సముద్రంలో వదలడం వల్ల మత్స్య సంపద నశించిపోయి ఉపాధి కోల్పోతున్నామని మత్స్యకారులు ఆవేదన వెలిబుచ్చారు నర్సీపట్నం ఆర్‌డిఒ, ఆర్ అండ్‌ఆర్ అధికారి వివి.రమణ, జెడ్‌ఒ టి.సుదర్శనం, ఇఇఆర్‌ఒ ముకుందరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, తహశీల్దార్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది.

తీవ్ర నష్టం: లోకనాథం

పోలీసులు విడుదల చేసిన అనంతరం లోకనాథం మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్కుతో నక్కపల్లి ప్రాంతానికి నష్టం జరుగుతుందన్నారు. ఈ పార్కుకు 1270 ఎకరాల భూములకు తీసుకుంటున్నారని, 470 ఎకరాలకు మాత్రమే నష్టపరిహారమిచ్చి మిగిలిన వాటికి ఏ విధమైన నష్టపరిహారమూ చెల్లించకుండా ముందుకెళ్లడం దుర్మార్గమన్నారు.

సిపిఎం ఖండన

నక్కపల్లి బల్క్‌డ్రగ్ ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం, జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావుతోపాటు మరికొంతమంది నాయకులను అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఖండించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం రాజేష్‌ను మంగళవారం నుంచి గృహ నిర్బంధంలో ఉంచారని పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిని ఎక్కడెక్కడో తిప్పుతు న్నారని అన్నారు. ప్రజల అభిప్రాయాలు కాదని ప్రైవేటుకు లబ్ధి కలిగించేందుకు బలవంతపు భూసేకరణ చేపట్టడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఇఎఐ నివేదికలోనూ ప్రజలను మోసగించేందుకు అనేక అబద్ధాలు పొందు పర్చారని వివరించారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నందున బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు.

సుప్రీంకోర్టులో డిఎంకె ప్రభుత్వానికి భారీ ఉపశమనం

- 'ఉంగలుదన్ స్టాలిన్'పై పిటిషన్ కొట్టివేత
- అన్నాడిఎంకె ఎంపి షణ్ముగంకు రూ.10 లక్షల జరిమానా

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టులో తమిళనాడులోని డిఎంకె ప్రభుత్వానికి భారీ ఉపశమనం లభించింది. సంక్షేమ పథకాల్లో ముఖ్యమంత్రుల పేర్లు, ఫొటోలు ఉపయోగించే విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ అంశంపై గతంలో మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చింది. ఈ పిటిషన్ వేసిన అన్నాడిఎంకె ఎంపి షణ్ముగంకు రూ. 10 లక్షల జరిమానా విధించింది. ఈ కేసు వివరాల ప్రకారం తమిళనాడు ప్రభుత్వం 'ఉగలుదన్ స్టాలిన్' (మీతోనే స్టాలిన్) అనే పేరుతో నిర్వహిస్తోన్న ప్రచార కార్యక్రమంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ఇందులోభాగంగా అన్నాడిఎంకె నాయకుడు, రాజ్యసభ సభ్యుడు సివి షణ్ముగం దీనిపై మద్రాసు హైకోర్టులో పిల్ వేశారు. దీనిని విచారించిన హైకోర్టు షణ్ముగంకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో మద్రాసు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది. మద్రాసు హైకోర్టులో వ్యాజ్యం వేసిన పిటిషనర్‌పై అసహనం వ్యక్తంచేసింది. 'పలు ప్రభుత్వ పథకాలకు ప్రధాని, రాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తుల ఫొటోలు ఉపయోగించుకోవచ్చని సుప్రీం గతంలో అనుమతినిచ్చింది. దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. మీ రాజకీయ పోరాటాల కోసం కోర్టులను వేదికలు చేసుకోవద్దు" అని ధర్మాసనం స్పష్టంచేసింది.

స్మార్ట్ మీటర్ల కోసం అప్పులు

(మొదటిపేజీ తరువాయి)

ఈ నెల 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమలు కానుందని, ఈ పథకానికి 'స్త్రీ శక్తి'గా నామకరణం చేశామని చెప్పారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే అనుమతి ఉంటుందని, ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను చూపించాలని వెల్లడించారు. మద్యం దుకాణాల్లో పర్మిట్ రూమ్స్‌కు అనుమతి ఇస్తున్నామని చెప్పారు. పర్మిట్ లైసెన్స్ ఫీజు కింద రూ.5 నుంచి 7.5లక్షలు వసూలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దీనివల్ల రూ.256కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనల ఆధారంగా ఎక్సైజ్ శాఖ రూపొందించిన బార్ పాలసీ–2025–28కి ఆమోదం చెప్పామన్నారు. అదేవిధంగా బార్లు తెరిచే సమయాన్ని కూడా రాత్రి అదనంగా గంట పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. హెయిర్ కటింగ్ సెలూన్లకు అందించే ఉచిత విద్యుత్‌ను 150 నుంచి 200 యూనిట్ల వరకు పెంచామని చెప్పారు. పాఠశాల, ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ పేరుతోవైసిపి ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖలో విడుదల చేసి జిఓ 117కు బదులుగా కూటమి ప్రభుత్వం విడుదల చేసిన 19,20,21, 33 జిఓలకు ఆమోదం తెలిపామని తెలిపారు. మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ అందించేందుకు గతంలో విడుదల చేసిన జిఓ 38 స్థానంలో కొత్త మార్గదర్శకాలు రూపొందించామని చెప్పారు.

ట్రంప్ మరో బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

నుండి భారత చమురు దిగుమతులను లక్ష్యంగా చేసుకుంది. మా దిగుమతులు మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. 140 కోట్ల భారతీయుల ఇంధన భద్రతను దృష్టిలో పెట్టుకుని కొనుగోళ్లు జరుగుతాయి. అమెరికా భారత్‌పై అదనపు సుంకాలు విధించడం దురదృష్టకరం' అని విదేశంగ శాఖ పేర్కొంది.

ఎగుమతులు 30 శాతం పతనమే..! : జిఆర్‌టిఐ

అమెరికా టారిఫ్‌లు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం మోపనున్నాయని న్యూఢిల్లీలోని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. అధిక టారిఫ్‌ల వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26లో అమెరికాకు భారతీయ వస్తువుల ఎగుమతులు 30 శాతం పతనంకావొచ్చని అంచనా వేశారు. 86.5 బిలియన్ నుండి అమాంతం 60.6 బిలియన్ డాలర్లకు ఎగుమతులు పడిపోవచ్చని అంచనా వేశారు.

బీహార్‌లో కుల దురహంకార హత్య

- మామను చితగ్గొట్టిన విద్యార్థులు

పాట్నా : బీహార్‌లో కుల దురహంకార హత్య కలకలం సృష్టించింది. రాష్ట్రంలోని దర్భాంగా మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ (డిఎంసిహెచ్)లో నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న రాహుల్ కుమార్(25)ను అతని మామ కాల్చి చంపాడు. ఈ సంఘటన వివరాల ప్రకారం..సుసాల్‌కి చెందిన రాహుల్, ప్రేమ్ శంకర్ ఝా అనే వ్యక్తి కుమార్తె గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కులాంతర వివాహం చేసుకున్నారు. ఝా ఈ వివాహాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. మంగళవారం సాయంత్రం కాలేజీ ప్రాంగణంలో రాహుల్‌ను పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపాడు.

ఆగ్రహించిన తోటి విద్యార్థులు ఝాను చితగ్గొట్టారు. ఆస్పత్రి గేటును కూడా దిగ్బంధించారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థులను అడ్డుకుని, ఝాను ఆస్పత్రిలో చేర్చారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో.. పాట్నాలోని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. రాహుల్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని అన్నారు.

వైసిపి ఎమ్మెల్సీపై టిడిపి కార్యకర్తల దాడి

(మొదటిపేజీ తరువాయి)

రామలింగారెడ్డిపై దాడి చేసి గాయపరిచారు. టిడిపి కార్యకర్తలే ఈ దాడులు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎంఎల్‌సి ఎస్కార్టు వాహనం అద్దాలు ధ్వసం అయ్యాయి. ఈ ఘటనలపై. గాయపడిన ఎమ్మెల్సీని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.

ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం : డిఐజి

జడ్‌పిటిసి ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని కర్నూల్ డిఐజి కోయా ప్రవీణ్ తెలిపారు. పులివెందులలోని డిఎస్‌పి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ప్రచారం నిర్ణయించిన ప్రాంతాల్లోనే చేసుకోవాలని ఇరు పార్టీల నాయకులకు సూచించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం కోసం రౌడీషీటర్‌లను, ట్రబుల్ మెన్స్‌లను గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సబ్ డివిజన్, జిల్లా నుంచి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరం వరదల్లో మునిగిపోయాయని తెలిపారు. దశలు, కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గ్రామాలకు వరద పోటెత్తిందని, ఈ వాస్తవాలన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గమనంలోకి తీసుకోలేదని వివరించారు. ఆర్‌అండ్‌ఆర్‌కు ప్యాకేజీ నిధులు కేంద్రం పూర్తిగా మంజూరు చేసేలా చూడాలని కోరారు. ఈ సంవత్సరం మరలా వరదలొచ్చే అవకాశం ఉందని, ముంపు గ్రామాలకు వెంటనే నిత్యావసర వస్తువులు సరఫరా చేసేందుకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కోరారు.

ప్రత్యేక సెల్ ఏర్పాటుకు మంత్రి హామీ

సిపిఎం ప్రతినిధి బృందం వినతికి స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అక్కడ నుండే కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యలపై అడిగి వివరాలు తెలుసుకున్నారు. నివాసిత ప్రాంతాల్లో అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇదే సమయంలో పలువురు ముంపు ప్రాంత బాధితులు వారు పడుతున్న ఇబ్బందులను మంత్రి నిమ్మల రామానాయుడుకు నేరుగా వివరించారు. మంచినీటి కోసం 11 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని, కొన్ని సమయాల్లో తాగేందుకు నీరు కూడా ఉండటం లేదని పేర్కొన్నారు. నిర్వాసితుల గుర్తింపు విషయంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం వాణిశ్రీ, వెలేరుపాడు సిపిఎం మండల కార్యదర్శి డి రమేష్, కుక్కునూరు సిపిఎం మండల కార్యదర్శి వై నాగేంద్ర, నిర్వాసితులు నడిపూడి వెంకట్, వెంకటరెడ్డి, కారం కామరాజుదొర, కారపు సుభాషిణి, శివరామకృష్ణ, వీరభద్రరెడ్డి ఉన్నారు.

రాఖీ బహుమతి

కొత్త గౌను కట్టావు
ముస్తాబు అయ్యావు
చెల్లెమ్మ చెల్లెమ్మా
ఏమిటమ్మా విశేషం?

అన్నయ్య అన్నయ్యా
నీకు తెలియలేదా?
ఈరోజు మనకెంతో
ప్రత్యేకం కదయ్యా!

సంక్రాంతి, ఉగాది
గడిచిపోయినాయి
దసరా, దీపావళి
ఇప్పుడే కాదమ్మా
ఇంకేమిటి ప్రత్యేకత
చెప్పవే చిట్టెమ్మా?

ఇదిగిదిగో మిఠాయి
ఆరగించు అన్నయ్య
కళ్ళు మూసుకోవయ్యా
చేయి చాచవయ్యా!

కళ్ళు మూసుకున్నాను
చేయి చాచి నిలుచున్న
చెప్పమ్మా చెల్లెమ్మా
ఏమిటమ్మా విశేషం?

నీకు నేను రక్ష
నాకు నువ్వు రక్ష
ఈ రక్షాబంధను
ఇరువురికీ రక్ష
అని పాట పాడింది
రాఖీని కట్టింది

నీ చేతికి కట్టాను
అందమైన రాఖీ
బదులుగా ఇవ్వాలి
నాకు ఒక బహుమతి!

నాకు తెలుసు చెల్లెమ్మ
రాఖీ పండగ సంగతి
నీ గదిలో పెట్టాను
గదిలోన అట్టపెట్ట
నువ్వు మెచ్చే బహుమతి!

ఆ మాట వినగానే
చెల్లెమ్మ మురిసింది
బహుమతి కోసం
పరిగెత్తుకు పోయింది.

అందులోన ఆటబొమ్మ
బొమ్మ బయటకి తీసింది
గుండెలకు హత్తుకుంది
అన్నకు ఒక ముద్దు ఇచ్చి
ఆటల్లో మునిగింది!

- పేట యుగంధర్,
వెదురుకుప్పం,
94925 71731



జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని చేప బొమ్మలు ఇచ్చాం. అయితే అవి రెండు భాగాలుగా చీలిపోయి ఉన్నాయి. మీరు జత చేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

వై.వికసిత్,
1వ తరగతి,
శ్రీ పాటిబండ్ల సీతా రామయ్య హై స్కూలు,
గుంటూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే శ్రేష్ఠం ...

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన కొవ్వులు, పిండి పదార్థాలు, ప్రొటీన్లు, విటమిన్ల వంటి పోషకాలన్నీ తల్లిపాలలో సమతూకంలో ఉంటాయి. కాన్పు తర్వాత మొదటి రెండు, మూడు రోజుల్లో వచ్చే ముర్రుపాలు చాలా ముఖ్యమైనవి. భావి ఆరోగ్యానికి తొలి బీజం వేసేవి ఇవే. ఇవి ఒక రకంగా తొలి టీకా లాంటివి. ఇందులో ఉండే ఇమ్యునోగ్లోబులిన్లు బిడ్డ రోగనిరోధక శక్తి పెంపొందటానికి తోడ్పడతాయి. ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడతాయి. ఐదారు రోజులకు పాలు కాస్త పలుచబడినప్పటికీ వాటిలో కొవ్వులు, లాక్టోజ్ బాగా ఉంటాయి. అవి బిడ్డకు మరింత శక్తినిస్తాయి. రెండు వారాల తర్వాత తల్లిపాలలో 90 శాతం నీరు., 8 శాతం పిండి పదార్థాలు, కొవ్వులు, ప్రొటీన్లు.. 2 శాతం ఖనిజాలు, విటమిన్లు ఉంటాయి. ఇలా బిడ్డ అవసరాలకు అనుగుణంగా మారిపోయే తల్లిపాలను మించిన ఆహారం మరొకటి ఉండదు.



పిల్లలకు కనీసం ఆరు నెలల పాటు కచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలని అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిపుణులు సిఫార్సు చేస్తోంది. ఈ విషయంలో గతంతో పోలిస్తే..మహిళల్లో అవగాహన పెరగడం మంచి పరిణామం. జాతి వైరం మరిచి కొన్ని జంతువులు ఇతర జీవుల పిల్లలకు సైతం పాలు ఇస్తుండటం అనేక సార్లు చూసే ఉంటాం.. కానీ కన్న బిడ్డలకు పాలు ఇవ్వడానికి అందం, శరీర ఆకృతి పాడవుతుందని అడ్డుచెప్పే మహిళలు వాటిని చూసైనా మారాలని ఆశిద్దాం. ఆరోగ్యకరమైన మానవ భవిష్యత్ నిర్మాణానికి పునాది రాయి తల్లిపాలేనని గ్రహించాలి.

శిశువులకు తప్పనిసరి..

తల్లి పాలు.. ఇన్ఫెక్షన్లు, డయేరియా, శ్వాసకోశ వ్యాధులు, వాంతులు వంటి సమస్యలు రాకుండా శిశువును కాపాడుతాయి. తల్లికి బ్రెస్ట్ కాన్సర్, అండాశయ క్యాన్సర్లు వంటివి రాకుండా ఉంటాయి. శిశువులకు ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి. ఈ పాలలో ప్రోటీన్లు, విటమిన్లు, అధికంగా ఉండి, రోగ నిరోధక శక్తిని కల్గి ఉంటాయి. దీనితో బిడ్డ ఆరోగ్య కరమైన బరువుతో పెరగటానికి తోడ్పడుతుంది. ఈ పాలు తేలికగా జీర్ణం అవుతాయి. తల్లి పాలు పట్టడం వల్ల తల్లి మానసిక వత్తిడికి దూరం అవుతారు. తల్లిపాల ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసు కోవాలి. తమ బిడ్డలకు ఆరోగ్యకరమైన పాలు ఇవ్వాలి.

అపోహలు వద్దు

తల్లిపాల విషయంలో ఎటువంటి అపోహలకు తావు లేదు. శిశువులకు ఎప్పుడు ఏది అవసరమో ఆ అవసరం తీర్చగలిగేది తల్లి మాత్రమే. ప్రకృతిలో ప్రతి జీవికి ఉన్న సహజ సిద్ధ ఏర్పాటు ఇది. అందువల్ల తల్లి పాలు చిన్నారులకు పట్టే విషయంలో మరో ఆలోచన అనవసరం. సాధారణంగా పిల్లలు పాలు తాగే సమయంలో కొంతగాలి కూడా మింగుతుంటారు. పిల్లలు ఏడుస్తున్నారని..వారిని లాలించడానికి కొందరు పిల్లలను ఊపుతూ పాలు పడుతుంటారు. వీటి వల్ల తాగిన పాలు బయటకి వస్తాయి. వైద్య పరిభాషలో దీనిని 'పొసెట్టింగ్' అంటారు. దీనిని వాంతిగా పరిగణించరాదు. సహజంగా జరిగే ఈ చర్యకు ఎలాంటి మందులు వాడాల్సిన అవసరం లేదు. తల్లిపాలు పట్టిన తర్వాత భుజంపై పడుకోబెట్టుకుని, శిశువు వీపుపై తరచుగా చేతితో తట్టాలి. ఇందువల్ల మింగిన గాలి బయటకు వస్తుంది. అలాగే పాలు పట్టిన తర్వాత శిశువులను ఎక్కువగా కదిలించరాదు. చిన్నారుల్లో ఏడుపునకు అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో ఆకలి కూడా ఒకటి. తల్లిపాలు తాగే పిల్లలు.. రోజుకు ఆరు సార్లు మించి మూత్రవిసర్జన చేస్తుంటే, సంతృప్తికరమైన పెరుగుదల ఉంటే చిన్నారులకు తల్లిపాలు సరి పోయినట్లే.

- డాక్టర్ టి. సాయి ప్రసన్న
వైద్యాధికారి,
తోట్ల వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కృష్ణాజిల్లా.

ముర్రుపాలు ఎంతోమేలు

తల్లి పాల ఆవశ్యకతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్) ప్రతి బిడ్డకు తల్లిపాలు పట్టాలని సూచిస్తున్నాయి. శిశువు పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని, కనీసం ఆరు నెలల పాటు కొనసాగించాలని సిఫార్సు చేశాయి. అయితే బిడ్డ పూర్తిగా అభివృద్ధి చెందాలంటే కనీసం రెండు సంవత్సరాలు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని చెబుతున్నాయి. తల్లి పాలు.. పిల్లలకు మాత్రమే కాదు తల్లులకు కూడా ఆరోగ్యమే. తల్లి పాలు సమృద్ధి కరమైన, అనేక పోషక విలువలు కలిగిన మంచి ఔషదం వంటివి. బిడ్డ పుట్టిన మొదటి గంటలోపే ముర్రు పాలు పట్టించాలి.

ప్రజలకు అవగాహన

ప్రపంచ తల్లిపాల దినోత్సవ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. 'తల్లి పాలు ఇవ్వటాన్ని ప్రోత్సహిద్దాం..ఇది మనందరి బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్గించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సాధారణ, సి సెక్షన్ డెలివరీ రెండింటిలోనూ డెలివరీ అయిన ఒక గంటలోగా తల్లి తమ బిడ్డకు తప్పకుండా పాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది బిడ్డతో పాటు తల్లికి కూడా ఆరోగ్యకరం. తల్లి పాల వారోత్సవాల్లో ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. బిడ్డ ఆరోగ్యంగా ఎదగాలంటే తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలి. కాల్షియం ఎక్కువగా ఉండే ఆకుకూరలు, బాదం, జీడిపప్పు వంటివి కూడా తింటుండాలి. తినే ఆహారపదార్థాల్లో వెల్లుల్లి ఉండేలా చూడాలి. నువ్వుల నూనెతో చేసిన వంటకాలు తినటం మంచిది. తల్లి కూడా రోజూ ఎక్కువ పాలు తాగితే మంచిది. పిల్లలకు సరిపడేంతగా తల్లుల్లో పాలు ఉండాలంటే ..బిడ్డకు ఎక్కువ సార్లు పాలు పట్టడమే మార్గం. అందువల్ల చిన్నారులకు తరచుగా పాలు పట్టడం..అటు బిడ్డ ఆరోగ్యకర ఎదుగుదలకు..ఇటు తల్లి ఆరోగ్యానికి ఎంతో అవసరం. అప్పుడే పుట్టిన శిశువుకు చాలామంది నీరు, గ్లూకోజు, చక్కెర, తేనె వంటి పదార్థాలు తాగిస్తుంటారు. అది అంత క్షేమకరం కాదు. ఇలా చేయడం వలన కడుపు నిండి..అమ్మ పాలు తాగేందుకు ఆ బిడ్డ ప్రయత్నం చేయలేదు. అంతేగాక వీటి వల్ల చిన్నారులు సూక్ష్మ జీవుల బారిన పడే ప్రమాదం కూడా ఉంది. ఆరోగ్య సంరక్షణకు ఎంతో దోహదం చేసే ముర్రుపాలు చిన్నారులకు అందవు. తల్లి పాల వారోత్సవం సందర్భంగానైనా ప్రజలందరూ అపోహలకు తావివ్వకుండా తల్లిపాల పట్ల అవగాహన పెంచుకోవాలని ఆశిద్దాం.

- డాక్టర్ ఎల్. అనూష
మెడికల్ ఆఫీసర్,
తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,
పొందూరు మండలం,
శ్రీకాకుళం జిల్లా.

పోటీ కార్మికులతో షూటింగులు

బంద్ విచ్ఛిన్నమే లక్ష్యంగా నిర్మాతలు అగ్రిమెంట్ కోసం ఫెడరేషన్ పట్టు

పెరిగిన ధరలకు అనుగుణంగా తమ వేతనాలు పెంచాలని తెలుగు సినీ పరిశ్రమ కార్మికులు చేపట్టిన బంద్ రోజురోజుకూ ఉధృతమవుతోంది. కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నట్లుగా మూడేళ్లకు ఓసారి సినిమా కార్మికుల వేతనాలు పెంచాల్సి వుంది. గడువు ముగిసి రెండు నెలలు కావస్తున్నా, నాలుగు నెలలుగా గుర్తుచేస్తున్నా నిర్మాతల మండలి పట్టించుకోవటం లేదని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆలిండియా ఫిలిం ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్-యుఎన్ఐ-ఎంఇఐ అనుబంధం) ఆధ్వర్యంలో పోరుబాట పట్టిన విషయం తెలిసిందే. ఈనెల ఒకటో తేదీ నుంచి కార్మికులు 30 శాతం అగ్రిమెంట్ చేసుకున్న సినిమా షూటింగులకు మాత్రమే హాజరవుతున్నారు. మరికొందరు నిర్మాతలు మొండి పట్టుదలకు పోతున్నారు. ఏకంగా ముంబై, తమిళనాడు, పూణే వంటి ప్రాంతాల నుంచి పోటీ కార్మికులను రప్పిస్తున్నారు. ఇది టాలీవుడ్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఆగ్రహాన్ని తెప్పించింది. తాము న్యాయబద్ధంగా వేతనాలు అడుగుతుంటే పోటీ కార్మికులను తెస్తారా? అంటూ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టాలీవుడ్ నటుడు, ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాకు ముంబై నుంచి లైట్‌మెన్లను రప్పించారు. ఆ తర్వాత మరికొన్ని నిర్మాణ సంస్థలు ఇదే విధంగా టెక్నీషియన్లను పిలిపించాయి.

ఒప్పందం అమలుచేయబోమంటూ హుకుం

ఎవరైతే నైపుణ్యం కలిగిన పే వర్కర్స్ తామివ్వగలిగే వేతనానికి పనిచేస్తారో వాళ్లతో షూటింగ్స్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుగు ఫిలిం చాంబర్ ఒక తీర్మానం చేసింది. మూడేళ్ల అగ్రిమెంట్‌కు తగ్గట్టుగా ఇప్పుడు తాము వేతనాలు పెంచలేమని పేర్కొంది. ప్రతి ప్రాజెక్టు అవసరాలు, వ్యక్తుల సామర్థ్యాల ఆధారంగా కార్మికులతో కలిసి పనిచేసే పూర్తి స్వేచ్ఛ నిర్మాతలకు ఉంటుందని తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చిన్న నిర్మాతలు భరించలేని స్థాయిలో వేతనాలు పెంపు డిమాండ్ ఉందని చెబుతోంది. కనీస వేతనాల చట్టం ప్రకారం ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని కార్మిక శాఖ కమిషనర్ ప్రకటించారని వెల్లడించింది. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా నిర్మాతల స్వయంప్రతిపత్తిని సమర్థిస్తూ ఒక ఉత్తర్వును జారీ చేసిందని వివరించింది.

చర్చలు ఫలించేనా?

టాలీవుడ్‌లో ఈ సమస్యపై చర్చించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల సినీ పెద్దలు ఇప్పటికే కథానాయకుడు చిరంజీవిని మంగళవారం రాత్రి ఆయన స్వగృహంలో కలిసి చర్చించారు. పవన్‌కళ్యాణ్‌తో కూడా చర్చించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 30 శాతం పెంచలేమనీ, 5 నుంచి 10 శాతం వేతనాలు పెంచుతామని నిర్మాతలు అంటున్నారు. తెలుగు ఫిలిం ఛాంబర్, ఫిలిం వర్కర్స్ ఫెడరేషన్ సంయుక్త సమావేశం ఏర్పాటుచేసే విధంగా తెలంగాణా ప్రభుత్వం మధ్యవర్తిత్వాన్ని వ్యవహరిస్తామని ప్రకటించింది. ఢిల్లీలో ఉన్న సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇదే విషయాన్ని వ్యక్తంచేశారు. పెరిగిన ధరల నేపథ్యంలో కార్మికుల వేతనాల పెంపు సమంజసమేనని ప్రకటించారు. దూర ప్రాంతాల నుంచి సినిమాల్లోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న తమకు ఇచ్చే వేతనాలు ఖర్చులకు కూడా సరిపోవటం లేదని, ఇంటి అద్దెలు చెల్లించటానికి ప్రతినెలా అప్పులు చేయాల్సివస్తోందని వాపోతున్నారు. సినిమా బడ్జెట్ వ్యయం పెరిగిందనీ, ఆర్టిస్టుల రెమ్యూనరేషన్లు తడిచి మోపెడు అవుతున్నాయని నిర్మాతల వాదన. కార్మిక శాఖ కూడా రంగంలోకి దిగి తమకు న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు. సినీ పెద్దలంతా ఐక్యంగా ఇరుపక్షాల వారితో చర్చించటం ద్వారా ఏకాభిప్రాయంతో షూటింగ్‌ల బంద్ సమస్య కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

సిరాజ్‌కు ఘన స్వాగతం

- టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 12స్థానాలు మెరుగుపర్చుకొని 15వ ర్యాంక్‌కు హైదరాబాదీ పేసర్
- ప్రసిధ్‌కూ కెరీర్ బెస్ట్ ర్యాంక్

ఆత్మీయ స్వాగతం పలుకుతున్న అభిమానులు

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) ప్రకటించిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సత్తా చాటారు. ఐసిసి బుధవారం ప్రకటించిన టెస్ట్ బౌలర్ల జాబితాలో వీరు కెరీర్ బెస్ట్ ర్యాంకుల్లో నిలిచారు. ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో 23వికెట్లు తీసిన మహ్మద్ సిరాజ్ ఏకంగా 12స్థానాలు ఎగబాకి 15వ స్థానం నిలిచాడు. దీంతో సిరాజ్ 674రేటింగ్ పాయింట్లు ఆ స్థానంలో ఉన్నాడు. ఇక ప్రసిధ్ కృష్ణ ఏకంగా 25స్థానాలు మెరుగుపరుచుకొని 59వ స్థానంలో నిలిచాడు. అతని ఖాతాలో 368 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఐదో, చివరి టెస్ట్‌లో ఎనిమిది వికెట్లు తీసిన ప్రసిధ్ కెరీర్ బెస్ట్ ర్యాంక్ ఇదే. టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా 889 రేటింగ్ పాయింట్ల అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. బ్యాటర్ల జాబితాలో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ బ్యాటర్ల జాబితాలో టాప్-5లో చోటు దక్కించుకున్నాడు. జైస్వాల్ 792రేటింగ్ పాయింట్లతో ఏకంగా మూడోస్థానంలో నిలువగా.. రూట్, బ్రూక్ టాప్-2లో కొనసాగు తున్నారు. ఈ క్రమంలో రిషబ్ పంత్ టాప్-10లో చోటు దక్కించుకొన్నాడు. తాజా టెస్ట్ బ్యాటర్ల జాబితాలో రిషబ్ పంత్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఐదో, చివరి టెస్ట్‌లో గాయం కారణంగా బెంచ్‌కే పరిమితం కావడంతో అతడు 8వ స్థానంలో నిలిచాడు.

ఆసియాకప్‌కు జట్టు ఎంపికపై సెలెక్టర్ల కసరత్తు షురూ

ఇంగ్లండ్ పర్యటనలో యువ క్రికెటర్లు అద్భుత ప్రదర్శన కనబర్చడంతో ఆసియాకప్‌కు జట్టు తలనొప్పిగా మారింది. ఇంగ్లండ్ నుంచి భారత ఆటగాళ్లంతా స్వదేశానికి తిరుగు ముఖం పట్టారు. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా అద్భుతంగా రాణించింది. దీంతో భారత జట్టు ఆసియా కప్‌కు ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ మొదలు కానుంది. ఈ టోర్నీ టి20 ఫార్మాట్‌లో జరగనున్న దృష్ట్యా జట్టును ఎంపిక చేసేందుకు సెలక్షన్ కమిటీకి పెద్ద సవాల్‌గా మారింది. టి20 జట్టు ఇటీవల కాలంలో నిలకడగా రాణిస్తోంది. ఈ ఫార్మాట్‌కు టీమిండియా కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ వ్యవహరిస్తున్నాడు. ఆగస్టు మూడోవారంలోపు ఆసియా కప్ కోసం బిసిసిఐ జట్టును ప్రకటించాల్సి ఉంది. ఈ క్రమంలో జట్టులో చోటు కోసం జైస్వాల్, గిల్, సాయి సుదర్శన్ రేసులో ఉన్నారు. ఈ సిరీస్ ముగిసిన తర్వాత భారతజట్టు వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్‌లో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఐపిఎల్ చివరి సీజన్‌లో యశస్వి మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఐపిఎల్‌లో జైస్వాల్ 160 స్ట్రయిక్ రేట్‌తో 559 పరుగులు, గిల్ 15మ్యాచుల్లో 650 పరుగులు చేశాడు. ఇక సాయి సుదర్శన్ 156 స్ట్రయిక్ రేట్‌తో 759 పరుగులు చేసి సీజన్-18 ఐపిఎల్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఈ ముగ్గురికి ఆసియాకప్ జట్టులో చోటు కల్పిస్తారా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. ఆసియా కప్‌లో ఆడే ప్లేయర్స్ అంతా ఫైనల్ వరకు 21 రోజులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. ఆసియా కప్ కోసం 17మంది సభ్యులతో జట్టును ఎంపిక చేయనుండగా.. ప్రస్తుతం ఉన్న ఆప్షన్లను సెలెక్టర్లు జాగ్రత్తగా పరిశీలించన్నట్లు బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. ఇక బౌలింగ్ విభాగం ఎంపిక కూడా సెలెక్టర్లకు ఇబ్బందికరంగా మారనుంది. కీలక టోర్నీకి ఫాస్ట్ బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఆసియా కప్ తర్వాత వెంటనే వెస్టిండిస్‌తో సిరీస్ నేపథ్యంలో వీరి విషయంలో సెలెక్టర్లు జాగ్రత్తలు తీసుకునే అవకాశాలున్నాయి. అదే సమయంలో సెలక్షన్ కమిటీ సమావేశానికి ముందు ఫిట్‌నెస్‌ను సైతం అంచనా వేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆసియాకప్-2025 యుఎఇ వేదికగా సెప్టెంబర్ 9నుంచి జరగనున్న సంగతి తెలిసిందే.

'డేవిడ్ రెడ్డి'గా మనోజ్



మంచు మనోజ్ నటిస్తున్న 21వ చిత్రం 'డేవిడ్ రెడ్డి' పేరుతో తెరకెక్కుతోంది. హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్‌గా ఇది సిద్ధం కానుంది. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో 1897 - 1922 మధ్య జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందనుంది. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు.

నేను చేసిన మంచే మాట్లాడుతుంది



హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌కి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ట్రోలింగ్ గురించి స్పందించారు. వాటి గురించి తాను మాట్లాకపోయినా తను చేసిన మంచే మట్లాడుతుందని అన్నారు. 'సోషల్ మీడియాలో వచ్చే విమర్శలకు మీరు ఎందుకు స్పందించరు అని అందరూ అడుగుతుంటారు. నేనెప్పుడూ స్పందించను. ఎందుకంటే నేను చేసిన మంచి కార్యక్రమాలు, నాపై అభిమానులు చూపించే ప్రేమే నాకు రక్షణ కవచాలు. నేను మాట్లాడాల్సిన అవసరం లేదు. నా మంచితనమే మాట్లాడుతుంది. మనల్ని ఎవరైనా మాటలు అంటే మన మంచే సమాధానం చెబుతుంది. అందుకే నేను ఎప్పుడూ దేనికీ స్పందించను. నాలాగే మంచి చేసే నా తమ్ముళ్లకు సాయంగా ఉంటాను. ఇతర దేశాల్లోని అభిమానులు కూడా నా మాటని స్ఫూర్తిగా తీసుకుని రక్తదానం చేస్తున్నారు. నా పేరుని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు. అది చాలు' అన్నారు. ఇంకా బ్లడ్ బ్యాంక్ ద్వారా సాయం పొందిన ఓ మహిళా అభిమాని తనపై అనుచితంగా మాట్లాడిన ఓ రాజకీయ నాయకుడిని ప్రశ్నించిన సంఘటన గురించి కూడా చిరంజీవి ప్రస్తావించారు.

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ప్రైజ్ మనీ పెంపు

- 20% పెంపుదల చేస్తున్నట్లు ప్రకటన

న్యూయార్క్: టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని పెంపుదల చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని పెంపుదల చేయాలని కోరుతూ స్టార్ ఆటగాళ్లు జకోవిచ్, కోకో గాఫ్, సబలెంక, సిన్నర్ తదితరులు లేఖలు పంపిన క్రమంలో టోర్నీ నిర్వాహకులు ప్రైజ్ మనీని పెంపుదల చేస్తున్నట్లు సమాచారం. 2025లో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లకు అందజేసిన ప్రైజ్ మనీని పెంపుదల చేయగా.. తాజాగా యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు కూడా 20శాతం ప్రైజ్‌మనీని పెంపుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు యుఎస్ టెన్నిస్ అసోసియేషన్ బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. యుఎస్ ఓపెన్‌లో ఆటగాళ్లందదరూ కలిపి భారత కరెన్సీలో సుమారు 746కోట్ల రూపాయలు (85 మిలియన్ డాలర్లు) ప్రైజ్‌మనీ అందుకోనున్నారు. సింగిల్ విజేత 5 మిలయన్ డాలర్ల ప్రైజ్ మనీ అందుకోనుండగా.. గత ఏడాదితో పోల్చిచూస్తే టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని 20 శాతం నుంచి 90శాతం మిలియన్ డాలర్లకు పెంచుతున్నట్లు తాజాగా తెలిపారు. నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలోకెల్లా ఇదే అత్యధిక పారితోషికం కావడం విశేషం. 2024లో 75మిలియన్ డాలర్ల ప్రైజ్ మనీ అందజేయగా.. ఈసారి అది 90మిలియన్ డాలర్లకు చేరింది.

టి20ల్లో రషీద్ ఖాన్ రికార్డు

కాబూల్: ఆఫ్ఘనిస్తాన్ దిగ్గజ స్పిన్నర్ రషీద్ ఖాన్ టి20 క్రికెట్‌లో రికార్డు సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో 650 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు నమోదు చేశాడు. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న 'ది హండ్రెడ్ లీగ్' ఆరంభ మ్యాచ్‌లో ఓవల్ ఇన్విన్సిబుల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రషీద్ ఖాన్ లండన్ స్పిరిట్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో 20 బంతుల్లో (3/11) అదర గొట్టాడు. 15 డాట్ బాల్స్ వేసిన రషీద్.. వేన్ మాడ్సెన్, లియామ్ డాసన్, ర్యాన్ హిగ్గిన్స్‌ను ఔట్ చేశాడు. తొలుత బ్యాటింగ్ కు దిగిన లండన్ స్పిరిట్ జట్టు 94 బంతు ల్లో 84 పరుగు లే చేసి ఆలౌట్ కాగా.. ఓవల్ ఇన్విన్సిబుల్స్ 4 వికెట్లు లక్ష్యాన్ని ఛేదించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68